Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 57 • సంచిక:288 • శనివారం 2 ఫిబ్రవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00

• Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore





మోడీ రైతు బాణం

రొక్కం ₹6000

12 కోట్ల మంది రైతులకు వరం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి

ఓట్ ఆన్ అకౌంట్
ఆమోడీయం

మళ్లీ మేమే వస్తాం మరిన్ని రాయితీలిస్తాం
- బడ్జెట్‌పై పీయూష్ గోయల్



మహిళలకు పెద్దపీట

అంగన్‌వాడీల జీతాలు 50% పెంపు

ఉద్యోగులకు భారీ ఊరట

ఆదాయ పరిమితి ₹5 లక్షలు

ఎన్నికల ఏరువాక



ఎన్నికల వేళ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ జనరంజకంగా రూపొందింది. ఊహించినట్లుగానే మోడీ సర్కారు పలు ప్రజాకర్షక పథకాలకు ఈ పద్దులో పెద్దపీట వేసింది. అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునేవిధంగా సంచలనాత్మకరీతిలో మధ్యంతర బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆర్థికపద్దు ప్రతిపాదనలు ఓటర్ల మనోభావాలకు అనుగుణంగా ఉన్నాయి. రాజకీయ వివాదానికి, చిక్కులకు ఆస్కారం లేకుండా మోడీ ప్రభుత్వం ఓటర్లపై వరాల జల్లు కురిపించింది. మధ్యతరగతి వేతనజీవులు, రైతులు, అసంఘటిత కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు ఇలా అన్ని వర్గాలకు బడ్జెట్‌లో తాయిలాలు పంచిపెట్టారు. ముందుగా అనుకున్నట్లే రైతే రాజు నినాదానికి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి రైతుకు సాలుసరి ఆరువేల ఆర్థిక సహాయం ప్రకటించారు. వేతన జీవులకు ఊరటనిచ్చింది. ఆదాయపన్ను పరిధిని రెట్టింపు చేసింది. మొత్తంగా ఆరున్నర లక్షల వరకు వేతన జీవులు పన్ను చెల్లించాల్సిన అవసరం లేని ప్రతిపాదనలు తీసుకొచ్చింది. అసంఘటిత రంగ కార్మికులపై ఎనలేని ప్రేమను కనబరిచింది. 60 ఏళ్ల పైబడిన ఈ కార్మికులకు మూడువేల పెన్షన్ ప్రకటించి భరోసా ఇచ్చింది. పెన్షన్ విధానంలోనూ నిర్దిష్ట మార్పులు చేసింది.

మరిన్ని వివరాలు 2,7,8,9,10,11ల్లో...

ఇది ట్రైలరే

ఇది అందరి ఆకాంక్షలకు ప్రతిబింబం
ఉద్యోగస్తులతో సహా మధ్యతరగతి వారందరికీ ఊరటనిచ్చే బడ్జెట్
40 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు ఆశాకిరణం ఈ బడ్జెట్
ప్రధాన మంత్రి మోడీ

3 నిర్ణయాలు... 23 కోట్ల ఓట్లు

ఎన్నికల వేళ ఓటు బ్యాంక్‌కు ఎర
వైరి వర్గాల ఎత్తులను తిప్పికొట్టే వ్యూహం

10లో

కేసీఆర్ పథకానికి కాపీ



రైతుబంధుకి సాటిలేదు

ప్రధాని మోడీకి కేసీఆరే స్ఫూర్తి
నకలే అయినా రైతులకు మేలు చేస్తున్నందుకు సంతోషం
తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు

3లో

అసంఘటిత కార్మికులకు శుభవార్త

నెలకు పింఛన్ ₹3000

హవ్వ.. రైతుకి అవమానం

₹17 అన్నదాతకు రోజుకి ఇస్తారా?



ఇది రోజు కూలీయా?
రాహుల్ ఆగ్రహం

అరకొర నిధులే

కాళేశ్వరం, ఇతర హామీల ఊసులేదు
ప్రాజెక్టులకు పైసా లేదు
తగ్గిన కేంద్ర ప్రాయోజిత పథకాల వాటా
సింగరేణికి రూ.1850 కోట్లు
హైదరాబాద్ ఐఐటీకి రూ.80 కోట్లు
ట్రైబల్ వర్సిటీకి రూ.4కోట్లు
రైతు సాయం ఒక్కటే ఊరట

3లో

రాష్ట్ర రైతుకు డబుల్ ధమాకా

అటు నుంచి ఆరువేలు.. ఇటు నుంచి పదివేలు

చిన్న, సన్నకారు రైతులకు ఏటా కనీసం రూ.16 వేల చొప్పున ఖాతాల్లోకి నగదు బదిలీ

ఐదెకరాల భూమి ఉన్న 47.08 లక్షల మంది రైతులకు లబ్ధి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశాలు ఏమైనప్పటికీ తెలంగాణ రైతులకు మాత్రం రెండు కోణాల్లో లబ్ధి చేకూరుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌లో ప్రకటించిన 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబం యూనిట్‌గా తీసుకుంటే ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగివున్న ప్రతి రైతుకు యేటా రూ.16వేల చొప్పున నగదు అందుతుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పంట పెట్టుబడి మద్దతు పథకం ద్వారా ఎకరాకు రూ.4వేల చొప్పున రెండు పంటలకు కలిపి యేటా రూ.8వేలు అందుతోంది. వచ్చే వ్యవసాయ సంవత్సరం నుంచి ఆ మొత్తం రూ.10వేలకు పెరుగుతోంది. కేంద్రం ప్రకటించిన కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి ప్రతియేటా రూ.6వేల చొప్పున పొందనుంది. మూడు 3వ పేజీలో...

కేంద్రం మీద సమరానికి

నల్ల చొక్కాలో చంద్రబాబు



కేంద్ర ప్రభుత్వ వివక్షపై నిరసన ఉద్యమంలో భాగంగా నల్లచొక్కాతో ఏపీ అసెంబ్లీకి వెళుతున్న చంద్రబాబు

అమెరికాలో అరెస్టులు

పోలీసుల చెరలో మరో 10మంది

- కాలిఫోర్నియాలో కరీంనగర్ యువతి అరెస్ట్
- గర్భవతి కావడంతో సొంత పూచీకత్తుపై విడుదల
- కేసుల విచారణకు గంటకు 500 డాలర్లు డిమాండ్ చేస్తున్న అమెరికా లాయర్లు
- రంగంలోకి దిగిన భారత అటార్నీలు.. ఆంధ్ర-తెలంగాణ సంఘాలు
- ఆస్టిన్, సెయింట్యానియాలో తాజా అరెస్టులు.. విచారణ
- ఇప్పటికే హూస్టన్ జైలుకు పలువురు విద్యార్థులు





హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రరాజ్యం అమెరికాలో తాజాగా వెలుగు చూసిన నకిలీ వర్సిటీ ప్రవేశాల వ్యవహారంలో మరో పదిమంది భారత విద్యార్థులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఆస్టిన్, సానెటోనియా రాష్ట్రాల్లో ఉంటున్న ఈ పదిమంది విద్యార్థులను అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న భారత విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను విచారించేందుకు అమెరికాకు చెందిన న్యాయవాదులు 5వ పేజీలో...



నవభారత్ బాటలో

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కేంద్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంచలనాత్మక విధాన నిర్ణయాలతో అయిదేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఎన్డీయే ప్రభుత్వం తన చివరి మధ్యంతర బడ్జెట్‌ను 2019-20 సంవత్సరానికిగాను ప్రవేశపెట్టింది. అనారోగ్య కారణాలతో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అమెరికాలో చికిత్స తీసుకుంటుండడంతో కీలక దశలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే బాధ్యతలను రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తన భుజస్కంధాలపై వేసుకున్నారు. అయిదేళ్లుగా ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, తీసుకున్న విధాన నిర్ణయాలు, వచ్చిన ఫలితాలపై గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో తొలి భాగంలో విస్తృత స్థాయిలో వివరించారు.

న్యూఢిల్లీ: 21వ శతాబ్దిలో అంతర్జతీయంగా పోటీకి తట్టుకొని నిలబడే విధంగా భారతదేశాన్ని క్రియాశీలకంగా మార్చడంలో తీసుకొనే విధాన నిర్ణయాలు కీలకమైనవి. గతంలో ప్రభుత్వాలు విధానపరమైన పక్షవాతంతో బాధపడుతుండేవని గోయల్ పేర్కొన్నారు. అయిదేళ్ల ఎన్డీయే సాధించిన ఘన విజయాల్లో ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తీసుకొని రావడం, మార్పు వైపుగా పెద్ద పెద్ద అంగలు వేయడం కీలకమైనవని పేర్కొన్నారు. దేశం నిరంతరంగా అభివృద్ధి పథకంలో సాగడానికి అవసరమైన బలమైన పునాదులు ఎన్డీయే హయంలో పడ్డాయన్నారు. దీంతో సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని, ఫలితంగా ప్రజలందరికి నాణ్యమైన జీవనం అందుతుందన్నారు.

జిగేల్మన్న ఆర్థిక వెలుగులు

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై భారత దేశానికి గడిచిన అయిదేళ్లలో అత్యంత ప్రాధాన్యత లభించిందని గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ దశలోనే దేశ సూక్ష్మ ఆర్థిక స్థిరత్వం సాకారమైందన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చిన తరువాత ఏ ప్రభుత్వంలో కన్నా దేశ జీడీపీ సగటు పరుగులు తీసిందని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందన్నారు. 2014లో 11వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, ఇప్పుడు ఆరవ స్థానానికి ఎగబాకడంలో మోడీ ప్రభుత్వం అవలంభించిన ఆర్థిక విధానాలే కారణమన్నారు.

10 శాతం నుంచి 4.6 శాతానికి..

ఆర్థిక సమతుల్యతను నిలబెట్టుకుంటూ రెండంకెల ద్రవ్యోల్బణానికి ముక్కుతాడు వేశామన్నారు. 2009-2014లో దేశ ద్రవ్యోల్బణం 10.1 శాతముంటే దాన్ని సగటున 4.6 శాతానికి తీసుకొచ్చామన్నారు. డిసెంబర్, 2018లో ద్రవ్యోల్బణం అతి స్వల్పంగా రికార్డు స్థాయిలో 2.19 శాతానికి చేరిందని గోయల్ గుర్తు చేశారు. ద్రవ్యోల్బణాన్ని తగ్గించకుండా పోయి ఉంటే భారతీయ కుటుంబాలు ఆహారం, రవాణ, వినియోగ వస్తువులు, గృహాలు వంటివాటిపై 35 నుంచి 40 శాతం అధికంగా వ్యయం చేయాల్సి ఉండేదన్నారు.

ద్రవ్యలోటు తాట తీశాం..

ఏడు సంవత్సరాల క్రితం ఆరు శాతం ఉన్న ద్రవ్యలోటు 2018-19లో 3.4 శాతానికి చేరిందని గోయల్ వెల్లడించారు. జీడీపీలో కరెంటు ఖాతా లోటు అప్పుడు 5.6 శాతం ఉందని, ఇప్పుడు 2.5 శాతానికి తీసుకొని రావడలో మోడీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.

రాష్ట్రాలకు పెద్దపీట!


కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాను పెంచొద్దని ఫైన్సాన్స్ కమిషన్ చేసిన సిఫార్సులను కూడా పక్కన పెట్టి వాటిని 32 శాతం నుంచి 42 శాతానికి పెంచమన్న గోయల్.. దీని ఫలితంగానే రాష్ట్రాల వద్ద ఇబ్బడిముబ్బడిగా నిధులు పోగుపడ్డాయన్నారు.

ప్రవాహంలా విదేశీ పెట్టుబడులు..

బలమైన పునాదులతో, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో భారత్ వంటి దేశం విదేశీ పెట్టుబడులను కూడా అదే స్థాయిలో ఆకర్షిస్తుంది. భారత్ ఆర్థిక వ్యవస్థ అయిదేళ్లలో అభివృద్ధి చెందింది అనడానికి రూ.1,70,38,90,75,000 విదేశీ పెట్టుబడులు దేశంలోకి వచ్చాయని పీయూష్ వెల్లడించారు. విదేశీ పెట్టుబడులు దేశంలోకి రావడానికి నిబంధనలను సరళీకృతం చేయడంతోనే ఇంత పెద్ద విజయం దక్కిందన్నారు.

అప్పుల ఊబిలోంచి సమృద్ధిలోకి..

ఆర్బీఐ లెక్కల ప్రకారం 2008-14 మధ్య కాలంలో



తీవ్రస్థాయిలో రుణ భారం ఉండేదని గోయల్ గుర్తు చేశారు. దీనికి ప్రధాన కారణంగా తీసుకున్న రుణాలు చెల్లించకపోవడం, నిరర్థక ఆస్థులు. అప్పట్లో ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు రూ.18 లక్షల కోట్ల నుంచి రూ.52 లక్షల కోట్ల వరకు రుణాలను మంజూరు చేశాయి. వాటిలో అత్యధికంగా మొండి బకాయిలుగా తేలాయి. దీంతో 2014 నాటికి నిరర్ధక ఆస్థులు రూ.5.4 లక్షల కోట్లకు చేరాయి. మొండి బకాయిలపై 2015లో జరిపిన సమీక్షలో రుణ ఎగవేతదారులు బయటపడ్డారని గోయల్ వెల్లడించారు. దీంతో దివాళా చట్టం తీసుకొచ్చి నిరర్ధక ఆస్థులను రూ.3 లక్షల కోట్ల వరకు తగ్గించమన్నారు. విలీన ప్రక్రియతో బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచగలిగామన్నారు.

అవినీతికి అడ్డుకట్ట..!

అవినీతి రహిత ప్రభుత్వాన్ని అందించడంలో ఎన్డీయే కూటమి విజయం సాధించిందని, పారదర్శకత, జవాబుదారీతనం ఈ అయిదేళ్లలో పెరిగిదని పీయూష్ గోయల్ చెప్పారు. ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు వెళ్లిన వారిపై కఠిన చర్యలు, బినామీ నిరోధక చట్టం, రియల్ ఎస్టేట్ క్రమబద్ధీకరణ చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానిదేన్నారు.

స్వచ్ఛతే జీవన సారం...

మహాత్మాగాంధీ బోధనను ప్రేరణగా తీసుకొని ప్రపంచంలోనే అతి పెద్ద ప్రవర్తనపరమైన ఉద్యమాన్ని స్వచ్ఛ్ భారత్ పేరుతో తీసుకొచ్చి దేశంలో 5.45 లక్షల గ్రామాల్లో బహిరంగ మలమూత్ర విసర్జనను సంపూర్ణంగా నిర్మూలించిన ఘనత కూడా మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని గోయల్ ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో 130 కోట్లమంది ఉన్న భారత దేశం స్వచ్ఛ్ భారత్ అభియాన్ పథకాలన్ని మనస్ఫూర్తిగా అమలు చేసిందన్నారు.

పేదరికమే కొలమానంగా..!

దేశంలోని వనరులపై తొలి హక్కు పేదలకే దక్కాలన్నా ఆర్థికమంత్రి పీయూష్ గోయల్.. ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల చట్రాన్ని ఏమాత్రం మార్చకుండానే అగ్ర వర్ణాల్లో నిరుపేదలకు కూడా రిజర్వేషన్ల కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లను రికార్డు సమయంలో అన్ని పార్టీల ఆమోదంతో తీసుకొని రావడంమే కాకుండా అమలు సైతం చేస్తున్నామని ప్రకటించారు.

ఆకలితో ఎవరూ నిద్రపోరాదు..!

పేదలకు ఆహార భద్రత కల్పించడానికి మోడీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, 2013-14 సంవత్సరంలో దీని కోసం నాటి యూపీయే ప్రభుత్వం కేవలం రూ.92 వేల కోట్లు కేటాయిస్తే, 2018-19 ఆర్థిక సంవత్సరంలో మోడీ ప్రభుత్వం దాన్ని ఒక లక్షా డెబ్బై వేల కోట్లకు పెంచిందన్నారు.

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి!

పట్టణాల్లో ఉండే మౌలిక సదుపాయాలన్నీ గ్రామాల్లో కూడా ఉండాలనే తలంపుతో గడిచిన అయిదేళ్లుగా ఒట్టి హామీలకే పరిమితం కాకుండా నిధులు కేటాయింపు కూడిన కార్యాచరణను మోడీ ప్రభుత్వం చేసి చూపించిందన్న గోయల్, గ్రామీణ ఆత్మను సజీవంగానే ఉంచామన్నారు.

- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద గ్రామీణ రోడ్ల నిర్మాణం మూడు రెట్లు పెరిగింది.
- 17.84 లక్షల గ్రామాల్లో 15.80 గ్రామాల్లో పక్కా రోడ్లు నిర్మించారు.
- గ్రామీణ ప్రాంతాల్లో అవాస యోజన కింద 1.53 కోట్ల గృహాలను నిర్మించారు.
- గ్రామీణ రహదారుల కోసం రూ.19 వేల కోట్లు

కేటాయించారు.

పేద జీవితాల్లో విద్యుత్ వెలుగులు..

2014కి ముందు 2.5 కోట్ల కుటుంబాలు కరెంటు లేక చీకట్లో మగ్గుతుండేవి. సౌభాగ్య యోజన కింద దేశంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చామని పీయూష్ గోయల్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలందరికీ ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ప్రైవేటు భాగస్వామ్యంతో 143 కోట్ల ఎల్ఈడీ బల్బులను అందించడం ద్వారా విద్యుత్ బిల్లులపై ఏటా రూ.50 వేల కోట్ల పొదుపు సాకారమైందన్నారు.

బాహుబలి ఆయుష్మాన్ భారత్!


దేశ జనాభాలో సగానికి సగం మందికి ఏటా అయిదు లక్షల ప్రయోజనం లభించే ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టిన ఘనత కూడా మోడీ ప్రభుత్వానిదేనని గోయల్ చెప్పారు.

దేశమంతా ఎయిమ్స్ !

2014కి ముందు దేశంలో కేవలం ఏడు ఎయిమ్స్ మాత్రమే ఉండేవని వీటిని 22కి పెంచి, ప్రామాణిక వైద్యాన్ని సామాన్యులకు సైతం అందించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. హరియాణాలో 22వ ఎయిమ్స్‌ను నెలకొల్పుతున్నట్లు గోయల్ ప్రకటించారు.

దేశానికి వెన్నుముక!

దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేసే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం చరిత్రలో మొదటిసారిగా 22 పంటలకు కనీస మద్దతు ధర వాటి విలువ కన్నా అదనంగా యాభై శాతం కల్పించారని గోయల్ చెప్పారు.



- పంట రుణాలను రూ.11.68 లక్షల కోట్లకు పెంచారు.
- భూసార ఆరోగ్య కార్డుల జారీ
- నాణ్యమైన విత్తనాలు, సాగు పథకాలు
- వేప పూత పూసిన యూరియా పంపిణీ
- చేపల ఉత్పత్తి ఏడు శాతం పెరిగింది

రైతు కష్టాలకు ఇవీ కారణాలు..



- అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ తగ్గడం
- ఆహార ఉత్పత్తి ఇబ్బడి ముబ్బడిగ పెరగడం
- చిన్న కమతాల్లో సాగుతో తగ్గిన కుటుంబ ఆదాయం

2 కోట్ల ఉద్యోగాల కల్పన

ఆర్థిక రంగం సంఘటిత కావడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయని, గడిచిన రెండేళ్లలో రెండు కోట్ల ఉద్యోగాల సృష్టి జరిగిందని గోయల్ వెల్లడించారు.



- నూతన పింఛన్ పథకాన్ని సరళీకృతం చేశారు..
- ఉద్యోగి వాటా 10 శాతం, ప్రభుత్వం వాటా 4 శాతం
- అన్ని కేటగిరీల్లో కూలీల కనీస వేతనం 42 శాతం పెరిగింది
- ఈఎస్ఐకి సీలింగ్ రూ.21 వేలకు పెంచారు
- అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు 50 శాతం వేతనం పెంపు



గోయల్ నోట 80 సార్లు కోట్ల మాట

న్యూఢిల్లీ: లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ నోట కోట్లు అనే మాట పదేపదే వినిపించింది. అంకెల గారడీతో పదనిసలు పలికించిన గోయల్ నోట... కోట్లు, విల్, ప్రభుత్వం, భారత్, టాక్స్ వంటి పదాలు పదేపదే వచ్చాయి. బడ్జెట్ ప్రసంగంలో గోయల్ నోట కోట్లు అనే పదం 80 సార్లు రాగా..విల్ 76 సార్లు, ప్రభుత్వం 60 సార్లు,టాక్స్ అనే పదం 46 సార్లు వాడగా.. లక్షలు అనే పదం 32 సార్లు, ఇయర్ 29 సార్లు, పెంపు అనేపదం 23 సార్లు గోయల్ నోట వచ్చాయి.

మహిళాభివృద్ధి వారి నేతృత్వంలోనే..

గ్రామీణ మహిళ జీవితాల్లో వెలుగులు నింపే ఉద్దేశ్యంతో ఇప్పటి వరకు దేశంలో ఆరు కోట్ల గ్యాస్ కనెక్షన్లకు ఉచితంగా అందించామని, మరో రెండు కోట్ల కనెక్షన్లను ఈ ఆర్థిక సంవత్సరంలో ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉజ్వల పథకం భారతదేశ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన పథకంగా గోయల్ అభివర్ణించారు.

- ముద్ర రుణాలు పొందిన వారిలో 70 శాతం మంది మహిళలే..
- మాతృత్వ సెలవులు 26 వారాలకు పెంపు

సైనికుడి గౌరవమే దేశ గౌరవం!

నలభై సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సైనిక దళాల పెన్షన్ సమస్యను ఎన్డీయే ప్రభుత్వం ఒక కలం పోటుతో పరిష్కరించిందని, ఒక ర్యాంకు, ఒక పెన్షన్‌ను సాకారం చేసి సైనికుల గౌరవాన్ని పెంచిందని గోయల్ చెప్పారు.

- వన్ ర్యాంకు, వన్ పెన్షన్‌కి రూ.35 వేల కోట్ల వ్యయం చేశారు..
- మిలటరీ పే స్కేలు పెంచారు..
- ప్రాణాపాయ స్థితిలో విధులు నిర్వహించే వారికి ప్రత్యేక అలవెన్సులు
- రక్షణ బడ్జెట్ తొలిసారిగా రూ.3 లక్షల కోట్లు దాటబోతోంది

జన్‌ధన్‌తో ప్రజలకు ఆర్థిక సాధికారత

జన్ ధన్ ఖాతాలను ప్రారంభించడం, వీటికి ఆధార్‌తో అనుసంధానం చేయడంతో ప్రభుత్వ ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారులకే చేరడం బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక చర్యగా పీయూష్ గోయల్ అభివర్ణించారు. బ్యాంకింగ్ రంగానికి వెలుపల ఉండిపోయిన అత్యధికులకు జన్‌ధన్‌తో ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చామన్నారు.

- అయిదేళ్లలో 34 కోట్ల జన్ ధన్ ఖాతాలు
- బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం
- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దళారీ వ్యవస్థ అంతం

ఒక దేశం.. ఒక పన్ను..

దేశాభివృద్ధి దశాబ్దాల తరబడి స్థిరంగా కొనసాగడానికి అవసరమైన పన్ను వ్యవస్థను కూడా అయిదేళ్ల కాలంలో తీసుకొచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని గోయల్ అన్నారు. చారిత్రాత్మక సరుకులు, సేవా పన్నును అమలు చేయడంలో అన్ని పక్షాలను ఏకత్రాటిపైకి తీసుకొచ్చిన ఘనత కూడా ఎన్డీయేదేనన్నారు. జీఎస్టీతో పాటు ఇతర పన్ను సంస్కరణలకు కూడా ఈ అయిదేళ్లలోనే బీజం పడిందని చెప్పారు.



- జీఎస్టీతో ఇండియాలో ఏకీకృత మార్కెట్ ఏర్పడింది..
- పన్ను వసూళ్లు పెరిగాయి. పన్ను పరిధి పెరిగింది
- ఆన్‌లైన్‌లోనే పన్ను చెల్లింపులు
- రాష్ట్రాల మధ్య రవాణా తేలికైంది..
- చెక్‌పోస్టులు, లారీల క్యూలు మాయం అయ్యాయి
- జీఎస్టీతో క్రమేణా సామాన్యుడిపై పన్ను భారం తగ్గుతోంది
- జీఎస్టీతో 2018-19లో రూ.97,100 కోట్ల పన్ను వసూళ్లు
- రాష్ట్రాలకు ఏటా నికరంగా 14 శాతం గ్యారెంటీ ఆదాయం

గంటలో కోటి రుణం..

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వర్తకులకు 59 నిమిషాల్లో కోటి రుణం మంజూరు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గోయల్ వెల్లడించారు. జీఎస్టీ ఉన్న యూనిట్లకు ఈ రుణంలో రెండు శాతం వడ్డీ తగ్గించినట్లు చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి ప్రభుత్వ సంస్థలు తీసుకొనే అవుట్ సోర్సింగ్ సేవలు 25 శాతం పెరిగినట్లు చెప్పారు.



యువతకు సాధికారత!

ప్రపంచంలో అత్యధిక యువత ఉన్న దేశంగా భారత్‌లో ఒక కోటికి పైగా యువకులు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా స్వయం ఉపాధికి శిక్షణ ఇచ్చినట్లు గోయల్ చెప్పారు.

- ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా ద్వారా ఉపాధి కల్పన
- యువతకు 15.56 కోట్ల ముద్రా రుణాలు
- రూ.7,23,000 కోట్ల రుణాల మంజూరు
- ప్రపంచంలో రెండో అతి పెద్ద స్టార్టప్ హబ్‌గా భారత్

నల్లధనంపై పోరాటంలో భారత్ గెలుపు!

ప్రపంచ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన నిర్ణయంగా పెద్ద నోట్ల రద్దుని అంతర్జాతీయంగా కూడా గుర్తింపు పొందింది.

- పెద్ద నోట్ల రద్దుతో ఒక లక్షా ముప్పై కోట్ల నల్లధనం వెలుగులోకి..
- యాభై వేల కోట్ల అక్రమాస్తులు ప్రభుత్వం స్వాధీనంలోకి..
- రూ.6,900 కోట్ల బినామీ ఆస్తులు బయటపడ్డాయి..
- రూ.1,600 కోట్ల విదేశీ ఆస్తులు స్వాధీనం
- 3,38,000 దొంగ కంపెనీలు దొరికాయి..
- ప్రత్యక్ష పన్నుల్లో 18 శాతం పెరిగింది..

ప్రవాస భారతీయులకు అండదండగా..

ప్రపంచం నాలుగు చెరుగులా వ్యాపించిన భారతీయుల రక్షణ కోసం ఎన్నో చర్యలు చేపట్టినట్లు గోయల్ చెప్పారు. ఎన్ఆర్ఐల పెట్టుబడులు పెరగడానికి ప్రోత్సాహాలు ఇచ్చామన్నారు.

మౌలిక కల్పనకి ప్రత్యేక ప్రాధాన్యత!

దేశ నిర్మాణంలో మౌలిక సౌకర్యాల కల్పన వెన్నుముకలా పని చేస్తుందని గోయల్ చెప్పారు. రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు జాతీయ రహదారులకు అయిదేళ్లలో పెద్ద పీట వేసినట్లు వెల్లడించారు.

- సామాన్యుడికి సైతం గగన యానం
- విమానయాన రంగంలో పెరిగిన ఉపాధి
- ప్రతి రోజు 27 కి.మీ. జాతీయ రహదారి నిర్మాణం
- ఎగుమతులు, దిగుమతుల వృద్ధికి సాగరమాల
- కోల్‌కత్తా నుంచి వారణాశి వరకు ఉపరితల జల రవాణ

సురక్షితంగా రైల్వే ప్రయాణం!

రైల్వే చరిత్రలోనే అత్యంత సురక్షిత దశను ఈ అయిదేళ్లలో అనుభవించిందని గోయల్ చెప్పారు.

- బ్రాడ్‌గేజ్ లైన్‌లో కాపలా లేని క్రాసింగ్‌ల సమూల నిర్మూలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో వందేమాతరం ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

సౌర విద్యుత్‌లో రికార్డు!

పర్యావరణ ప్రభావంతో పడుతున్న దుష్పరిమాణాలకు ముగింపు పలకడానికి భారతదేశం నేతృత్వం వహించిందని గోయల్ చెప్పారు. గత అయిదేళ్లలో భారత దేశ సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పది రెట్లు పెరిగిందన్నారు.

డిజిటల్ రంగంలో పెను విప్లవం

గత అయిదేళ్లలో మొబైల్ డేటా వినియోగం దేశంలో యాభై రెట్లు పెరిగినట్లు గోయల్ చెప్పారు.

- మొబైల్ డేటా, వాయిస్ కాల్స్ చార్జీలు భారత్‌లోనే తక్కువ
- దేశంలో మొబైల్ మ్యాన్యు ఫ్యాక్చరింగ్‌లు 2 నుంచి 268కి పెరిగింది.
- 3 లక్షల కామన్ సర్వీసింగ్ కేంద్రాలు వెలిశాయి
- మొబైల్ రంగంలో 12 లక్షల మందికి ఉపాధి

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ త్రయోదశి, రా.9.25 వరకు అనంతరం చతుర్దశి; నక్షత్రం: పూర్వాషాఢ రా.12.15 వరకు, అనంతరం ఉత్తరాషాఢ; అమృతకాలం: రా.7.10 నుండి 8.55 వరకు; వర్జ్యం: ఉ.8.43 నుండి 10:26 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు

రాష్ట్ర రైతుకు డబుల్ ధమాకా

(మొదటిపేజీ తరువాయి)

విడతలుగా ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయబోతున్నారు. ఈ పథకాన్ని 2018 డిసెంబర్ నుంచే అమల్లోకి తీసుకువస్తున్నందున త్వరలోనే ఖాతాల్లో నిధులను జమ చేస్తారని భావిస్తున్నారు.

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి

ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణాలో 57.16 లక్షల రైతు కుటుంబాలున్నాయి. అందులో 5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగివున్నవారు 47.08 లక్షల మంది ఉన్నారు. ఎకరం లోపు భూమి ఉన్నవారు 14.86 లక్షలు, రెండు నుంచి మూడెకరాల్లోపు భూమి వున్నవారు 13.32 లక్షలు, మూడు నుంచి నాలుగెకరాలున్నవారు 8.96 లక్షలు, నాలుగు నుంచి 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారు 5.77 లక్షలు, ఆపై భూమి ఉన్నవారు 4.13 లక్షల మంది రైతులున్నారు. తొలివిడతలో భాగంగా 2018 డిసెంబర్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31 మధ్యకాలానికి రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జాతీయస్థాయిలో 12 కోట్లమంది చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకం వర్తిస్తుంది. అందుకుగానూ కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌లో రూ.75వేల కోట్లు కేటాయించింది. తెలంగాణాలో 47.08 లక్షల మంది లబ్ధిదారులకు మొదటివిడత అమలుకు రూ.941.53కోట్ల నిధులు అవసరమవుతాయి. అలాగే మూడు విడతలు కలుపుకుని ఈ పథకం అమలుకు మొత్తం 2824.57 కోట్లు అవసరమవుతాయి. రాష్ట్రంలో ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన రైతుబంధు పథకం అమల్లో ఉన్నందున మన రైతులకు రెండు విధాలుగా లబ్ధి చేకూరనుంది. కేంద్రం ప్రభుత్వం ద్వారా అందే సహకారం కూడా నేరుగా రైతుబంధు బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుందని వ్యవసాయశాఖ అధికారాలు చెబుతున్నారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్

దేశంలో గో సంపదను పెంచే దిశగా కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. 'గోకుల్ మిషన్' పేరుతో అమల్లోకి రానున్న ఈ ప్రత్యేక పథకానికి రూ.750 కోట్లు కేటాయించారు. గో ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ ఏర్పాటు చేయనున్నారు. దీనిద్వారా నాణ్యమైన ఉత్తమ జాతి ఆవుల ఉత్పత్తికి కృషి చేయనున్నారు. ఆవుల సంక్షేమాన్ని కూడా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ పర్యవేక్షించనుంది.

మత్స్య పరిశ్రమకు చేయూత

సాధారణ రైతులతో పాటు పశు పోషణ, మత్స్య పరిశ్రమ రైతులకూ కిసాన్ క్రెడిట్ కార్డును అందిస్తూ గత బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడు వారికి మరికొంత ఊరట కలిగించే నిర్ణయాన్ని ఆర్థికమంత్రి తీసుకున్నారు. కిసాన్ క్రికెడ్ కార్డు ద్వారా పశుపోషణ, మత్స్య పరిశ్రమ రైతులు జరిపే లావాదేవీలపై 2 శాతం వడ్డీ రాయితీని గోయల్ ప్రకటించారు. అదేవిధంగా ఆయా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే అదనంగా మరో 3 శాతం వడ్డీ రాయితీ కూడా లభించనుంది.

వ్యవసాయ రుణాలపై..

రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలపైనా ఆర్థికమంత్రి కరుణ చూపారు. ప్రకృతి వైపరీత్యాలు, ఆందోళనల కారణంగా రుణాలు చెల్లించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గోయల్ అన్నారు. మొదటి సంవత్సరం రుణాల రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు ప్రస్తుతం 2 శాతం వడ్డీ రాయితీ లభించనుంది. ఇకనుంచి ప్రకృతి వైపరీత్యాలలో పంట నష్టపోయి, ఎన్‌డీఆర్‌ఎఫ్ ధృవీకరించిన రైతులకు రుణంలో 2 శాతం రాయితీతో పాటు 3 శాతం వడ్డీ రాయితీని కూడా ఇవ్వనున్నారు.

కేంద్రంతో పాటు 5 రాష్ట్రాల అధ్యయనం

గ్రామస్థాయిలో 98శాతం ప్రజలకు మెరుగైన పాలనతో పాటు సంక్షేమ పథకాల ద్వారా సులువైన మార్గాల్లో లబ్ధి చేకూర్చేందుకు రూపకల్పన చేసిన రైతుబంధు పథకం, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో పాటు తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేశాయి. ఆయా రాష్ట్రాల అధికారుల బృందాలు ఇప్పటికే పలుసార్లు ఇక్కడ పర్యటించాయి. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో చర్యలు ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని పంపించి వివరాలు సేకరించింది. తాజాగా నెల రోజుల క్రితం కేంద్ర సచివాలయ అదనపు కార్యదర్శి హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ రెండు పథకాల కార్యాచరణ ప్రణాళికలపై చర్చించి నివేదికలు తీసుకువెళ్ళారు.



రైతుబంధు చెక్కు అందజేస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)


కిసాన్ సమ్మాన్ ఆద్యుడు కేసీఆర్

జాతీయ స్థాయి రాజకీయ వర్గాల్లో చర్చ

• రైతు సంక్షేమంపై కేంద్రానికి తెలంగాణ ఆదర్శం • స్వల్ప మార్పులతో పలు రాష్ట్రాల్లో అమల్లోకి వచ్చిన రైతుబంధు • కేసీఆర్ చొరవతో దేశవ్యాప్తంగా రైతాంగానికి భారీగా మేలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు సంక్షేమ రంగంలో సరి కొత్త నిర్వచనానికి తెరలేపింది తెలంగాణ రథసారథి, సీఎం కేసీఆర్ ముందుచూపు ఆలోచనేనని జాతీయ స్థాయిలో జోరుగా చర్చ జరుగుతోంది. పంట పెట్టుబడి సమకూర్చు కోవడంలో అన్నదాతలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి రైతుబంధు పేరుతో గతేడాది ప్రారంభించిన పెట్టుబడి మద్దతు పథకం అనతికాలంలోనే దేశానికే ఆదర్శంగా మారింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని తట్టిలేపి వ్యవసాయ రంగం దిశగా అడుగులు వేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్న రైతు సంఘాలు, మేధావి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణాలోని రైతు సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు సాధిస్తున్న పురోగతి కారణంగా దేశ మంతటా కేసీఆర్ ప్రభుత్వ ఖ్యాతి మారుమోగుతోంది. రైతులను ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెండేళ్ళ క్రితం కేసీఆర్ ప్రకటించిన రైతుబంధు పథకం నేడు దేశంలోనే చరిత్ర సృష్టిస్తున్నది. ఎకరానికి ఏడాదికి రూ.8వేలు పెట్టుబడి అందించనున్నట్లు ప్రకటించి తెలంగాణలో సుమారు 58 లక్షల మంది రైతు కమ్యూనిటీకి మేలు చేయడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. కోట్లాది మంది మన్ననలు పొందగలిగారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరానికి ఏడాదికి రూ.10వేలు ఇవ్వనున్నట్లు ఇటీవల కేసీఆర్ ప్రకటించారు. దీంతో వ్యవసాయరంగం ప్రాధాన్యతను గుర్తించి ఇప్పుడు ఆయనను యావత్ దేశం ఫాలో అవుతోంది. శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రైతులకు దేశవ్యాప్తంగా రైతుబంధు తరహా సీఎం 'కిసాన్ సమ్మాన్' పథకం పేరుతో ఎకరానికి రూ.6వేలు ఇవ్వ నున్నట్లు ప్రకటించారు.

కేంద్రం కూడా రైతుబంధు తరహా పథకాన్ని ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఇక కేసీఆర్ పేరు మారుమోగుతుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేసీఆర్ ప్రవేశ పెడుతున్న పథకాలను అమలు చేయడానికి చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని అమలు చేయడం ద్వా రా దేశవ్యాప్తంగా కేసీఆర్ ఆలోచనలకు విస్తృతంగా ప్రశంసలు లభించే అవకాశం కనిపిస్తోంది. విదేశాల్లో ఉన్న వారితో సహా నాలుగు కోట్లమంది తెలంగాణ ప్రజలు దీన్ని గౌరవంగా భావిస్తున్నారు.



రాష్ట్రానికి అరకొరే

కాళేశ్వరం, ఇతర హామీల ఊసేలేదు

ప్రాజెక్టులకు పైసా లేదు.. రైతు సాయం ఒక్కటే ఊరట



సింగరేణికి	ఐఐటీకి	ట్రైబల్ వర్సిటీకి
1850 కోట్లు	80 కోట్లు	4 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులు మొదలు అనేక కీలక పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో నిరాశే ఎదురైంది. 2018-19లో కేంద్ర పన్నుల్లో వాటాగా తెలంగాణకు రూ. 19,207.43 కోట్లుగా కేంద్రం పేర్కొనగా, ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్ర వాటాను ఎంత అందించేది స్పష్టంగా ప్రస్తావించలేదు. 14వ ఆర్థిక సంఘం సూచనల మేరకు రాష్ట్రాల నుంచి వసూలైన కేంద్ర పన్నుల రాబడిలో 42 శాతం వాటాను రాష్ట్రాలకు తిరిగి ఇవ్వాలని ఉంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా భారీ నిధులనే కోరినప్పటికీ కేంద్రం స్పందించలేదు. ఇక ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, హార్టికల్చర్ వర్సిటీ ఏర్పాటు అంశం ఇందులో లేకుండా పోయింది. నీతి ఆయోగ్ కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు మద్దతు తెలిపి తెలంగాణకు నిధులివ్వాలని కేంద్రానికి సిఫార్సులు చేసింది. కాళేశ్వరం జాతీయ హోదా ఈ బడ్జెట్‌లోనూ నెరవేరలేదు. మొత్తంగా చూస్తే సాగునీటి ప్రాజెక్టులకు ఎటువంటి నిధుల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. కానీ సింగరేణికి రూ. 1850కోట్లు, హైదరాబాద్ ఐఐటీకి రూ. 80 కోట్లు, ట్రైబల్ యూనివర్సిటీకి రూ. 4కోట్లను మాత్రమే బడ్జెట్‌లో పేర్కొనడం విశేషం. గతేడాది కాలంగా కేంద్ర ప్రాయోజిత పథకాల (సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్)కు భారీగా నిధులు తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వంపై భారం పెరిగింది. ఆశించిన నిధులు రాకపోవడంతో ప్రభావం అంతా ఆయా పథకాలపై పడుతోంది. 2018-19 వార్షిక ఏడాదిలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల(సీఎస్‌ఎస్) కింద రూ. 9163 కోట్లు రానున్నాయని ప్రభుత్వం అంచనా వేసింది. 2015-16లో ఇవి రూ. 6497 కోట్లు... అంతకు క్రితపు ఏడాదితో పోలిస్తే ఇవి భారీగా తగ్గాయని ఆర్థికశాఖ లెక్కలు వేసింది. 2014-15లో ఈ పద్దుకింద తెలంగాణకు రూ. 11781 కోట్లు ఖజానాకు చేరాయి. రెండేళ్లుగా నానాటికీ కేంద్ర పథకాలకు కేంద్రం తన వాటాను తగ్గిస్తూ వస్తోంది. ఆ మేరకు రాష్ట్ర ఖజానాపై భారం పెరుగుతోంది. కేంద్ర సాయానికి తోడు రాష్ట్రం కూడా తన వంతుగా కొంత మొత్తాన్ని కలిపి ఈ పథకాలను అమలు చేయాల్సి రావడంతో ఈ భారం మోయక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది.



ఎకరాకు రూ. 6వేలు అందించేలా కేంద్రం ప్రకటించిన రైతు బందు పథకానికి రాష్ట్రంలోని 57,33,025 ఖాతాలకు చెందిన 1,40,98,486 ఎకరాల సాగుభూమి అర్హత సాధించేందుకు అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన చారిత్రాత్మక రైతుబంధు ద్వారా ప్రయోజనం పొందిన వారిలో 40,92 లక్షల మంది రెండున్నర ఎకరాలలోపు మాత్రమే భూమి కల్గిన సన్నకారు రైతులున్నారు. 5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కల్గిన రైతులు రాష్ట్రంలో 11.02 లక్షల మంది ఉన్నారు. మొత్తంగా 53 లక్షల మంది రైతాంగానికి కేంద్ర సాయం అందేందుకు అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక 5ఎకరాలనుంచి 10ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు 4.44 లక్షలమంది, 10నుంచి 25 ఎకరాల్లోపు 94వేల మందిఉండగా 25 ఎకరాలకుపైగా భూములు ఉన్న బడా రైతులసంఖ్య 6488గా ఉంది. వీరికి కేంద్ర సాయం అందే అవకాశం లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రెండు విడుతల్లో ఎకరాకు రూ. 5వేల చొప్పున అందించే సాయానికి తోడుగా కేంద్రం ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రకటించి అమలులోకి తేనుంది. దీంతో రాష్ట్రం అందించే ఎకరాకు రూ. 10వేలు, కేంద్ర సాయం రూ. 6 వేలు కలుపుకుని ఏటా ఎకరాకు రూ. 16వేలు రైతుకు అందాల్సి ఉంటుంది. కాగా కేంద్రం నేరుగా రైతు ఖాతాలోకి నగదు బదలీ చేస్తామని ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బందు పథకంలో మార్పులు తెచ్చే అవకాశం ఉంది. కేంద్రం ఇవ్వనున్న రూ. 6వేలతో కలుపుకుని తాము రూ. 4వేలు ఇస్తే ఎలా ఉంటుందనే కోణంలో యోచిస్తున్నట్లు తెలిసింది.



తెలుగు విద్యార్థుల వీసా సమస్యలు పరిష్కరించండి

యూఎస్ కాన్సల్ జనరల్‌కు కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికాలో వీసా వివాదంలో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సమస్య పరిష్కరించాల్సిందిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సల్ జనరల్ కేథరిన్ హడ్డాను తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కోరారు. తమ విద్యార్థులకు సహాయం చేసే విషయమై అమెరికా ప్రభుత్వాన్ని సంప్రదించాల్సిందిగా ఆమెను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. అమెరికాలో వీసా సమస్యల్లో చిక్కుకున్న విద్యార్థులకు సంబంధించి చర్చించేందుకు శుక్రవారం కేటీఆర్ ఆమెను కలిశారు. ఈ సందర్భంగా అమెరికా -తెలంగాణ మధ్య ప్రస్తుతం నెలకొన్న సంబంధాలు, భవిష్యత్తులో కొనసాగాల్సిన అంశాలపై వారిరువురు చర్చించారు.

రైతుబంధుకు సాటిలేదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో రైతుల కోసం ప్రకటించిన పథకానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు కార్యక్రమమే స్ఫూర్తి అని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక రైతుబంధు పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా దేశంలోని రైతులకు ఎంతో కొంత సహాయం అందటం హర్షణీయమేనన్నారు. పేరుమార్చినప్పటికీ, రైతుబంధుకి ప్రతిరూప మేనని, ఇది కేసీఆర్ పథకానికి ఏమాత్రం సాటిరాదని అన్నారు. కనీసం కాపీ కొటైనా రైతుల కోసం మంచి చేస్తున్నందుకు సంతోషమే నన్నారు.

దీనికి అసదుద్దీన్ సమాధానమిస్తూ దేశం ఎదుర్కుంటున్న వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో సీఎం కేసీఆర్‌కు ఎక్కువ దూరదృష్టి ఉన్నట్లు ఈ అనుకరణ వెల్లడిస్తోంది, భారత ప్రధానికి కేవలం కాపీ పేస్ట్ మాత్రమే చేయడం వచ్చునని, అసలైన ఆలోచనలు, దూరదృష్టి లేవని వెల్లడవుతోందనిఅంటూ ట్వీట్ చేశారు.

రేషన్‌షాపుల ద్వారా అంగన్‌వాడీలకు బియ్యం

• కాంట్రాక్టర్ల వ్యవస్థ రద్దు • పారదర్శకత, జవాబుదారీతనం పెంపు: కమిషనర్ అకున్ సబర్వాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇక రాష్ట్రంలో అంగన్‌వాడీలకు రేషన్ దుకాణాల ద్వారానే బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం పౌరసరఫరాల శాఖ రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పారదర్శకత, జవాబుదారీతనం పంచే లక్ష్యంతో వేలి ముద్రల ఆధారంగా రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పాస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 72 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సూపర్ వైజర్ల ఆధార్‌తోపాటు, వేలిముద్రలను ఈ పాస్ మిషన్లకు ఎన్‌ఐసీ సహకారంతో అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా తొలిరోజు ఈ కార్యక్రమాన్ని మేడ్చేల్ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం జగదీశ్వర్, డైరక్టర్ విజయేంద్ర బోయి, కమిషనర్ అకున్ సబర్వాల్ తదితరులు పరిశీలించారు.

బియ్యం పంపిణీలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దని హెచ్చరించారు. ఈ కొత్త విధానంతో అంగన్‌వాడీ నిర్వాహకులు ఏరోజు ఎంత మంది విద్యార్థులున్నారు..ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసికెళ్లారు. ఇంకా ఎంత తీసికెళ్లాల్సి ఉంది..ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలు కల్గనుంది. గతంలో పౌరసరఫరాల సంస్థ గోదాములనుండి రవాణా కాంట్రాక్టర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా అయ్యేది. అయితే ఈ విధానంతో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ దుకాణాల ద్వారా వేలి ముద్రల ఆధారంగా బియ్యం సరఫరాతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. దీంతో ప్రభుత్వానికి నిధుల ఆదా కానుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతీ ఏటా ప్రభుత్వం 32 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఇప్పటు ఈ బియ్యం సద్వినియోగం కానుంది.

వీవీప్యాట్ స్లిప్‌లూ లెక్కించాలి

ఈవీఎంలతో సరిపోల్చాలి

• ఇదే డిమాండ్‌తో సీఈసీని కలుస్తాం: రాహుల్‌గాంధీ • ఢిల్లీలో సమావేశమైన విపక్ష కూటమి నేతలు • మమత, మాయావతి గైర్హాజరు, వారి ప్రతినిధులు హాజరు • ఎవరిదారి వారిదే–జాతీయస్థాయిలోనే ఐక్యత: చంద్రబాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లతో పాటు అనుసంధానం చేసే వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాలని విపక్ష కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ఎన్ని కల సంఘం అధికారులతో సమావేశమై విన్నవించాలని నిర్ణయించుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్బులో జరిగిన విపక్ష కూటమి సమావేశం అనంతరం కూటమిలోని ప్రధాన పార్టీ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మీడియాకు వెల్లడించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, తెలుగుదేశం సహా మొత్తం 21 పార్టీల నేతలు హాజరయ్యారు. హాజరైన వారిలో రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీకే చెందిన సీనియర్ నేతలు ఏకే ఆంటోనీ, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్, సమాజ్‌వాదీ నేత రాంగోపాల్ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి సతీష్ చంద్ర మిశ్రా, ఆర్జేడీ నుంచి మనోజ్ ఝా, డీఎంకే నుం చి కనిమొళి, ఎల్జేడీ నుంచి శరద్ యాదవ్, ఆరెల్డీ నుంచి జయంత్ చౌదరి, సీపీఐ నుంచి డీ. రాజా, జేడీ(ఎస్) నుంచి డానిష్ అలీ, ఏఐయూడీఎఫ్ నుంచి భద్రుద్దీన్ అజ్మల్, ఆరెస్పీ నుంచి ఎన్కే ప్రేమ్ చంద్రన్, జేవీఎం నుంచి ప్రొ. అశోక్‌కుమార్ సింగ్, హెచ్. ఏ. ఎం నుంచి జితిన్ రామ్ మాంఝీ, తెలంగాణ జన సమితి నుంచి ప్రొ. కోదండ రామ్ ఉన్నారు. మమతాబెనర్జీ, మాయావతి తరపున వారి ప్రతినిధులు హాజరయ్యారు. గంటకు పైగా ఈ సమావేశం అనంతరం అక్కడే మీడియా సమావేశం నిర్వహించిన విపక్షకూటమి నేతలు ఈవీఎం సహాపలు ఇతర అంశాల గురించి కూడా చర్చించినట్టు తెలిపారు.



ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్

ఈవీఎంతో పాటు వీవీపాట్ స్లిప్పులను కూడా లెక్కించాలని, కనీసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50 శాతం వరకు ట్యాలీ చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈవీఎం అంశంపై విపక్ష కూటమి సబ్ కమిటీ నివేదికపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతింటు న్నాయని, రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రాఫెల్ డీల్ వంటి భారీ అవినీతి కుంభకోణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ సర్కారును ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు తమ దగ్గర ఇంకా చాలా అంశాలున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరో ప్రశ్నకు బదులిచ్చారు. అనంతరం నేతలంతా అక్కణ్ణుంచి వెళ్లిపోయారు.

పొత్తులు లేని ఐక్యత

ప్రజాస్వామ్య అవసరం : చంద్రబాబు

ప్రధాని మోడీకి, బీజేపీకి వ్యతిరేకంగా జట్టుకట్టిన విపక్ష కూటమిలో అనేక పార్టీలు ఆయా రాష్ట్రాల్లో ఎవరిదారిన వారు పోటీ చేస్తున్న విషయంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఏపీలో కూడా తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేయడం లేదని, కాంగ్రెస్ నేతలే ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించారని బాబు అన్నారు. అయితే ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్దేశంతో అన్ని పార్టీలు జాతీయస్థాయిలో కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని, ఈ క్రమంలో కొన్ని రాష్ట్రాల్లో ఆయా రాజకీయ పార్టీలకు ప్రత్యేక పరిస్థితులు కూడా ఉంటాయని ఏపీ సీఎం అన్నారు. ఈసీని కలిసిన తర్వాత తమ తదుపరి కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 2 ఫిబ్రవరి 2019

చరిత్రలో - ఈరోజు

బంగ్లాదేశ్ ఆవిర్భావానికి పరోక్ష కారకుడు



తూర్పు పాకిస్థాన్‌లో పాక్ సైన్యం దాష్టికానికి, మానవ హక్కుల ఉల్లంఘనకి భరించలేక లక్షలాదిగా ప్రజలు భారత్‌లోకి చొరబడడం పెద్ద సమస్యగా మారింది. దీనికి ఒకటే పరిష్కారమని భారత దేశ రక్షణ వ్యూహకర్త కృష్ణస్వామి సుబ్రహ్మణ్యం భావించారు. దీంతో భారత సైన్యం 1971లో తూర్పు పాకిస్థాన్‌పై దండయాత్ర చేసింది. ఫలితంగా బంగ్లాదేశ్ అవతరించింది. బంగ్లాదేశ్ అవతరణకి ఈ విధంగా పరోక్షంగా కారణమైన కృష్ణస్వామి సుబ్రహ్మణ్యం బాల్యం మద్రాసు, తిరుచారపల్లిలో జరిగింది. 1929లో జన్మించిన సుబ్రహ్మణ్యం సివిల్ పరీక్షల్లో ప్రథముడిగా నిలిచి ఐపిఎస్ పాసయ్యారు. తమిళనాడు కేడర్ అధికారిగా కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖలో పని చేశారు. ఆ తరువాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో రాక్‌ఫెల్లర్ ఫెలోషిప్‌పై వ్యూహాత్మక అధ్యయనం చేశారు. తిరిగి వచ్చాక ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్‌కి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. భారతదేశం అణ్వాయుధాలను తయారు చేసుకోవాలన్న కృష్ణస్వామి సలహానే 1972లో అణ్వాయుధ పరీక్షకు ప్రేరణగా పని చేసింది.పొరుగు దేశాలతో భారతదేశం రక్షణాత్మక వ్యవహారాల్లో అనుసరించాల్సిన వ్యూహ్ రచనలో కృష్ణస్వామి సుబ్రహ్మణ్యం కీలక పాత్ర పోషించారు. రక్షణ వ్యూహాలపై జాతీయ పత్రికల్లో వ్యాసాలు రాసి సంచలనం సృష్టించిన భారత దేశ రక్షణ వ్యూహకర్తగా పేరొందిన సుబ్రహ్మణ్యం 2, ఫిబ్రవరి, 2011న మరణించారు.

నిండు నూరేళ్ల జీవితం!



ఇప్పటి పాకిస్థాన్‌లోని పంజాబ్‌లోని హడాలిలో కుషాల్‌సింగ్‌గా జన్మించిన కుష్వంత్‌సింగ్ జర్నలిస్టుగా, న్యాయవాదిగా, నవలా రచయితగా, రాజకీయ నాయకుడిగా బహుముఖ పాత్రలు పోషించారు. 2, ఫిబ్రవరి, 1915లో జన్మించినట్లు కుష్వంత్‌సింగ్ తండ్రి స్కూల్లో నమోదు చేశారు. అయితే తరువాత కుష్వంత్‌సింగ్ నాయనమ్మ మాత్రం ఆగస్టులో పుట్టినట్లు పేర్కొంది. దీంతో కుష్వంత్‌సింగ్ ఆగస్టులో తనకు ఇష్టమైన 15వ తేదీని ఎంచుకున్నారు. లాహోర్ న్యాయస్థానంలో న్యాయవాదిగా జీవితం ప్రారంభించిన కుష్వంత్‌సింగ్ ఇండియన్ ఫారిన్ స్వీర్‌లో చేరారు. ఆ తరువాత ఆలిండియా రేడియోలో జర్నలిస్ట్ అవతారమెత్తారు. ఆలిండియా రేడియోలో ఉన్నప్పుడే కుష్వంత్ సింగ్‌కి సాహిత్యంపై మమకారం పెరిగింది. వ్యంగ్యం, హాస్యంతో కూడుకున్న కుష్వంత్ సింగ్ రచనలకు పాఠకాదరణ కూడా ఎక్కువే! 1970, 80 దశకాల్లో అనేక సాహితీ వారపత్రికలకు, దినపత్రికలకు ఎడిటర్‌గా పని చేశారు. 1980లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. కుష్వంత్‌సింగ్‌కి 1974లో పద్మ భూషణ్, 2007లో పద్మ విభూషణ్ పురస్కారాలు దక్కాయి. 20, మార్చి, 2014న కుష్వంత్‌సింగ్ తన 99వ ఏటా వృద్ధ్యాప్య సమస్యలతో కన్నుమూశారు. నిండు జీవితం గడిపిన కుష్వంత్ దేశ రాజకీయ, సాహిత్య, పత్రికా రంగాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

హిట్లర్ పతనానికి పునాది

ఒక్క వారంలో నాజీ నియంత హిట్లర్‌కి ఫ్రాన్స్ పాదాక్రాంతమైంది. ఇకనియంత చూపు ఇంగ్లాండ్‌పై పడింది. ఇంగ్లాండ్ పని అయిపోయిందని అంతా అనుకున్నారు. ఇంగ్లాండ్‌ను జయిస్తే.. హిట్లర్‌కి పరోక్షంగా ప్రపంచంపై ఆధిపత్యం లభించేదే. అయితే హిట్లర్ మనసులో ఏ బుద్ధి పుట్టిందో కానీ.. తన అపరిమితమైన బలమైన త్రివిధ దళాలను సోవియట్ యూనియన్‌వైపు మరల్చాడు. రెండో ప్రపంచ యుద్ధ చరిత్రలో అత్యంత ఘోరమైన, ఎక్కువ ప్రాణాలను బలి తీసుకున్న స్టాలిన్‌గ్రాడ్ సమరం మొదలైంది. ప్రతి అంగుళం కోసం ఇరువైపులా ఘోరాతి ఘోరంగా యుద్ధం జరిగింది. పోతున్న వందల, వేల సైనికుల ప్రాణాలు



ఇరు దేశాల అధిపతులకు లెక్కే లేకుండా పోయా యి. యుద్ధంలో ఆధిప త్యమే లక్ష్యంగా జరిగిన భీకర సమరంలో 20 లక్షల మంది మృతి చెందారు. స్టాలిన్‌గ్రాడ్‌ను జయించడం కోసం ఆగస్టు, 1942లో హిట్లర్ సేన యుద్ధం మొదలు పెట్టింది. భూతల యుద్ధానికి తోడుగా యుద్ధ విమానాలు స్టాలిన్‌గ్రాడ్‌పై బాంబుల వర్షం కురిపించాయి. దీంతో స్టాలిన్‌గ్రాడ్ నగరం సమూలంగా శిథిలమైంది. 1942, నవంబర్ 15వ తేదీ నాటికి జర్మన్ సైనికులు రెడ్ ఆర్మీని వోల్గా తీరం వరకు నెట్టేశారు. 19, నవంబర్, 1942న సోవియట్ సైనికులు తమ దాడిని తీవ్రం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్టాలిన్‌గ్రాడ్ నుంచి వెనక్కి రావొద్దని నేరుగా నియంత హిట్లర్ నుంచి బలమైన ఆదేశాలు వెళ్లాయి. దీంతో స్టాలిన్‌గ్రాడ్ నగరం కేంద్రంగా ఇరు పక్షాలు మరో రెండు నెలల పాటు యుద్ధం చేశారు. 1943 జనవరి నాటికి జర్మనీ సైన్యానికి ఆయుధాలు, ఆహార సరఫరా తగ్గిపోయింది. గగనతల మార్గంలో ఆయుధాలు అందించడం కూడా సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో స్టాలిన్‌గ్రాడ్‌లో మిగిలి పోయిన జర్మనీకి చెందిన ఆరవ ఆర్మీ 2, ఫిబ్రవరి, 1943న లొంగిపోయింది. రష్యాను జయించాలన్న హిట్లర్ కల ఒడిపోయింది. దీంతో హిట్లర్ పతనం ప్రారంభమైంది. మిత్ర పక్షాల సేనలు జర్మనీని నలు దిక్కులా ముట్టడించి నేల మట్టం చేశాయి. స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం సరిగ్గా అయిదు నెలలా ఒక వారం మూడు రోజులు జరిగింది.

అన్ని వర్గాలను తృప్తి పరచిన బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేవిధంగా ఉంది. ముఖ్యంగా వేతన జీవులకు ఊరటనిచ్చేలా వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించడం అభినందనీయం. ఇంటి అద్దె ఆదాయంపై టిడియస్ రూ.2.4 లక్షలకు పెంపు ప్రయోజనం కల్గించే విషయం. రక్షణ శాఖకు తొలిసారిగా రూ.3 లక్షల కోట్లకు పైగా కేటాయించడమే గాక రిటైర్డ్ సైనికులకు చాలాకాలంగా కోరుతున్న విధంగా పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నామని ప్రకటించడం రూ.35 వేల కోట్ల దేశ రక్షణ కోసం పనిచేసే సైనికులకు మేలు కల్గేలా వేతనాలు పెంచడం ఆహ్వానించదగ్గ పరిణామం. 60 సంవత్సరాలు దాటిన అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్ పేరుతో నిర్వహించే ఈ పథకంలో దేశవ్యాప్తంగా 10 కోట్ల మందికి లాభం జరుగుతుండడం, పేదరికంను తగ్గించడానికి సూచికగా చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా దేశంలో 2 హెక్టార్లలోపు భూమిగల రైతులకు సంవత్సరానికి రూ.6 వేల రూపాయలను సంవత్సరంలో మూడు వాయిదాలలో రూ.2 వేల చొప్పున నేరుగా వారి ఖాతాలలోకి బదిలీ చేస్తామని ప్రకటించడం సుమారు 12 కోట్ల రైతుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

పాఠకీయం

అలాగే ఈ బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్‌ను రూ.3 వేల కోట్లు కేటాయించడం సామాన్య ప్రజానీకానికి కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేసేందుకు అతిపెద్ద ఆరోగ్య కార్యక్రమంగా అభివర్ణించవచ్చు. ప్రతీ గ్రామానికి రోడ్డు ఉండేలా ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు రూ.19 వేల కోట్లు కేటాయింపు ప్రధానాంశంగా చెప్పవచ్చు. మొత్తానికి మాత్రం కేంద్ర బడ్జెట్టు ఆశాజనకంగా ఉంది.

-కామిడి సతీష్‌రెడ్డి, జడలపేట

ఓట్ల కోసం మెరుపుల బడ్జెట్!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ మెరుపుల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు ఆనవాయితీగా తయారైంది. కేంద్రంలో అయినా, రాష్ట్రాల్లో అయినా ఇదే తీరు. ఐదేళ్ళూ కిమ్మనకుండా ఊరుకుని చివరి బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడంలోనూ అందరిదీ అదే దారి. తాము ప్రవేశపెట్టే పథకాలకూ, ప్రకటించిన రాయితీలకూ తగినన్ని నిధులు ఉన్నాయా? లేవా? అన్నది పరిగణనలోకి తీసుకోకుండా జనాకర్షక బడ్జెట్‌లను ప్రవేశపెట్టడంలోనూ ప్రభుత్వాల మధ్య పోలిక ఉంది. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం శుక్రవారంనాడు పార్లమెంటుకు సమర్పించిన తాత్కాలిక బడ్జెట్ రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా ఆరు వేల రూపాయిలు చెల్లిస్తామని ప్రకటించింది. . రైతుబంధు పేరిట ఇలాంటి పథకం తెలంగాణలో ఇప్పటికే అమలులో ఉంది. అయితే, ఇప్పుడు కేంద్రం ప్రకటించిన పథకం కింద రోజుకి ఒక్కొక్క రైతుకు 17 రూపాయిలు మాత్రమే వస్తుందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఇది అసత్యం కాదు. . రైతుల కోసం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రధానమంత్రి మోడీ మొదలు బీజేపీ సామాన్య కార్యకర్తల వరకూ అంతా దీనిని ఒక సంజీవినిగా పేర్కొంటున్నారు. కానీ, పెట్టుబడి సాయం పథకం అమలులో నిరంతర పర్యవేక్షణ లేకపోతే ఆశించిన ప్రయోజనం ఒనగూరదు. వేతన జీవులకు ఊరట కలిగించే ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయిలకు పెంచడం ఆ వర్గాల ఓట్ల కోసమే. అలాగే, అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకం కూడా ఓట్ల కోసమేనని చెప్పనవసరం లేదు. మోడీ గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ముఖ్యమైనది అయిన రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఎండమావే అయింది. కొత్త ఉద్యోగాలు లేకపోగా, పెద్ద నోట్ల రద్దు వల్ల వేలాది ఉద్యోగులు వీధిన పడ్డారని రాహుల్ గాంధీ మాత్రమే కాకుండా, ఆప్ సారథి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా స్పష్టం చేశారు. తాత్కాలిక బడ్జెట్‌లో కొత్త పథకాలు, తాయిలాలూ ప్రకటించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. అయితే, ఈ సూత్రాలను ఇప్పుడు ఎవరూ పాటించడం లేదు. ఆధునిక రాజకీయ నాయకులు ఆదర్శాలకూ, సిద్ధాంతాలకూ ప్రాధాన్యం ఇవ్వకుండా, వీలైనన్ని ఎక్కువ రోజులు అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత కూడా చాటు మాటున శంకుస్థాపనలు చేయడం, రిబ్బన్లు కత్తిరించడం వంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు. అసంఘటిత కార్మికులకు నెలకు మూడు వేల రూపాయిల పెన్షన్ పథకం ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ నెలకు వంద రూపాయిలు చెల్లించిన వారే దీనికి అర్హులు. ఈశాన్య భారతంలో ఎక్కువ రాష్ట్రాల్లో అధికారాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంవల్ల ఆ ప్రాంతాలకు మోడీ ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధుల శాతాన్ని పెంచింది. గత బడ్జెట్ కన్నా 21 శాతం ఎక్కువ నిధులను కేటాయించింది. అగ్రవర్ణాల్లో పేదలకు ఇంతకుముందే విద్యా, ఉద్యోగ రంగాల్లో పది శాతం రిజర్వేషన్లు ప్రకటించినా కేంద్రంలో, రాష్ట్రాల్లో ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు లేనప్పుడు ఈ రిజర్వేషన్లు ఎంత వరకు మేలు చేస్తాయన్నది ప్రశ్నార్థకమే. మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పథకాలను ప్రకటించడం ఓట్ల కోసమేనన్న వ్యాఖ్యల్లో అసత్యం లేదు. సబ్సిడీ సొమ్ము చెల్లింపునకు ఆధార్ కార్డుల అనుసంధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల వేల కోట్ల రూపాయిలు ఆదా అవుతోందని అంటున్నారు. మంచిదే కానీ, పౌరుల వ్యక్తిగత ఆదాయాన్ని పెంచేందుకు ఈ పథకాల్లో ఏ ఒక్కటీ ఉపయోగపడేవిగా లేవు.

రాయితీలూ, సబ్సిడీలు శాశ్వతంగా చెల్లించడం వాంఛనీయం కాదని నిపుణులు ఘోషిస్తున్నారు. ఉత్పాదకతను ప్రోత్సహించడానికే వీటిని చెల్లించాలన్న సలహా వాంఛనీయమే. ఉద్యోగాల కల్పన విషయంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం నిరుద్యోగ భృతి వంటి ఆకర్షణీయ పథకాలను ఎంత కాలం కొనసాగిస్తాయన్న ప్రశ్న సహేతుకమైనదే. అయితే, సంక్షేమ రాజ్యంలో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు వంటి ఆపన్న వర్గాలకు ఎంతోకొంత సాయం చేయడం అవసరమే. ఓట్ల కోసం ఎరగా కాకుండా బడుగు, బలహీనవర్గాలకు చేయూత నిచ్చే సదుద్దేశ్యం ప్రవేశపెట్టిన పథకాలు కార్యక్రమాలు విజయవంతం కావాలి. ఈ బడ్జెట్‌లో రక్షణ రంగానికి మూడు లక్షల కోట్లు కేటాయించడం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అత్యవసరమే.

అయితే రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో జరిగినట్టు చెప్పబడుతున్న అవినీతిని శాశ్వతంగా నిర్మూలించ గలిగినప్పుడే ఈ కేటాయింపులు సద్వినియోగం అవుతాయి. ఈ బడ్జెట్ ప్రజలను గందరగోళంలో పడేసిందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం వ్యాఖ్యానించగా, నవభారత్ కలను సాకారం చేసే బడ్జెట్ అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ అన్నారు. మానవీయకోణం లేకపోతే బడ్జెట్‌లను ఎవరు రూపొందించినా బడ్జెట్ పెద్దలకే ఉపయోగ పడుతుంది. ప్రధానమంత్రి ఆకర్షణీయమైన ప్రసంగాలకు ముగ్ధులైన జనం గత ఎన్నికల్లో పార్లమెంటులో అధికార పార్టీకు పూర్తి మెజారిటీ ఇచ్చారు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. వాగ్దానాలు అమలు జరపకపోగా, పెద్దనోట్ల రద్దు వంటి చర్యల వల్ల ఉన్న ఉద్యోగాలే ఊడాయి. మోడీ పట్ల ఆకర్షణతగ్గడానికి అదే ప్రధాన కారణం. అవినీతిని రూపుమాపుతానన్న మోడీ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయిల బ్యాంకు కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. మొండిబకాయిలపై ప్రభుత్వ ప్రకటన గందరగోళంగా ఉంది. లోతుగా పరిశీలిస్తే ఈ బడ్జెట్ పైపై మెరుపులేనని అనడం అతిశయోక్తి కాదు.

ఐదేళ్ళూ లేని ప్రేమ ఇప్పుడా?

ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి వరకూ లోక్‌సభకు ప్రభుత్వం సమర్పించిన సాధారణ బడ్జెట్ లను పరిశీలిస్తే ఈ ఏడాది మాత్రమే వేతన జీవులకూ,రైతులకూ ఊరట కలిగించే రాయితీలను ప్రకటించారు.నాల్గేళ్ళ పాటు నిర్లక్ష్యానికి గురైన వర్గాలను బుజ్జగించడం కోసం ప్రస్తుత తాత్కాలిక బడ్జెట్ లో కేటాయింపులు చేశారు.రాయితీలు ప్రకటించారు. నిజానికి ఈ బడ్జెట్ నాలుగుమాసాలకే పరిమితం మళ్ళీ ప్రధాని మోడీ అధికారంలోకి వస్తే తప్ప ఈ కేటాయింపులూ,రాయితీలూ ఇలాగే ఉంటాయా అన్నది అనుమానమే. నాల్గేళ్ళూ పెద్దలకే పెద్ద పీట వేశారు. ఏటా బడ్జెట్ వస్తుందనే సరికి ఆదాయంపన్ను మినహాయింపు పరిమితిని పెంచుతారన్న ఊహాగానాలు దాదాపు ఏటా వెలువడుతూనే ఉన్నాయి. 2014-15లో 2.50 లక్షలకు పెంచారు.మళ్ళీ ఈ ఏడాది తాత్కాలిక బడ్జెట్‌లో మధ్యతరగతికి బంపర్ ఆఫర్ గా ఐదు లక్షల రూపాయిలకు పెంచారు. అలాగే, కిసాన్ వికాస పత్రాల పథకాన్ని అధికారంలోకి రాగానే ప్రకటించినా, ఇది ఎన్నికల సంవత్సరం కావడం వల్ల మధ్యంతర బడ్జెట్ లో మినహాయింపు పరిమితిని రెండున్నర లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచారు. 2015-16 బడ్జెట్ లో సంపద పన్నును రద్దుచేశారు. కోటి రూపాయిల కన్నా ఎక్కువ ఆదాయంఉన్న వారికి అదనపు సర్ చార్జి 2 శాతం పెంచారు. కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. సర్వీస్ పన్నును 14 శాతం పెంచారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌కు ఇచ్చే విరాళాలపై వంద శాతం పన్ను మినహాయింపు ఇచ్చారు.

శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి అటల్ ఆవిష్కరణల మిషన్ ను వంద కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.2020 నాటికి అందరికీ ఇళ్ళు కట్టిస్తామని ప్రకటించినప్పటికీ ప్రస్తుత మధ్యంతర బడ్జెట్ అందుకు తగిన నిధులు కేటాయించకపోవడం గమనార్హం. నేరుగా నగదు బదలీ కి పరిమితిని కోటి రూపాయిల నుంచి 10.3 కోట్లకు పెంచారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద తెలుగు రాష్ట్రా లకు ఉన్నత విద్యా సంస్థలను ప్రకటించారు. వాటిలో కొన్నింటిని ప్రారంభించారు,కానీ పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణాలు సిబ్బంది నియామకాలు జరగలేదు.ముద్రా బ్యాంకు కింద వేల కోట్ల రూపాయిల రుణాలను మంజూరు చేసినట్టు గడిచిన నాలుగు సంవత్సరాలుగా బడ్జెట్ ప్రసంగాల్లో ఆర్థిక మంత్రి ప్రకటిస్తున్నప్పటికీ , ఈ బ్యాంకు ద్వారా రుణాలుపొందిన వారి సంఖ్య అంతంత మాత్రమే. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో కొన్ని మంచివి ఉన్న మాట నిజమే కానీ, వాటికి సరైన నిధుల కేటాయింపు జరగకపోవడం అరకొర ఫలితాలు లభిస్తున్నాయి.



రైల్వే ప్రత్యేక బడ్జెట్ రద్దు: మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యంతో

రైల్వేలను 65 వేల కోట్ల రూపాయిలతో అభివృద్ధి చేస్తామని ప్రకటించింది.అప్పటి రైల్వేమంత్రి సదానంద గౌడ అహ్మదాబాద్ - ఢిల్లీ బుల్లెట్ రైళ్ళ గురించి కూడా బడ్జెట్ లో ప్రస్తావన చేశారు. ఆ తర్వాత రైల్వే శాఖను చేపట్టిన సురేష్ ప్రభు ప్రజారంజక పథకాలకు జోలికి వెళ్ళలేదు.రైల్వే విద్యుద్దీకరణ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చారు.ఉన్న పట్టాలపైనే వేగవంతంగా నడిచే రైళ్ళకు ప్రాధాన్యం ఇచ్చారు.2017లో రైల్వే ప్రత్యేక బడ్జెట్ ని రద్దు చేసి సాధారణ బడ్జెట్ లో కలిపేశారు. 92 సంవత్సరాలుగా సాగిన ఈ సంప్రదాయాన్నిరద్దు చేసిన మోడీకే దక్కింది. లక్షకోట్లతో రైల్వే భద్రతానిధిని దశలవారీగాఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి హోదాలో అరుణ్ జైట్లీ ప్రకటించారు.ఈ ఏడాది రైల్వే శాఖకు 64,583కోట్ల రూపాయిలను కేటాయించారు. గతసంవత్సరం సాధారణ బడ్జెట్ లోరైల్వేలకు 1.78 లక్షల కోట్లు కేటాయించారు.రెండేళ్ళ లోపు కాపలాదారు లేని లెవిల్ క్రాసింగ్‌లను మూసివేస్తామని ప్రకటించారు కానీ.ఇంతవరకూ అది అమలు జరగలేదు. లెవిల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు తగ్గినప్పటికీ పూర్తిగా ఆగిపోలేదు.ఈపీఎఫ్ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్) పథకం కింద కనీస పెన్షన్ ను వెయ్యి రూపాయిలకు 2014-15 బడ్జెట్ లోనే పెంచారు. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కి వేతన పరిమితిని 6,500నుంచి 15,000 వేలకు పెంచారు.రైతుల కోసం కిసాన్ టీవీని, ఈశాన్య రాష్ట్రా ల వారి కోసం అరుణ్ టీవీని ప్రారంభించారు.అలహాబాద్ నుంచి హాల్దియా వరకూ గంగానదిలో జలమార్గాల రవాణా పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి 4,250 కోట్లు బేటీ బచావో,బేటీ పఢావో కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి కేటాయించిన నిధుల్లో సగంపైగా ప్రచారానికే ఖర్చు చేస్తున్నట్టు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

రక్షణ రంగానికి 2015-16లో 2,46,726 కోట్లను కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్ లో మూడులక్షల కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి మోడీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఎక్కువప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రతిబడ్జెట్ లోనూ ప్రభుత్వం ప్రకటిస్తోంది.ట్రైన్ - 18 పేరిట ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన కొత్త రైలు బోగీలన్నీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద తయారయ్యాయి. కుంభమేళాకు ఈ రైలును ప్రవేశపెట్టారు.దీని పేరును వందే భారత్ గా మార్చారు. ప్రభుత్వం అటల్ పెన్షన్ స్కీమ్ ని 2015-16లో ప్రవేశపెట్టింది.అయితే, వృద్ధులకు ఇలాంటి పెన్షన్ పథకాలు తెలుగురాష్ట్రా ల్లోనూ అమలు జరుగుతున్నాయి గ్యాస్ కనెక్షన్స్ ఐదేళ్ళలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడానికి ఉద్దేశించి 2 వేల కోట్లను కేటాయించినట్టు 2016-17 బడ్జెట్ లో ప్రభుత్వం ప్రకటించింది.అయితే,ఈ కనెక్షన్లు అందని బీపీఎల్ కుటుంబాల్లో ఇంకా చాలా మందికి ఈ కనెక్షన్లు అందలేదు. ప్రతి బడ్జెట్ సమయంలోనూ ఆర్థిక మంత్రి విద్యుత్ పథకాల గురించి ప్రస్తావిస్తున్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపడినప్పటికీ, నాణ్యమైన కరెంట్ లభించడం లేదు. నిరంతర విద్యుత్ ఘనత తమదంటే తమదని కేంద్రం,రాష్ట్రా లూ ప్రకటించుకోవడానికే సరిపోతోంది కానీ,ఈ కార్యక్రమాన్ని సమీక్షించిన దాఖలాలు లేవు.అలాగే, మైక్రో ఇరిగేషన్ కు 2016-17లో 5,000కోట్లు కేటాయించారు.కానీ, ఈ దేశ వ్యాప్తంగా అమలు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి బడ్‌టెట్ లోనూ కేటాయించాల్సిన అవసరం ఉంది. అలా జరుగుతున్న దాఖలాలు లేవు.2016 నవంబర్ లో పెద్దనోట్లను రద్దుచేస్తున్నట్టు ప్రధానమంత్రి ఉన్నపళంగా ప్రకటించారు.నల్లధనాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యగా అప్పట్లో ప్రధానమంత్రి ప్రకటించినప్పటికీ, అప్పటి కన్నాఇప్పుడు నల్లధన రాశులు ఇబ్బడిముబ్బడిగా పెరిగినట్టు సర్వేలు తెలియజేస్తున్నాయి. నోట్ల రద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నది వాస్తవం కాగా, దాని వల్ల మేలు జరిగిందని ప్రధాని ఇప్పటికీ ప్రకటించడం గమనార్హం. నోట్ల రద్దువల్ల నిరుద్యోగ సమస్య ఎన్నడూలేని రీతిలో పెరిగినట్టు నేషనల్ శాంపిల్ సర్వే నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.అలాగే, చిన్న వ్యాపారులు బాగా దెబ్బతిన్నారు.నగదు కొరత ఏర్పడటంతో ప్రజలు బ్యాంకుల వద్ద,ఏటిఎంల వద్ద క్యూలుకట్టి క్యూల్లోనే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.నోట్ల రద్దు వల్ల మేలు కన్నా కీడుఎక్కువజరిగింది. రైతుల కోసం గడిచిన నాలుగు సంవత్సరాలుగా ప్రకటనలు తప్ప చేసిందేమీ లేకపోవడంతో ప్రస్తుత బడ్జెట్ లో పెట్టుబడి సాయం కింద ఆరేసివేల రూపాయిలు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ లో ప్రకటించింది. అదే సందర్భంలో గడిచిన నాలుగుసంవత్సరాల్లో పారిశ్రామిక,కార్పొరేట్ రంగాలకు మేలు చేకూర్చే చర్యలెన్నింటినో ప్రభుత్వం తీసుకుంది దీని ప్రభావం వల్ల రైతుల్లో, మధ్యతరగతి వర్గాల్లో అసంతృప్తి పెరగడం వల్లనే తాత్కాలికబడ్జెట్ లో ఎక్కువ కేటాయించింది.

పెరిగిన పన్ను వసూళ్ళు:

2013-14లో పన్నుల ద్వారా ఆదాయం 6.38 లక్షలకోట్లు ఉండగా ఇప్పుడు 12లక్షల కోట్లకు పెరిగింది. పన్ను కట్టే వారి శాతం 80కి పెరిగింది. పెద్ద నోట్ల రద్దువల్ల పన్ను కట్టే వార సంఖ్య పెరిగిందని ప్రధాని తరచూ పేర్కొంటున్న మాట నిజమే.మౌలిక సదుపాయాల రంగానికి కూడా గడిచిన నాలుగు సంవత్సరాల్లో మోడీ కేటాయింపులు పెంచిన మాటా నిజమే.అయితే, జాతీయ రహదారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యం లభించడం లేదు బ్యాంకుల్లో మొండి బకాయిలు ఆరు లక్షల కోట్లకుపైగా ఉండగా,మూడు లక్షలకోట్లు వసూలు చేసినట్టు గోయెల్ ప్రకటించారు.అయితే, మొండి బకాయిల గణాంకాల వివరాలు తప్పుల తడక అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

-తేజోన్మయ్

ఫిరాయింపులు పట్టని పార్టీలు!

ఏ దేశంలోనైనా కొంతమంది వ్యక్తులు కొన్ని ఆదర్శాలను, లక్ష్యాలను అంగీకరించి ఒక గ్రూపుగా ఏర్పడితే దాన్నే రాజకీయ పార్టీ అంటారు. ఆ రాజకీయ పార్టీ ఘనత అధికారం పొందడం వల్ల పొందుకుంటుంది. పార్టీలను గూర్చి ప్రొ. కేసీ వేర్ మాట్లాడుతూ, కొన్ని ఆదర్శాలు, లక్ష్యాలతో పనిచేస్తూ జాతీయాభివృద్ధికి, దేశ పురోగతికి పాటుపడుతూ అధికారాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి. ఏ రాజకీయ పార్టీలోని వ్యక్తులైనా ఎన్నికలలో పోటీచేసి పార్టీలో కొనసాగుతూ ఏదో ఒక లబ్ధికి, అధికారాన్ని పొందడానికి ఒక పార్టీ నుండి మరో పార్టీకి మారుతుంటారు. ఏ రాజకీయ పార్టీ టిక్కెట్, గుర్తుపై గెలిచినా చట్టసభల సభ్యులు తమ గోల్‌ను అంటే అధికారాన్ని పొందడానికి పార్టీలు మారుతుంటారు. అలాంటి సమయంలో ఏ పార్టీ టికెట్‌పై ఎన్నికయ్యారో ఆ పార్టీకి రాజీనామా చేసి మరోపార్టీకి మారితే పెద్ద ఇబ్బంది ఉండదు. కాని చట్టసభలకు ఎన్నికయిన వ్యక్తులు కొన్ని ప్రత్యేక కారణాల వల్ల కాని, అధికారం పొందాలన్న ఆశతో ఎన్నుకోబడిన పార్టీకి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలోకిమారినపుడు సమస్య ఉత్పన్నమవుతుంది. దాన్ని పార్టీ ఫిరాయింపు అంటారు. ఎన్నికైన పార్టీ శాసన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లయితే తంటా ఉండదు. ఈ పార్టీ ఫిరాయింపులు పలు రకాలుగా ఉంటాయి. ఒక పార్టీ సభ్యులు మూకుమ్మడిగా మరో పార్టీలోకి మారినట్టయితే ఆ పార్టీ మారడం లేదా ఫిరాయింపు చేయడం అంటారు. అది పార్టీ ఫిరాయింపు కిందకు రాదు. ఏ పార్టీ తరపున ఎన్నికయిన సభ్యులు పది శాతం కంటే ఎక్కువమంది పార్టీ మారితే ఆ వ్యవహారం పార్టీ మారడం అంటారు. అందువల్ల ఇబ్బందులు ఉత్పన్నం కావు. ఆ రాజకీయ పార్టీ చీలిపోయింది కనుక అవి పార్టీ ఫిరాయింపు కిందకు రావు. ఎక్కువమంది సభ్యులు పార్టీలు మారడం వల్ల దానిని చీలిక కింద పరిగణిస్తారు. ఈ పార్టీ మారడం అనేది ఎప్పటినుండో కొనసాగుతోంది. అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమయిందంటే ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై ఎన్నుకోబడి ఆ పార్టీ శాసన సభ్యత్వానికి రాజీనామా చేయకపోవడం వల్ల ఆ పార్టీ ప్రభుత్వాలు అధికారం కోల్పోయి మారిన పార్టీ అధికారానికి వస్తుంది. ఎన్నికైన పార్టీ శాసన సభ్యత్వానికి రాజీనామా చేయకపోవడం పార్టీల సిద్ధాంతానికి, నియమాలకు విరుద్ధం అవుతుంది. అలాంటి వారి సభ్యత్వాన్ని రద్దు చేయమని ఎన్నికైన రాజకీయ పార్టీ శాసన సభాపతికి అపీలు చేస్తే సభ్యత్వం రద్దవుతుంది. కాని అలాంటి పార్టీల శాసన సభ్యులు మారినపుడు ఎవరూ ఫిర్యాదు చేయకుంటే స్పీకర్ / శాసనసభాపతి ఏ చర్యా తీసుకోరు. కాని ఎన్నికైన రాజకీయ పార్టీ అధ్యక్షుడు పార్టీ మారితే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయమని కోరితే ఆ సభ్యత్వాన్ని రద్దు చేయవలసిందే. కాని స్పీకర్ చాలా సమయం తీసుకుని ఏ చర్యా తీసుకోకుండా ఉండవచ్చు. అందుకు పార్టీ మారినపుడు లేదా ఫిరాయించినపుడు ఆ సభాపతికి పూర్తి అధికారాలు ఇవ్వబడ్డాయి. అందుకే పార్టీనుంచి మారాలంటే మూకుమ్మడిగా సభ్యులు మారితే ప్రభుత్వాలు కూడా మారిన సందర్భాలు ఎన్నో చోటు చేసుకుంటున్నాయి.

1968లో హర్యానా రాష్ట్రంలో ఆయారామ్ గయారామ్‌లు మూకుమ్మడిగా పార్టీలు మారినపుడు ప్రభుత్వాలు కూలిపోయాయి. అప్పుడు దేశంలో పార్టీ ఫిరాయింపుల చట్టం తేవాలని ఆనాటి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా వారు పెద్దగా పట్టించుకోలేదు. దాంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ ఫిరాయించడం జరుగుతూనే ఉన్నాయి. 1984లో పార్టీ ఫిరాయింపులు బాగా జరిగి ప్రభుత్వాలు కూలిపోవడంతో పలు పార్టీలు అధికారాన్ని కోల్పోయాయి. దాంతో 1985లో పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించడంతో చట్టం అమల్లోకి వచ్చింది. 1984-85 కాలంలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పార్టీ ఫిరాయింపులు జరిగి ఒకే పార్టీమీద ఎన్నికైన సభ్యులలో సగంమంది మరో పార్టీగా ఏర్పడడం వల్ల ఆ రాష్ట్రంలో అధికారంలో మార్పులు జరిగి ఆ రాష్ట్రాలు నష్టపోయాయి. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఫిరాయింపుల చట్టం చేసింది. ఆ చట్టాన్ని అమలు చేయడంలో అధికార పార్టీలు వెనుకంజ వేస్తున్నాయి. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వంలో మోడీ సర్కార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు మారినా ఎలాంటి చర్యా తీసుకోకపోవడమే కాక, వాటిపై స్పందించడం కూడా లేదు. వారిపై చర్యలు లేవుకదా వాటిని మరింత ప్రోత్సహిస్తున్నారు. చిన్న చిన్న పార్టీల నుండి ఎన్నికైన ఎంపీలు పార్టీ మారితే బీజేపీ వారిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు.

అంతేకాక వారిపై ఆ పార్టీకి చెందిన ఛీఫ్ విప్‌లు, అధ్యక్షులు లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేసి రెండు సంవత్సరాలైనా వారిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. అంటే భారతీయ జనతా పార్టీయే ఈ పార్టీ మార్పిడులను సమ ర్థిస్తోంది. అసలు పార్టీ ఫిరాయింపుల చట్టం ఒకటుందని కూడా గుర్తించడం లేదు. పార్లమెంటులో 187 పాత చట్టాలను రద్దు చేసిన ప్రభుత్వం ఉన్న చట్టాలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు. 1998లో వాజ్‌పేయి నాయకత్వంలో ఇదే బీజేపీ ప్రభుత్వం లోక్‌సభ ఓటింగ్‌లో ఒక్క ఓటు తేడాతో అధికారాన్ని కోల్పోయింది. ఒక్క సభ్యుణ్ణి కొనుగోలు చేసి ఉంటే దేశానికి రూ.1200 కోట్ల ఎన్నికల ఖర్చు తప్పేది. కాని వాజ్‌పేయి అలాంటి నీతిమాలిన/ అనైతిక పనికి పాల్పడకుండా చరిత్రకెక్కారు. నేటి బీజేపీ ప్రభుత్వం ఎంపీలు పార్టీలు మారితే వారి సభ్యత్వాలు రద్దు చేయకుండా పక్కన చేర్చుకుంటోంది. ఎంత దిగజారుడుతనమో విజ్ఞులు గమనించాలి.

రాష్ట్రప్రభుత్వాలు కూడా నేడు కేంద్ర ప్రభుత్వాన్ని చూసి అదే తరహాలో నడుస్తున్నాయి. తెలంగాణలో కాని, ఆంధ్రప్రదేశ్‌లో కాని అధికార పార్టీ ప్రభుత్వాలు నిస్సిగ్గుగా మరో పార్టీ తరపున ఎన్నికయిన వారిని, సంతలో పశువుల్లా డబ్బు వెచ్చించి కొనుగోలు చేశాయి. ఈ అంశాన్ని పార్టీలు శాసన సభల స్పీకర్ల దృష్టికి తెచ్చినా, రాతపూర్వక ఫిర్యాదులు చేసినా పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోలేదు. ఇదే రీతిలో అరుణాచల్ ప్రదేశ్‌లో మూకుమ్మడిగా పార్టీ మారిన శాసన సభ్యులను తమ పార్టీ సభ్యులుగా ఎంచుకుని బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. గోవాలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తాయిలాలు సమర్పించడం లేదా మంత్రి పదవులు ఇచ్చి ప్రభుత్వాలను కాపాడుకుంటున్నది బీజేపీ ప్రభుత్వం. మణిపూర్‌లో 2016 ఎన్నికలలో ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించి బీజేపీ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. ప్రజల మద్దతుతో గెలిచిన వారిని నీతిబాహ్యంగా ఫిరాయింపులు చేసి ప్రభుత్వాలను హస్తగతం చేసుకునే హక్కు బీజేపీకి ఎక్కడుంది. ఈ దేశాన్ని వారు ఎటు నడిపిస్తున్నారోనని ప్రజలు వాపోతున్నారు. అధికారం కోసం ఎలాంటి అనైతిక చర్యలకైనా పాల్పడవచ్చనే పద్ధతిలో వ్యవహరించి ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకం. పార్టీ ఫిరాయింపుల నిర్ణయం స్పీకర్ నిర్ణయానికి వదిలివేయడం మొత్తం రాజకీయ పార్టీల అనైతికతకు అద్దం పడుతోంది. స్పీకర్ నిర్ణయంచేయకపోవడం కంచె చేనుమేసిన చందంగా ఉంది. అధికార పార్టీ సభ్యుడైన స్పీకర్ వ్యవహారం సందేహాలకు గురవుతోంది. స్పీకర్‌ను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ ప్రభుత్వంగా కొనసాగుతోంది. కనుక స్పీకర్ నియంతృత్వ ధోరణిపై చట్ట సవరణలు ఎంతో అవసరం. ఏ చట్టం ద్వారా స్పీకర్ ఇలా వ్యవహరిస్తున్నారనేది స్పష్టత లేదు.

-డాక్టర్ అసయ్యా, ఐఐఎస్
8008359912

ఏటా ఎన్నికలు వస్తే మంచిదేమో!

ప్రధాని ఒకే దేశం ఒకే ఎన్నికలు మంచివని చెప్తారు. భాజపా అధ్యక్షులు మాట్లాడుతూ స్థిరమైన పార్టీని ఎన్నుకోండి. సంకీర్ణాల్ని వద్దు. రోజుకో ప్రధాని వుంటే కష్టం అన్నారు. కానీ ఆలోచిస్తే ఏటేటా ఎన్నికలొస్తేనే మంచిదేమో ననిపిస్తుంది ఈసారి బడ్జెట్ చూశాక. విధానాలూ, ప్రణాళికలూ నిధులూ అంటూ వచ్చే పూర్తి బడ్జెట్ కన్నా, ఎన్నికల ముందొచ్చే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కే మెరుపులెక్కువ. అంతో ఇంతో ప్రజలు ఊరట పొందే ఊసులు, ఊరింపులు ఎక్కువ. ఎన్డీయే హయాంలోని నాలుగేళ్లు పూర్తి బడ్జెట్లు ఇచ్చిన అభయం కన్నా, నాలుగు నెలల ఖర్చుల నుద్దేశిస్తూ వచ్చిన తాత్కాలిక బడ్జెట్ ఎక్కువ ఆశలు రేపుతోంది. ముఖ్యంగా వేతనజీవులు 2014 నుండీ ఎదురుచూస్తూ వచ్చిన పన్ను మినహాయింపులు ఈసారి రెట్టింపు చేశారు. పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచడం మంచి నిర్ణయం. పెరుగుతున్న జీవన వ్యయం నేపథ్యంలో అవసరం. అసంఘటిత కార్మికులకు పింఛను సదుపాయం కల్పించడం మరోమంచి నిర్ణయం. మన దేశంలో అసంఘటిత కార్మికులే ఎక్కువ కనుక. ఐదెకరాల లోబడి భూమి కలిగిన చిన్న రైతులకు ఏటేటా ఆరు వేల రూపాయల నగదు ప్రత్యక్షంగా చేతికే అందిస్తామన్నది ఒక చిన్న సానుకూల చర్య. అది భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా అందించాల్సిన అవసరం ఉంది. అంతకు మించి చేయాల్సినవి కనీస మద్దతు ధర పెట్టుబడి కన్నా యాభై శాతం ఎక్కువగా నిర్ణయించడం, మార్కెట్ అనుసంధానం, గోదాముల నిర్మాణం ఇంకా ఎన్నో. అయితే ఇది తాత్కాలిక బడ్జెట్ కనుక ప్రభుత్వం ఆమాత్రం రైతు గురించి ఆలోచించడమే మహద్భాగ్యం అనుకొందాం. దేశంలో నిరుద్యోగిత గత నలభై ఐదేళ్ల రికార్డుని అధిగమించి ఆరుశాతంగా నమోదైందని అధికారిక గణాంకాలే చెప్తున్నాయి.

నీతి : అసలు బడ్జెట్‌కి వడ్డింపులెక్కువ - కొసరు బడ్జెట్‌కి ఊరింపులెక్కువ.

-వెంకట గాయత్రీ స్మిత, పార్వతీపురం

ఉట్నూరు పంచాయతీ రిజర్వేషన్లపై కౌంటరు వేయండి

• హైకోర్టు ఆదేశం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూరు రెవెన్యూ డివిజన్ కు చెందిన ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవులను కేవలం ఎస్టీలకు మాత్రమే కేటాయించిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, మరియు జిల్లా ఎన్నికల అధికారిని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌లోని మండలాల్లో ఎస్టీ జనాభా లేని గ్రామ పంచాయతీల్లోసైతం సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను మొత్తం ఎస్టీ లకే కేటాయించడం అక్రమమని పేర్కొంటూ ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆర్కిల అశోక్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. పలు మండలాల్లో ఎస్సీ, బీసీ జనాభా కూడా అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు రిజర్వేషన్లు నిర్ణయించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది విన్నవించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ....ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను సమర్పించాలని పంచాయత్ రాజ్ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

కొడుకు మరణం తట్టుకోలేక తల్లి మృతి



పాలకుర్తి, ప్రభన్యూస్ : నవమాసాలు మోసి పెంచిన కొడుకు కళ్లముందే కన్నుమూస్తే తట్టుకొలేని తల్లి తనువు చాలించింది. ఈ విషాద సంఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామంలో కొండపర్తి భాగ్యమ్మ(70) పెద్దకొడుకు గంగాధర్ వద్ద ఉంటోంది. ఇంతలో ఇంటికి పెద్ద దిక్కయిన గంగాధర్ తొమ్మిది రోజుల క్రితం అకస్మాత్తుగా మృతిచెందాడు. అప్పటి నుంచి ఏడుస్తూనే ఉన్న భాగ్యమ్మ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందింది. ఈ ఘటన మండలంలో అందరిని కదిలించివేసింది.

బీపీపీఎల్ లీగ్ లోగో ఆవిష్కరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామాల్లోని యువతను ప్రొత్సహించడానికి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి స్టాండర్స్‌తో ప్రైవేట్‌గానే మొదటిసారిగా క్రికెట్ లీగ్స్‌ను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ నియో జక వర్గంలో నిర్వహించే బీపీపీఎల్ లీగ్ టోర్నమెంట్స్‌కు సంబంధించిన లోగోను శుక్రవారం గాంధీభవన్‌లో గూడూరు నారాయణరెడ్డి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి 22 వరకు ట్వంటీ ట్వంటీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్స్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్‌తో పాటు సీనియర్ క్రికెటర్లు హాజరవుతున్నారని నారాయణరెడ్డి తెలిపారు. గ్రామీణ యువతలో నైపుణ్యాన్ని తీసుకురావడానికి జీఎన్ఆర్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు సీసీఎల్, ఐపీఎల్, ఐసీఎల్ మాత్రమే నిర్వహించారని నారాయణరెడ్డి వివ రించారు. మొదటి స్థానంలో వచ్చిన టీమ్‌కు రూ. 1.50 లక్షలు, రెండో బహుమతి రూ. 1 లక్ష, మూడు, నాలుగో బహుమతి రూ. 50 వేలు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ రూ. 25 వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ రూ. 20 వేల పారితోశకాలు ఉంటాయన్నారు. జీఎన్ఆర్ పౌండేష్ ద్వారా ఉచితంగా క్రికెట్ యూనిఫామ్, కిట్స్ అందజే యనున్నట్లు ఆయన తెలిపారు.

నకిలీ ఓటరు గుర్తింపు కార్డుల కేసు
అధికారులపై వేటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్నికల అధికారుల పేరుతో నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేసిన అధికారులపై వేటు పడింది. మాజీ సీఈసీ ఓపీ రావత్, తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పేరుతో నకిలీ ఓటరు కార్డులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించింది. మరోవైపు జీహెచ్ఎంసీ అధికారులు ఈ ఘటనపై విచారణ జరిపారు. సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదును అందజేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతమైంది. మరోవైపు ఈ ఘటనకు బాధ్యులైన నాంపల్లి ఎఈఆర్ఓ ఖలీలుద్దీన్‌ను సస్పెండ్ చేయగా, డిప్యూటీ ఈఆర్ఓ అలీ, సూపర్‌వైజర్ గిరిధర్‌లకు చార్జి మోమో జారీ చేశారు.

ఓటుకు నోటు కేసులో...
వేం నరేందర్‌రెడ్డికి నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మళ్లీ ఓటుకు నోటు కేసు తెరపైకి వచ్చినట్లయింది. గచ్చిబౌలి రోలింగ్‌హిల్స్‌లోని కాంగ్రెస్ నేత వేం నరేందర్‌రెడ్డి ఇంటికి ఈడీ అధికారులు శుక్రవారం వెళ్లి నోటీసులు అందజేశారు. ఓటుకు నోటు కేసులో వేం నరేందర్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఓటుకు నోటు కేసులో రూ.50 లక్షలపై ఈడీ వివరణ కోరింది. వారం రోజుల్లో ఈడీ ఎదుట హాజరు కావాలని నోటీసులో సూచించారు. వేం నరేందర్‌రెడ్డి ఇంతకు ముందు టీడీపీ పార్టీ నుంచి మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రేవంతరెడ్డితో పాటు ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏసీబీ అధికారుల అభియోగంపై ఈడీ ఈ కేసు దర్యాప్తును కొనసాగిస్తోంది. కాగా, ఈ కేసుతో ప్రమేయమున్న మరికొందరికి ఈడీ త్వరలో నోటీసులు జారీ చేసే అవకాశముంది.

అమెరికాలో అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

గంటకు 500 డాలర్లు (భారత కరెన్సీ ప్రకారం రూ.37వేలు) డిమాండ్ చేస్తుండడంతో భారత లాయర్లే రంగంలోకి దిగి కేసులను విచారిస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా అరెస్టయిన వారిలో కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఉన్నట్టు కూడా ఇక్కడికి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఆమెతో పాటు భర్తను పోలీసులు అరెస్టు చేశారని, అయితే ఆమె గర్భవతి కావడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేశారని భర్త మాత్రం పోలీసుల చెరలో ఉన్నారని తెలుస్తోంది. ఆమెను అమెరికా విడిచి వెళ్ళవద్దని పోలీసులు హెచ్చరించినట్టు చెబుతున్నారు. ఆమెకు జియో ట్యాగింగ్ వేసి బెయిల్ ఇచ్చారని సమాచారం. మిచ్‌గన్ రాష్ట్రంలోని డిటెన్షన్ సెంటర్‌లో మరికొంత మంది భారత విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. వీరు కూడా నకిలీ వీసాలతో అమెరికా వెళ్ళి అక్కడి విశ్వవిద్యాలయాల్లో మాస్టర్ కోర్స్ చదివేందుకు ప్రవేశాలు పొందినట్టు అక్కడి పోలీసులు అనుమానిస్తున్నారు.

తక్షణ విడుదల కష్టమే

పోలీసులు అరెస్టు చేసిన వారిని ఇప్పటికిప్పుడు విడుదల చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది. అమెరికా న్యాయస్థానాలు అక్కడి న్యాయమూర్తులు అందుబాటులో ఉంటేనే కేసులను విచారిస్తారని, ప్రస్తుతం అనేక కోర్టుల్లో న్యాయమూర్తులు లేకపోవడంతో ఇప్పటికిప్పుడు ఈ కేసును చేపట్టే అవకాశం లేదని తెలుగు సంఘాలు చెబుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థులను విచారించి కేసులు లేకుండా వదిలివేస్తున్నారని వారిచేత అండర్ టేకింగ్ తీసుకుని అమెరికా వచ్చి వెళతామన్న హామీని తీసుకుంటున్నారని తెలుస్తోంది. అమెరికా లాయర్లు అత్యధిక ఫీజును డిమాండ్ చేస్తుండడంతో భారత న్యాయవాదులు రంగంలోకి దిగి కేసులు విచారించేందుకు ముందుకు వస్తున్నట్టు సమాచారం. టెక్సాస్ రాష్ట్రంలో అరెస్టయిన విద్యార్థుల తరపున తెలుగు అటార్నీ ఉమ హాజరై విద్యార్థుల తరపున అఫిడవిట్‌ను దాఖలు చేసినట్టు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న విద్యార్థులను విడిపించేందుకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగు సంఘాలు, ఆటా, నాటా, తానా వంటి స్వచ్ఛంద సంస్థలు రంగంలోకి దిగి అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. పోలీసుల అదుపులో ఉన్న విద్యార్థులు స్వదేశానికి రావాలంటే అమెరికా కోర్టుల్లో వాలెంటరీ సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తేనే వదిలివేస్తారని అక్కడి న్యాయవాదులు చెబుతున్నారు. కేసులను విచారించేందుకు ఆయా రాష్ట్రాల్లో న్యాయవాదులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అమెరికా కాన్సులేట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతి ఏటా 44వేల వీసాలను అమెరికా ప్రభుత్వం జారీ చేస్తుందని ఇందులో అన్ని రకాల వీసాలు ఉంటాయని ఉన్నత చదువులకు వెళ్ళేవారు ఎక్కువగా భారత్‌కు చెందిన వారేనని చెబుతున్నారు. అమెరికాలో ఇతర దేశాలకు చెందినవారు 34 లక్షల మంది ఉండగా, ఇందులో అత్యధికంగా భారత్‌లోని గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల తర్వాత తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నట్టు సమాచారం. అరెస్టు చేసిన పలువురు విద్యార్థులను ఇప్పటికే హ్యూస్టన్ జైలుకు తరలించినట్టు చెబుతున్నారు. డెట్రాయిట్ పోలీస్ స్టేషన్‌లో 14 మంది తెలుగు విద్యార్థులు ఉన్నట్టు తెలుస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్ నుంచి 600 మంది విదేశీ విద్యార్థులకు నకిలీ పత్రాలు ఇచ్చారని, ఈ పత్రాలు అందించేందుకు ఎనిమిది మంది తెలుగువాళ్ళే సహకరించారని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు చెబుతున్నారు.

రంగంలోకి తానా

అరెస్టయిన విద్యార్థులను విడిపించేందుకు తానా ప్రతినిధులు జయ్‌తాళ్ళూరి, రాజా కాసుకుర్తి, సతీష్ పాలుకూరి, తానా అధ్యక్షుడు సతీష్ వేమన, వర్జీనీయా తెలుగు సంఘం అధ్యక్షుడు విష్ణు దోనేపూడి, తానా ఆహ్వాన సంఘం చైర్మన్ ప్రొఫెసర్ నరేన్ తదితరులు ఉన్నారు. వీరంతా ఇండియన్ కాన్సులేట్‌గా వ్యవహరిస్తున్న సందీప్ చక్రవర్తిని కలిసి విద్యార్థులపై కేసులు పెట్టకుండా విడుదల చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో భారత రాయబారితో మాట్లాడాలని వారు కోరారు. తానా ప్రతినిధుల నుంచి వినతిపత్రం అందుకున్న ఇండియన్ కాన్సులేట్ జనరల్ సందీప్ చక్రవర్తి అవసరమైన సహాయం అందిస్తానని భరోసా ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆటా ప్రతినిధులు కూడా అమెరికాలో భారత రాయబారిగా ఉన్న హర్షవర్ధన్ సింగ్లాను కలిసి విద్యార్థులకు అవసరమైన న్యాయసాయం అందించాలని కోరారు.

అండగా ఉంటాం: ఆటా

వర్క్ పర్మిట్ కోసమే యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్‌లో భారత విద్యార్థులు చేరారని ఆటా అధ్యక్షుడు భీమ్‌రెడ్డి చెప్పారు. తెలిసో తెలియకో చేరిన విద్యార్థులకు తమ సంఘం తరపున న్యాయ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల అరెస్టుపై వారి తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

అండర్ కవర్ ఆపరేషన్

అమెరికాలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించేందుకు అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఎవరెవరు తప్పుడు పత్రాలతో, గడువు ముగిసిన వీసాలతో అమెరికాలో ఉంటున్నారో గుర్తించేందుకు అండర్ కవర్ ఆపరేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలుస్తోంది. అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్ అధికారులు 2015లోనే డెట్రాయిట్‌లోని ఫార్మింగ్టన్ హిల్స్‌లో ఒక చిన్న గదిలో ఫార్మింగ్టన్ యూనివర్సిటీ పేరుతో నకిలీ వర్సిటీని ఏర్పాటు చేసిందని, ఈ వర్సిటీకి ప్రభుత్వ గుర్తింపు ఉందని వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచిందని సమాచారం. అయితే ఈ వర్సిటీలో సిబ్బంది, అధ్యాపకులు లేరని ఇది పోలీసులు చేస్తున్న ఆపరేషన్ అని తెలియని భారత విద్యార్థులు, దళారీలు వీసా గడువు ముగిసిన వారిని, తప్పుడు పత్రాలతో పెద్ద సంఖ్యలో ఈ వర్సిటీలో ప్రవేశం కల్పించారని దీంతో అసలు వ్యవహారం బయటపడిందని సమాచారం. ఈ వర్సిటీలో ప్రవేశాలు ప్రారంభించి మొత్తం 900 మంది విద్యార్థులను చేర్చుకున్నారని, వీరిలో అత్యధికులు భారత్‌కు చెందినవారేనని చెబుతున్నారు. అయితే అమెరికాలో స్థిరపడ్డ వారందరినీ ఏకకాలంలో పోలీసులు అరెస్టు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా కక్షగట్టి కొందరు ఇలా చేయిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అమెరికాలో స్థిర పడాలనుకున్న వారికి ఎర చూపించి ఈ వీసా రాకెట్‌లో బుక్ చేసినట్టు అనుమానిస్తున్నారు. నకిలీ వర్సిటీ వ్యవహారంలో అరెస్టయిన తెలుగు విద్యార్థులను ఆదుకునేందుకు ఆటా లీగల్ టీం రంగంలోకి దిగింది. పలు భారతీయ విద్యార్థి సంఘాలతో సమావేశమైన ఆటా తెలుగు విద్యార్థులను బయటకు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తున్నారు. ఇండియన్ ఎంబసీకి అవసరమైన సహాయ సహకారాన్ని అందిస్తామని ఆటా ఉపాధ్యక్షుడు పరమేష్ భీమ్‌రెడ్డి చెప్పారు.

ఇంద్రాదేవికి మెస్రం వంశస్థుల పూజలు

ఇంద్రవెల్లి, ప్రభన్యూస్: పవిత్ర గంగాజలంతో ఇంద్రా దేవి వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రతీ ఏటా జరిగే కేస్లాపూర్ జాతర ఏర్పాట్లకు మెస్రం వంశస్థులు తెరలేపి కేస్లాపూర్ మర్రి వనం వద్ద నాలుగు రోజుల పాటు పవిత్ర గంగాజలంతో బసచేస్తున్నారు. గత 15 రోజుల క్రితం నుంచి ప్రత్యేక పూజలతో బయలు దేరిన మెస్రం వంశస్థులు మండల కేంద్రంలోని ఇంద్రా దేవి వద్దకు చేరుకుని ఆదిలాబాద్ జిల్లా, కేస్లాపూర్ మర్రి వనం వద్ద బస చేస్తున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి కెస్లాపూర్‌కు చేరి పటేల్ పీఠాధిపతిని వాయిద్యాలతో ఇంటి నుంచి వనం వద్దకు ఆహ్వానించారు. ఆయన కుటుంబ సమేతంగా ఈ మర్రి చెట్టు వద్ద సాంస్కృతి పరంగా ప్రత్యేక హోదా ఉంటుంది. పవిత్ర గంగాజలాన్ని మర్రి చెట్టు వద్ద కట్టారు. వారం రోజుల నుంచి వెళ్లిన వారు ఆయా గ్రామాల వద్ద పొలిమేరల్లో బస చేస్తు వారి కుటుంబీకులు మెస్రం వంశస్థులు కలిసి భోజన వసతులు ఏర్పాట్లు చేస్తారు. గోదావరి గంగాజలంతో ఊళ్లోకి రాకూడదన్నది వారి నియమం ఉదయం పూజలు చేసి తెల్లవారజామునకు ముందే అక్కడి నుంచి కెస్లాపూర్‌కు వచ్చారు. ఇక్కడి గిరిజన సంప్రదాయ వాయిద్యాలు, డోలు సన్నాయిలు మోగిస్తూ కెస్లాపూర్ వద్దకు చేరారు. నేడు నాగోబా ప్రత్యేక పూజలు, సిరికొండ పూజలకు వెళ్లడం జరుగుతుందని మెస్రం పెద్దలు తెలిపారు.

కరీంనగర్ సీపీపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

• సీఆర్‌పీసీని అతిక్రమించరాదు
• పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలీసులు జారీ చేసే ఉత్తర్వులు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) ను అతిక్రమించరాదని హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే కోర్టు ఆదేశాలున్నప్పటికీ కరీంనగర్ పట్టణంలోని ఓ రిసార్ట్ పై వరుసగా పోలీసులు దాడిచేయడం పట్ల కరీంనగర్ పోలీసు కమిషనర్, కమలహాసన్ రెడ్డి,ఏసీపీ తిరుపతి, ఎస్ హెచ్ వో శశిధర్ రెడ్డి పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పివి.సంజయ్ కుమార్ శుక్రవారం ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తదుపరి విచారణ ఈ నెల 15కు వాయిదా వేశారు. కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లిలో గల పుష్పాంజలి కంట్రీ రిసార్ట్ పై పోలీసులు దాడులు చేయరాదంటూ గతంలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను ఖాతరుచేయకుండా పోలీసులు పలుమార్లు దాడి చేయడంతో రిసార్ట్స్ అధ్యక్షుడు వి.జగపతి రావు హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాజ్యంలో ప్రతివాదులుగా కరీంనగర్ పోలీసు కమిషనర్ కమలహాసన్ రెడ్డి, ఏసీపీ తిరుపతి, ఎస్ హెచ్‌వో శశిధర్ రెడ్డి ని చేర్చారు. అలాగే రిసార్ట్స్‌లో రమ్మీ (13 ముక్కలాట) బెట్టింగ్ మొత్తం ఎంత ఉన్నా జోక్యం చేసుకోరాదని హైకోర్టు నవంబర్,2015 లో కరీంనగర్ పోలీసులను ఆదేశించింది.పైగా వినోదం కోసం ఆడే రమ్మీ ఆట శిక్షింపదగిన నేరం కాదని హైకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రిసార్ట్ లో వీడియో కెమెరాలను ఏర్పాటు చేయాలని , నిర్వహించే వినోదపు కార్యకలాపాలను రికార్డు చేసి కనీసం పక్షం రోజుల వరకు భద్ర పర్చాలని ఆ ఆదేశాల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. పోలీసుల తరపు న్యాయవాది చెబుతున్న వివరాల్లో పొంతన లేకపోవడంతో న్యాయమూర్తి పలు ప్రశ్నలు సంధించారు. పోలీసులు మితిమీరి ప్రవర్తిస్తున్నారని, ఓ హద్దు ఉండాలని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో తెలంగాణ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వచ్చి, కోర్టుకు సహకరించాలని న్యాయ మూర్తి ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు.

పోలీసులు, మీడియా వల్లే మా కుటుంబం బతికుంది

• ప్రణయ్ తండ్రి బాలస్వామి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెళ్లి రోజునే అమృత కొడుకుకు జన్మనివ్వడంతో ప్రణయ్ మళ్లీ పుట్టాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి మీడియాతో మాట్లాడుతూ ఆ దేవుడి దయ వల్ల తన కోడలు, మగశిశువు క్షేమంగా ఉన్నారన్నారు. తమ కోడలు ఆరోగ్యం, ఆమెకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం దృష్ట్యా నెల రోజుల క్రితం హైదరాబాద్ వచ్చామని అన్నారు. ఈ నెల రోజులు కూడా ఎవరికంటా పడకుండా చాలా జాగ్రత్తగా, పోలీసుల రక్షణలో ఉన్నట్లు చెప్పారు. పోలీసులు, మీడియా వల్లే తమ కుటుంబం ఈ రోజు బతికుందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఏడాదిపాటు తమ కుటుంబం ఎంతో వేదన అనుభ వించిందని, ప్రణయ్ హత్య తర్వాత కూడా తమపై వేధింపులు కొనసాగాయని చెప్పుకొచ్చారు. తమ కోడలు అమృతను కూతురి కన్నా ఎక్కువగా చూసుకుం టున్నామన్నారు. మిర్యాలగూడలలో ఉంటే తమకు రక్షణ ఉండదని బావించి హైదరాబాద్ వచ్చినట్లు తెలిపారు. మిర్యాలగూడలో గతంలో అమృత ట్రీట్ మెంట్ చేసుకున్న డాక్టర్ జ్యోతి మారుతీరావు ఫ్యామిలీ డాక్టర్ అని బాలస్వామి దంపతులు తెలిపారు. అమృత డెలివరీ కోసం ఏ ఆసుపత్రిలో చేర్పించారనే విషయమై మారుతీరావుకు సంబం ధించిన వ్యక్తులు ఆరా తీశారని బాలస్వామి చెప్పారు. ఈ విషయంపై తమ వద్ద కచ్చితమైన సమాచారం ఉందన్నారు.

శంషాబాద్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శంషాబాద్‌లోని ఓ కూలర్ల తయారీ కంపెనీలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. నాంపల్లి ఎగ్జిబిషన్‌లో అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే శంషాబాద్‌లోని సాతన్‌రాయలో అగ్ని ప్రమాదం జర గడం ఆందోళన రేపుతోంది. వరుస అగ్న ప్రమాదాలతో నగరవాసులు భీతిల్లుతున్నారు. వివరాల్లోకి వెళితే.. రంగా రెడ్డి జిల్లా శంషాబాద్ శివారులో సాతన్‌రాయిలో ఒక అపార్ట్ మెంట్‌ను అద్దెకు తీసుకుని అందులో కూలర్లు తయారు చేస్తు న్నారు. దీనికి ఎలాంటి పర్మిషన్ తీసుకోలేదు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ పనిచేసేవారంతా బయటకు వచ్చేయ టంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి నాలుగు ఫైరింజన్లతో మంటలను ఆర్పేశారు. కాగా, షార్ట్ సర్క్యూట్ కార ణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారుల ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



దురాలోచనతోనే వరవరరావుపై కేసులు

• విరసం ఆరోపణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నరేంద్ర మోదీ హత్యకు కుట్ర అనే హాస్యాస్పదమైన ఆరోపణతో పూణే జైల్లో ఉన్న విరసం నేత వరవరరావు, న్యాయవాది సురేంద్ర గాండ్లింగ్‌లను మహారాష్ట్ర ఆర్ఎస్ఎస్ పోలీసులు మరో తప్పుడు కేసులో ఇరికించా రని విప్లవ రచయితల సంఘం(విరసం) ఆరోపించింది. ఎక్కడో గడ్చిరోలి జిల్లాలో మైనింగ్ కంపెనీల వాహనాలపై ఆదివాసీల దాడిలో వీళ్ళిద్దరిని నిందితులుగా పెట్టడం అంటే ఈ కేసు నిలిచేది కాదని వాళ్లకూ తెలుసని, అయితే ఇలా ఇష్టం వచ్చిన కేసులన్నీ పెట్టేసి ప్రజాపక్ష మేధావులను నెలలు, సంవత్సరాల తరబడి జైల్లో నిర్బంధించడం ఈ ప్రభుత్వ దురాలోచన అని విరసం విమర్శించింది.

'తెలంగాణ భాషలోనే అచ్చ తెలుగు పదాలు ఎక్కువ'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ భాష ఎక్కువగా అచ్చతెలుగు పదాలతో కూడినదైనా అన్య భాషా పదాలను కూడా అక్కున చేర్చుకుందని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన సభలో పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి చేతుల మీదుగా తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కారాన్ని నలిమెల భాస్కర్ అందుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ తెలంగాణ భాష లక్షణాలు అనే అంశంపై ప్రసం గిం చా రు.. తెలంగాణ భాష అర్థవంతమైనదని తెలిపారు. అలాగే తెలంగాణ భాష సరళమైన లౌకికభాష అని అన్నారు.

మిషన్ భగీరథతో సామాజిక మార్పులు




• ఆ అంశంపై అధ్యయనం చేస్తున్నాం
• ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నామని, ఈ నీటి వినియోగం తర్వాత ప్రజల సామాజిక,ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయని, దీనిపై అధ్యయనం చేస్తున్నామని మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ వెల్లడించారు. శుక్రవారం మిషన్ భగీరథ వర్క్‌షాప్‌లో స్మితా సబర్వాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి సౌకర్యాలు,పరిశుభ్రమైన మంచినీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వ్యాధులపై సర్వేచేశామని ఆమె చెప్పారు. మిషన్ భగీరథ నీటితో ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని యునిసెఫ్ ప్రతినిధులు చెబుతున్నారని, మిషన్ భగీరథతో ఆ సంస్థ భాగం కావడం తమకు గర్వకారణమని అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి గుమ్మం ముందుకే తాగునీటిని తీసుకొస్తున్నామని, జాగ్రత్తగా ఉపయోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మిషన్ భగీరథతో వెలకట్టలేని ఆరోగ్యనిధిని తెలంగాణలోని భావి తరాలకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. తాగునీటి ప్రాముఖ్యతను గుర్తించి పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, ఇంజనీర్లు, సిబ్బంది అంకితభావంతో ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతిగ్రామానికి భగీరథతో శుద్ధి చేసిన తాగునీరు సరఫరా అవుతోందన్నారు. ప్రస్తుతం ప్రతి మనిషికి భగీరథ నీరు గ్రామాల్లో రోజుకు వంద లీటర్లు, పట్టణాల్లో 135 లీటర్లు , నగరాల్లో 150 లీటర్లు సరఫరా అవుతున్నట్టు స్మితాసబర్వాల్ పేర్కొన్నారు. అంతకుముందు భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ , స్థిరమైన తాగునీటి సరఫరా అంశాలపై సీఈ విజయ్ ప్రకాశ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భగీరథ ద్వారా 24గంటలు తాగునీటి సరఫరా చేయడంలో ఉన్న సాధ్యాసాధ్యాలు, ఆటంకాలపై అస్కి డైరెక్టర్ శ్రీనివాచారి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి లోపాలు లేకుండా తాగునీటి సరఫరా ఎలా చేయవచ్చో స్మార్ట్ టెర్రా ప్రతినిధి గోకులు కృష్ణవివరించారు. యునిసెఫ్ ప్రతినిధులు తమ బేస్‌లైన్ సర్వేపై ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండవరోజు వర్క్‌షాప్‌లోఈఎన్‌సీ కృపాకర్ రెడ్డితోపాటు సీఈలు జగన్మోహన్ రెడ్డి , విజయపాల్ రెడ్డి, విజయ్ ప్రకాశ్ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కలప దొంగల కోసం ఎస్పీ అడవిబాట

• సిరికొండ అడవుల్లో 5 కి.మీ.ల నడక
• రూ.28 లక్షల విలువైన కలప స్వాధీనం
• ఎస్పీ విష్ణు వారియర్ సాహసం




ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : అడవుల సంరక్షణ కోసం ఇటీవల ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో ఆదిలాబాద్ ఎస్పీ వాటిని అమలు చేసేందుకు కంకణం కట్టుకున్నారు. దట్టమైన అడవుల్లో స్వయంగా తనిఖీలు చేపట్టేందుకు రంగంలోకి దిగి.. కాలినడక తిరిగారు. అక్రమంగా రవాణా చేయడానికిసిద్ధంగా ఉంచిన లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ రహస్యంగా శుక్రవారం దట్టమైన అడవిలో పర్యటిం చారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సిరికొండ మండలం జోగిపేటకు వెళ్లేందుకు జిల్లా ఎస్పీ రహస్యంగా అడవి ఒడిలో ఐదు కిలోమీటర్లు కాలినడకన నడిచి అటవీ అధికారులను సైతం విస్మయపర్చారు. జోగిపేట గ్రామ పరిధిలో ఆరు లక్షల విలువైన టేకు దుం గలను స్వాధీనం చేసుకున్నారు. అంతటితో ఆగకుండా అటవీ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి రూ. 15లక్షల విలువైన అక్రమ కలపను స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులకు అప్ప గించారు. ఇచ్చోడ మండలం కేశవ పట్నం గ్రామంలో ప్రజా అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ప్రజలతో మాట్లాడారు. కలప అక్రమార్కులు లొంగిపోయి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకోవాలని, దానికి పోలీసు శాఖ సహకరిస్తుందని జిల్లా ఎస్పీ విష్ణు వారియర్ వారికి సూచించారు. అడవులను రక్షించుకోవడానికి అన్ని చర్యలు తీసుకుని అక్రమార్కులపై ఉక్కు పా దం మోపి అక్రమ రవా ణా నివారించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కలప అక్రమ రవాణా వృత్తిగా ఎంచుకున్న వారు లొంగిపోతే వారి జీవనోపాధికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని తెలి పారు. ఎస్పీ వెంట ఉట్నూ ర్ డీఎస్పీ ఎన్ వెంకటేష్, సీఐ ప్రసాద్, ఎస్సైలు వెంకన్న, పుల్లయ్య, స్వామిగౌడ్, ఫారెస్టు అధి కారులున్నారు. ఇదిలా ఉం డగా జిల్లా ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ అడవుల్లో తిరుగుతూ కలప స్మగ్లర్లను చెమటలు పట్టిస్తూనే పోలీసు అధికారులను కూడ అక్రమ కలప రవాణా అరికట్టేందుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా పోలీసు అధికారులు గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఉట్నూర్ గ్రామ శివారులోని ఫకీర్ గుట్ట , ఉమాపతి కుంట ప్రాంతాల్లో నిలువ ఉంచిన రూ.లక్షవిలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.

మాజీ మంత్రి కేశవులుకు అశ్రు నివాళి

• ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
• నివాళులర్పించిన ఎమ్మెల్యే కొప్పుల, జిల్లా యంత్రాంగం




జగిత్యాల , ప్రభన్యూస్ : స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీమంత్రి, ధర్మపురి వాస్తవ్యులైన కేవీ కేశవులు అంత్యక్రియలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఆనాడు స్వాతంత్ర్యం సిద్ధించిన చిన తరువాత ధర్మపురిలో 1947 ఆగస్టు 15న మొదటిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఆయన ఇంటిపై ఎగురవేసి సంబరాలు జరిపారు. అనంతరం సిర్పూర్ నుంచి శాసనసభ్యునిగా గెలుపొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రిగా పనిచేశారు. 1924 జనవరి 14న జన్మించిన ఆయన రజాకార్లను ఎదురించి పోరాడారు. 95 సంవత్సరాలు ఆరోగ్యంతో ఉన్న ఆయన జనవరి 30, బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కన్ను మూశారు. శుక్రవారం ధర్మపురికి తీసుకు వచ్చిన ఆయన భౌతికకాయానికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొంతసేపు ఉంచి ప్రత్యేక వాహనంలో ఆయన ఇంటి వరకు అంతిమయాత్రగా అధికారికంగా తీసుకెళ్లారు. ఆయన నివాసం వద్ద ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్, ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ వెంకట రమణ, జేసీ రాజేశం, ఆర్డీవో నరేందర్ తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్మశానవాటిక వద్ద ఘనంగా అంతిమయాత్ర జరిపారు. భౌతికకాయంపై త్రివర్ణ పతాకం ఉంచి పోలీసులు గాలిలో కాల్పులు జరిపి అంత్యక్రియలు చేశారు. కేవీ కేశవులు అంతి మయాత్రలో ధర్మపురి సీఐ లక్ష్మిబాబు, ఆలయ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బాదినేని రాజేందర్, అయ్యో రి రాజేశ్, ఎస్ఐలు శ్రీకాంత్, రవీందర్ తదితరులున్నారు.



స్టార్టప్‌లకు అచ్ఛేదిన్!





లక్ష డిజిటల్ గ్రామాలకు ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన 2019-20 బడ్జెట్‌లో స్టార్టప్‌లకు పెద్దపీట వేశారు. స్టార్టప్‌లను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఒక లక్షల డిజిటల్ గ్రామల ను ప్రతిపాదించింది. దీంతో స్టార్టప్ రంగం మరింత బలోపేతం అవుతుంది. బడ్జెట్‌లో వచ్చే ఐదు సంవత్సరాల కాలంలో ఒక లక్షల డిజిటల్ గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పీయూష్ గోయల్ చెప్పారు. లక్ష డిజిటల్ గ్రామల వల్ల వివిధ రకాల స్టార్టప్‌లు ఉదాహరణకు ఎడ్యూకేషన్ టెక్, కంటెంట్ బేస్డ్ కంపెనీలు, మీడియా టెక్‌లు, ఫిన్‌టెక్, ఈ-కామర్స్ కంపెనీలు బలో పేతం అవుతాయ ని యూనికార్న్ ఇండియా వెంచర్స్ మేనే జింగ్ డైరెక్టర్ అనిల్‌జోషి చెప్పారు. డిజిటల్ విలేజ్‌లకోసం ప్రభు త్వం స్టార్టప్‌లకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తుందని.. ఈ రంగంలో అవకాశాలు దక్కించుకోవచ్చునని జోషి వివరించారు. సైబర్ సెక్యూరిటీ స్టార్టప్‌లు ప్రభుత్వం స్టార్టప్‌లపై ఫోకస్ పెట్టినందుకు స్వాగతించాయి. ప్రభుత్వం ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఇతర రంగాలపై పెద్దమొత్తంలో పెట్టుబడుల పెట్టడానికి ప్రతిపాదించిందన్నారు.

చిన్న మధ్యతరహా కంపెనీలకు రూ.7,011 కోట్ల కేటాయింపు

2019-20 బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న మధ్య తరహారంగానికి చెందిన కంపెనీలకు గతంలో ఎన్నడూలేని విధంగా రూ.7,011 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. వాస్తవానికి ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ రూ.6,552.61 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించింది. కాగా చిన్న, మధ్య తరహా రంగాలకు చెందిన కంపెనీల ద్వారా పెద్దెత్తున ఉద్యోగాలు సృష్టించవచ్చునన్న అంచనాతో ఈ రంగానికి కేటాయింపులు ఎక్కువ చేశారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద గతంలోఎన్నడూ లేని విధంగా రూ.2327 కోట్లు కేటాయించింది. సూక్ష్మ, చిన్న తరహా రంగాలకు చెందిన వ్యాపారులకు రూ.597 కోట్లు కేటాయించింది.

గ్రామీణాభివృద్ధికి ఊతం! బ్యాంకర్లు అంచనా

మధ్యంతర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసే విధంగా ఉందని బ్యాంకర్లు అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో తీసుకున్న కొన్ని రాయితీల వల్ల మధ్యతరగతి ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చైర్మన్ రజనీష్‌కుమార్ శుక్రవారం నాడు చెప్పారు. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు ఇండియా చీఫ్‌గాకూడా బడ్జెట్ సమతూకంగా ఉందని.. వృద్ధిరేటు పుంజుకునేలా ఉందన్నారు. గ్రామీణాభివృద్ధికి, మధ్య తరగతి ప్రజలు పన్ను రాయితీలు ఇవ్వడం స్వాగతించాల్సిన అంశమని అన్నారు. ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ చైర్మన్ సునీల్ మెహతా మాట్లాడుతూ బడ్జెట్ రైతులకు, కార్మికులకు, అసంఘటిత రంగంలో పనిచేసే వారికి, ఉద్యోగ వర్గాలకు ఊరట కలిగించిం దన్నారు. బంధన్ బ్యాంకు ఎండీ చంద్రశేఖర్ ఘోష్ మాట్లాడు తూ. రైతులకు, చిన్న వ్యాపారులకు, ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్లకు రాయితీలు ఇవ్వడం వల్ల వృద్ధిరేటు జోరందుకుంటుందన్నారు.

చౌకరకం గృహాలకు రాయితీలు ఉక్కు రంగం బలోపేతం

కేంద్రప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని బలోపేతంచేయడానికి చౌకరకం గృహాలకు మార్చి 2020 నాటికి వరకు రాయితీలు పొడిగించింది. దీంతో ఉక్కు ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని సెకండరీ స్టీల్ ఇండస్ట్రీ బాడీ ఏఐఐఎఫ్ఏ శుక్రవారం నాడు వెల్లడించింది. 2019-20 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80'1బీఏ కింది వచ్చే ఏడాది మార్చి వరకు చౌకరకం గృహాలకు సరఫరా చేసే ఉక్కు ఉత్పత్తులపై రాయితీలను పొడిగిస్తున్నట్లు తెలిపారు. తాజాగా ఆర్థికమంత్రి ప్రకటనలో టీఎంటీ బార్లు ఉత్పత్తి చేసే వారికి లాంగ్ స్టీల్ ప్రొడక్టులను ఉత్పత్తి చేసే వారికి లబ్ధి చేకూరుతుందని ఏఐఐఎఫ్ఏ సెక్రటరీ జనరల్ కమల్ అగర్వాల్ చెప్పారు.

రూ. 5 లక్షల ఐటీపై రూ. 12,500 రిబేటు

సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర వివరణ




బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ రూ.5 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు గురించి సీబీడీటి చైర్మన్ సుశీల్‌చంద్ర వివరణ ఇచ్చారు. ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం సంపాదిం చే వారికి రూ.12,500 ఐటి ఆదా అవుతుంది. వచ్చే ఆర్థిక సంవత్స రం నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. రూ.5 లక్షల ఆదాయంపై జీరో టాక్స్ గా భావించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆదాయం ఏడాదికి రూ.6.5 లక్షలు అయితే పన్ను రిబేటు కావాలనుకుంటే ప్రభుత్వం ఇన్వెస్ట్‌మెంట్ స్కీంలు, ఉదాహరణకు పీపీఎఫ్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీ ఎఫ్) ఇన్సెరెన్స్ స్కీంలలో పెట్టుబడులు పెట్టాలి. అలాగే ఉద్యోగులకు స్టాండర్డ్ డిడెక్షన్ మరో రూ.10వేలు పెంచింది. వచ్చే ఏప్రిల్ నుంచి స్టాం డర్డ్ డిడెక్షన్ రూ. 40వేల నుంచి రూ.50వేలకు పెంచారు. దీని వల్ల సుమారు మూడు కోట్ల మందికి లబ్ధి చేకూరుతుంది.

మౌలికరంగానికి జోష్: ఇక్రా

కేంద్రప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మౌలికరంగంపై పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయడంతో ప్రధానంగా రైల్వేలు, మెట్రో ప్రాజెక్టులపై పెద్దమొత్తంలో వ్యయంచేయడం వల్ల మౌలికరంగం జోరందుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. దేశాభివృద్ధికి మౌలికరంగం వెన్నెముకని.. వచ్చే పది సంవత్సరాల్లో భారత్ ఆర్థిక వ్యవస్థను పది ట్రిలియన్ డాలర్లకు తేవాలంటే ప్రభుత్వం మౌలికరంగంపై ప్రధానంగా రోడ్లు, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, పట్టణ రవాణా, గ్యాస్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌మిషన్, ఇన్‌లాండ్ వాటర్‌వేలపై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలని ఇక్రా సూచించింది. తాజాగా మౌలికరంగంపై కేటాయింపు లు పెంచడం వల్ల మౌలికరంగం స్వల్పంగా అనుకూలంగా ఉంటుందని ఇక్రా తేల్చి చెప్పింది.

టెలికంపై రూ.41,520 కోట్లు రెవెన్యూ



కేంద్రప్రభుత్వం 2019-20లో టెలికం రంగంనుంచి రూ.41,519.76 కోట్లు రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.29,245 కోట్లని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం టెలికం రంగంలో ప్రధానంగా లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగం చార్జీలను టెలికం ఆపరేటర్ల నుంచి సేకరిస్తుంది. ఆపరేటర్ల అడ్జెస్డ్‌గ్రాస్ రెవెన్యూ (ఏజీఆర్)ను లెక్కించి వసూలు చేస్తుంటుంది. గత రెండు సంవత్సరాల నుంచి టెలికం రంగం నుంచి ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గుముఖం పడుతోంది. మొబైల్ రంగంలో తీవ్రమైన పోటీ పెరగడంతో కంపెనీలకు లాభాలు తగ్గాయి. దీంతో పాటు ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గింది. దీంతో ప్రభుత్వం లైసెన్సు ఫీజును తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెలికం రంగంలో పోటీ పెరగడంతో మార్కెట్ నుంచి ఆపరేటర్లు కూడా తప్పుకున్నారు.


ఆర్థిక వ్యవస్థకు టానిక్

- బడ్జెట్‌పై భారత్ కార్పొరేట్ల స్పందన
- రైతులకు... మధ్య తరగతికి అనుకూలమైన

బడ్జెట్ డిమాండ్ పెరుగుతుంది

న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి పీయూష్‌గోయెల్ లోకసభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ రైతులకు, మధ్య తరగతికి ఊరట కలిగిస్తుంది ఆర్థిక వ్యవస్థ జోరందుకుంటుందని భారత్ కార్పొరేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గోయెల్ మధ్యతరగతిని, రైతులను, అసంఘటితరంగాల్లో పనిచేసే కార్మికులపై వరాల జల్లు కురిపించారు. దీంతో ఆ వర్గాల చేతిలో కాస్తా డబ్బు ఆడుతుందని కార్పొరేట్ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని అతి పెద్ద పారిశ్రామిక దిగ్గజాలు గౌతమ్ అదానీ, ఆనంద్ మహీంద్రా, ఐటీసీ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌పూరి, వాల్‌మార్ట్ ఇండియా సీఈవో కృష్ణ అయ్యర్‌లు బడ్జెట్‌పై స్పందిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యతిరేక ప్రభావం పడ్డా ప్రభుత్వం బడ్జెట్‌లో కొన్ని రంగాలకు ఉదాహరణకు రైతులకు, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు, మధ్య తరగతికి వరాల జల్లు కురిపించారని అన్నారు.

వృద్ధి రేటుకు మధ్య తరగతే కీలకం: గౌతమ్ అదానీ



భారత్‌లోని మధ్య తరగతి, చిన్న వ్యాపారులు, రైతులే ఆర్థిక వ్యవస్థ వృద్ధికి వెన్నెముకలాంటి వారిని అదానీ గ్రూపు చైర్మన్, వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ ట్వీట్ చేశారు. బడ్జెట్ 2019లో లక్షలాది మంది ప్రజల కలలను మోడీ సర్కార్ తీర్చిందని అదానీ వ్యాఖ్యానించారు.

సమతూకం: ఆనంద్ మహీంద్రా



ఇదే అభిప్రాయాన్ని మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా ట్వీట్ ద్వారా వ్యక్తం చేశారు. ఎన్నికల సంవత్సరం కాబట్టి సంక్షేమ బడ్జెట్ ప్రకటిస్తారని అనుకున్నానని, అయితే ప్రభుత్వం కీలకమైన మధ్యతరగతికి, రైతులకు పెద్దెత్తున వరాలు కురిపించిందని.. బడ్జెట్ సమతూకంగా ఉందన్నారు.

చంద్రజిత్ బెనర్జీ (సీఐఐ డైరెక్టర్ జనరల్)



2019-20 బడ్జెట్ డిమాండ్ పుంజుకోవడానికి, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఊతం ఇచ్చేలా ఉంది. సమాజంలో ఎక్కువ వినియోగం జరిగే వర్గాలు ఉదాహరణకు రైతులు, మధ్యతరగతి, అసంఘటిత రంగాలే... ఈ రంగాలపై బడ్జెట్‌లో పెద్దపీట వేయడం హర్షించదగ్గ పరిణామమని ఆయన అన్నారు.

సరైన దిశలోనే ... వాల్‌మార్ట్ సీఈవో

బడ్జెట్‌లో ప్రభుత్వం సరైన వర్గాలపై ఫోకస్ పెట్టిందని, ముఖ్యంగా మధ్య తరగతి, గ్రామీణ రంగాలతో పాటు రైతులకు ఆదాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంది.

సంజీవ్ పూరి .. ఐటీసీ సీఈవో



ఇదే అభిప్రాయాన్ని ఐటీసీ సీఈవో పూరి వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి తాత్కాలిక బడ్జెట్‌లో రైతులకు లబ్ధి చేకూర్చడంతో పాటు, అసంఘటిరంగంలోని కార్మికులు, మధ్యతరగతిపై ఫోకస్ పెట్టడంతో వృద్ధిరేటు జోరందుకుంటుందన్నారు.

సునీల్ దుగ్గల్ .. డాబర్ ఇండియా

బడ్జెట్ 2019లో మధ్య తరగతికి, రైతులకు, అసంఘటి తరంగంలో పనిచేసే లక్షలాది ఉద్యోగులకు రాయితీల వర్షం కురిపించింది.

కార్గిల్ ప్రెసిడెంట్



మధ్యంతర బడ్జెట్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారని కార్గిల్ ఇండియా ప్రెసిడెంట్ సైమన్ జార్జి చెప్పారు. కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ యోజన ద్వారా సన్నకారు రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ పథకం ఆహ్వానించదగ్గ పరిణామం, దీంతో పాటు బడ్జెట్‌లో ప్రభుత్వం రైతులకు చాలా చేయాల్సింది. ముఖ్యంగా దిగుబడులను విక్రయిం చే వీలుకల్పిం చాల్సిందన్నారు.

సునీల్ డిసౌజా వర్లపూల్

ముందుచూపు బడ్జెట్... వినియోగదారుడి చేతిలో డబ్బు ఆడే అవకాశాలున్నాయి. దీంతో వినియోగవస్తువులపై పెద్దమొత్తంలో వ్యయం చేయడానికి వీలవుతుంది.


పేదలకు అనుకూలం

ఫ్యాప్సీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కరుణేంద్ర జాస్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్ హామీలు పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కల్పించేలా ఉన్నాయని ఫ్యాప్సీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరుణేంద్ర జాస్తి చెప్పారు. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని దృష్టిలో ఉంచుకుని మౌలిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని ఆయన చెప్పారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇచ్చినట్లు బడ్జెట్ ఉన్నప్పటికీ అందరికీ ప్రయోజనం కలిగేలా ఉన్నందున దీన్ని స్వాగతిస్తున్నామని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్‌పై ఫ్యాప్సీ విశ్లేషణ చేసిన అనంతరం శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఫ్యాప్సీ వైస్ ప్రెసిడెంట్ రమాకాంత్ ఇనాని కూడా పాల్గొన్నారు. ఎన్నికలు త్వరలో జరగనున్నందున హామీల వరాలుగా ఇచ్చినట్లు ఉందని కరుణేంద్ర అన్నారు. రైతు కూలీలకు, రైతులకు పెన్షన్లు, పేద రైతులకు ఏటా రూ.6వేలు ఇవ్వాలని ప్రతిపాదించడం ఆ వర్గాలకు లబ్ధి చేకూరుస్తుందని ఆయన అన్నారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచి మధ్య తరగతి వర్గాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారని ఆయన అన్నారు. రెండో ఇల్లు కొనుగోలు చేసేందుకు పన్ను మినహాయింపు, బిల్డర్లు విక్రయించలేని అపార్ట్‌మెంట్లకు రెండేళ్ళ పాటు పన్ను మినహాయింపు, ప్రతి ఇంటికి మార్చి నాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ప్రతిపాదించడం హర్షణీయమని కరుణేంద్ర అన్నారు. జిఎస్‌టి పరిమితిని పెంచడం వాటిని ప్రోత్సహించడమేనని అన్నారు. ప్రతి కుటుంబానికి ఇల్లు సమ కూరాలని, గ్రామాలను డిజిటల్ చేసి జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామనడం హర్షణీయమన్నారు. అయితే ప్రభుత్వం అనేక పథకాలు ప్రకటించినప్పటికీ ద్రవ్యలోటును నియంత్రించలేకపోయింది. ద్రవ్యలోటు 3.1 నుంచి 3.4 శాతానికి పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్ సామాన్యులకు ప్రయోజనం కలిగించేలా ఉందని కరుణేంద్ర అన్నారు.

ద్రవ్యోల్బణం కోరలు పీకాం



రెండంకెల్లో ఉన్న ద్రవ్యోల్బణాన్ని సింగిల్ డిజిట్‌కు తీసుకువచ్చామని ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. సరాసరి ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పరిమితం చేశాం. గతంలో యూపీఏ ప్రభుత్వంలో 2009-14 వరకు సరాసరి ద్రవ్యోల్బణం 10.1 శాతం. ఇతర ప్రభుత్వాలతో పోల్చితే తమ ప్రభుత్వం హయాంలో ద్రవ్యోల్బణం అతి తక్కువ. గత ఏడాది డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్టానికి 2.19 శాతానికి తీసుకువచ్చామని, ద్రవ్యోల్బణం పై అదుపులేకపోతే ప్రతి కుటుంబం ఆహారం, ప్రయణాలు, గృహాలు, ఇతర వినియోగవస్తువులపై అదనంగా 35-40 శాతం వ్యయం చేయాల్సి వచ్చేదని గోయల్ బడ్జెట్ ప్రసంగంలో అన్నారు.

ద్రవ్యలోటు 3.4 శాతం

ఆర్థికమంత్రి బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు అంచనాలను జీడీపీలో 3.4 శాతానికి సవరించారు. వివరంగా చెప్పాలంటే రూ.6.34 లక్షలుగా చెప్పుకోవ చ్చు.. ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ కట్టుదాటుతోంది. ద్రవ్యలోటు విషయానికి వస్తే ఒక ఆర్థికసంవత్సరం లో ప్రభుత్వ వ్యయం కోసం మార్కెట్ నుంచి ఎంత మొత్తం తీసుకోవాలో నిర్ణయిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 3.3 శాతానికి పరిమితం కావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో ద్రవ్యలో టు జీడీపీలో 3.4 శాతం లక్ష్యంగా నిర్దేశించింది. దీనికి ప్రధాన కారణం రైతులకు పెద్దమొత్తంలో లబ్ధి చేకూర్చడమే కారణం.

2019-20 జీడీపీ 7.5 శాతం



భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు ఇప్పటికిప్పు డు 8 శాతం దాటే అవకాశాల్లేవు. గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వాస్తవ ద్రవ్యోల్బణం... జీడీపీలో సర్దుబాటు చేసిన తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతంగా నమోదు కావచ్చు.. ఈ ఆర్థిక సంవత్సరం భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతంగా నమోదు కావచ్చునని కేంద్ర గణాంకాల కార్యాలయం కూడా అంచనా వేసింది. కాగా కేంద్ర గణాంకాల కార్యాలయం(సీఎస్ఓ) దేశంలోని పంట దిగుబడి సమాచారంతో పాటు సేల్స్ టాక్స్, డిపాజిట్లు, రుణాల డిమాండ్, ప్రయాణికుల, సరకు రవాణా ద్వారా రైల్వేల ఆదాయం అలాగే విమానప్రయాణికులు, సరకు రవాణా ద్వారా వచ్చే ఆదాయం లెక్కించి ముందుస్తు జీడీపీ గణాంకాలను లెక్కిస్తుంది. దాని ప్రకారం వచ్చే ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు గురించి అంచనాకు వస్తారు. ఆర్‌బీఐ అంచనా ప్రకారం వచ్చే ఆర్థికసంవత్సరం ప్రథమార్థంలో 7.5 శాతం, 2018-19లో 7.4 శాతంగా అంచనా వేసింది. సమీప భవిష్యత్తులో ఎనిమిదిశాతం దాటడం రూపం దాల్చాలంటే మరి కొంతకాలంవేచిచూడాల్సిందే.

ఎన్నికల ముందు ఊహించిన బడ్జెట్టే

తెలంగాణ సీఐఐ చైర్మన్ సంజయ్ సింగ్ బడ్జెట్‌పై మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఊహించినట్లు గానే బడ్జెట్ ప్రకటించారని అన్నారు. ఇది సామా న్య ప్రజల బడ్జెట్ అని, నిరాశ, నిస్పృహల్లో ఉన్న రైతులు, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగిస్తుందని ఆయన అన్నారు. పన్నుల నిబంధనలు సరళీకృతం చేయడంతో పన్నుల వసూళ్ళకు మెరుగైన పరి స్థితులు ఏర్పడతాయన్నారు. 2030 విజన్‌తో బడ్జెట్‌ను ప్రతి పాదించి అభివృద్ధి దిశగా దేశం పయనించేలా హామీలు ఇచ్చారని సంజయ్ సింగ్ పేర్కొన్నారు.

ఆరోగ్య భారత్ దిశగా బడ్జెట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆరోగ్యవంతమైన భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అంకితభావం తో తాత్కాలిక బడ్జెట్‌పై దృష్టి సారించిందని అపోలో హాస్పిటల్స్ గ్రూపు జేఎండీ సంగీతారెడ్డి అన్నారు. నగరాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పట్టణాలు, గ్రామాలకు కూడా అందించేలా కేంద్రం బడ్జెట్ ప్రతిపాదించిందని ఆమె పేర్కొన్నారు. వైద్యరంగం మౌలిక సదుపాయాల్లో పట్టణాలు, గ్రామాలకు మధ్య వ్యత్యాసం తొలగిపోయే అవకాశం వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు మరిన్ని పెరిగేలా ప్రత్యేక పాలసీలు ఉండాలని సంగీతారెడ్డి కోరారు.


అభివృద్ధికి దోహద పడే బడ్జెట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తాత్కాలిక బడ్జెట్ అభివృద్ధికి దోహదం చేసేలా ఉందని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ అభిప్రాయ పడ్డారు. చిన్న, మధ్య తరగతి రైతులకు ఆదాయం సమకూరేలా పథకాలు ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమని ఆయన పేర్కొన్నారు. పశు సంవర్ధక, మత్స్య శాఖలను ప్రోత్సహించే నిర్ణయంతో రైతులకు అదనపు ఉపాధి కల్పించి ఆదాయం పెరుగుతుందని ఆయన అన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఊరట కలిగిస్తుందని రజనీష్ అన్నారు. బ్యాంకు డిపాజిట్లపై టీడీఎస్ పరిమితిని పెంచడంతో డిపాజిట్లు మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

మార్కెట్లకు బడ్జెట్ కిక్కు!

- ఇంట్రాడేలో 500 పాయింట్లపైనే
- ఆటో షేర్ల హవా.. 212 పాయింట్ల వృద్ధి

ముంబై: కేంద్రప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాత్కాలిక బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేయడం, కొన్ని వర్గాలకు బడ్జెట్‌లో రాయితీల వర్షం కురిపించడం.. ముఖ్యంగా రైతులు, ఉద్యోగులకు, అసంఘటితరంగంలోని కార్మికులను దృష్టిలో ఉంచుకొని వారికి అనుకూలంగా బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వం ఉదారంగా రాయితీలు ప్రకటించడంతో ద్రవ్యలోటు పెరిగిపోతోందన్న ఆందోళన కొంత మంది ఇన్వెస్టర్లలో కనిపించింది. సెన్సెక్స్ 212.74 పాయింట్లు లేదా 0.59 శాతం పెరిగి 36,469.93 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ 67.20 పాయింట్ల లాభంతో 10,893.65 వద్ద స్థిరపడింది. శుక్రవారం ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. లోకసభలో ఆర్థికమంత్రి పీయూష్‌గోయెల్ 2019-20 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టిన వెంటనే ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు ర్యాలీ ఏర్పడింది. అటు తర్వాత మధ్యాహ్నం కాస్తా వెనుకబడి.. మార్కెట్ ముగిసే నాటికి మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఆటో రంగంతో పాటు వినియోగరంగానికి చెందిన షేర్లు వ్యవసాయరంగానికి చెందిన షేర్లు జోరందుకొన్నాయి. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు




పెంచడంతో పాటు, సన్నకారు రైతులకు ఏడాదికి రూ.6,000 ప్రభుత్వం జమ చేస్తుంది. అలాగే అసంఘటితరంలో పనిచేసే కార్మికుడు 60 ఏళ్లు దాటితే నెలకు రూ.3,000 పెన్షన్ ప్రకటించింది. మొత్తానికి మార్కెట్ మూడ్ మాత్రం అనుకూలంగా ఉంది. అయితే కొంత మంది విశ్లేషకులు మాత్రం ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోతుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతానికి ఎగబాకుతుంది.. లక్ష్యం 3.3 శాతంతో పోల్చుకుంటే కాస్తా ఎక్కువే. ప్రభుత్వం పెద్దెత్తున తాయిలాలు ప్రకటించడంతో మార్కెట్లోకి పెద్దమొత్తంలో నగదు అందుబాటులోకి వస్తుందని, కొత్తపెట్టుబడులకు అవకాశాలుంటాయని చెబుతున్నారు. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. బడ్జెట్ కిక్కుస్వల్పకాలానికి మార్కెట్లపై బలంగా ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ దిగ్గజం నోమురా మాత్రం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం చేరుకోలేదని, వచ్చే ఆర్థికసంవత్సరానికి ద్రవ్యలోటు 3.4 శాతమని.. వాస్తవానికి ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యం 3.1 శాతం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంటే 2020-21 నాటికి మూడు శాతం లక్ష్యంగాపెట్టుకోవాలని ఉన్నా.. వాస్తవ రూపం దాల్చుతుందా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతోంది. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో అధికారంలోకి రావాలంటే రైతులనుంచి ఆమ్‌ఆద్మీ, ఉద్యోగులను ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. కాగా ఈ వారంలో సెన్సెక్స్ 443.89 పాయింట్లు, నిఫ్టీ 113.10 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడింది మాత్రం ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగానికి చెందిన సూచిలు 2.62 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభాలను నమోదు చేసిన షేర్లలో హీరో మోటోకార్ప్, మారుతి సుజుకి, హెచ్‌సీఎల్‌టెక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్‌ఆటో, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, రిల్, హెచ్‌యూఎల్, భారతి ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ షేర్లు 7.48 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా వేదాంత 17.82 శాతం నష్టపోయింది.

దుమ్మురేపిన ఎస్‌బీఐ లాభాలు

ముంబై: దేశంలోని అతి పెద్ద ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఏకీకృత నికరలాభం రూ.4,709.15 కోట్లు ఆర్జించిం ది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,886.57 కోట్లు నష్టాన్ని మూటగట్టుకున్నట్లు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం ఏకీకృత ఆదాయం గణనీయంగా పెరిగి రూ.84,350.11 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.74,190.87 కోట్లని బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇక గరిష్ఠ ఎన్‌పీఏ విషయానికి వస్తే కాస్తా మెరుగుపడింది. డిసెంబర్‌తో 8.71 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 10.35 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏ కూడా 3.95 శాతానికి దిగిరాగా. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 5.61 శాతంగా నమోదైంది. మొండిబకాయిలకు కేటాయింపులు కూడా భారీగా తగ్గి రూ.14, 143.74 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17,963.77 కోట్లని, అలాగే మొండిబకాయిలకు కేటాయింపులు కూడా మూడింట రెండు వంతులు అంటే రూ.19,097.52 కోట్ల నుంచి రూ.6,355.98 కోట్లకు దిగివ చ్చాయని ప్రకటనలో వివరించింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన చూస్తే బ్యాం కు నికరలాభం రూ.3,954.81 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరనష్టం రూ.2,416.37 కోట్లని తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 485 కోట్లు



హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబరేటేరీస్ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 45 శాతం వృద్ధితో రూ.485 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.334 కోట్లు నికరలాభా న్ని ప్రకటించింది. రెవెన్యూ విషయానికి వస్తే ఒక శాతం పెరిగి రూ.3,850 కోట్లకు చేరిందని తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రెవె న్యూ రూ.3,806 కోట్లు ఆర్జించింది. డాక్టర్ రెడ్డీస్ మూడవ త్రైమాసికంలో మెరుగైన పనితనం కనిపించిందని, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పాటు భారత్ మార్కెట్ల నుంచి బలమైన మద్దతు లభించిందని, దీంతో పాటు కొత్త ప్రొడక్టుల ను మార్కెట్లో విడుదల చేయడంతో పాటు వ్యయ నియంత్ర ణపై దృష్టిపెట్టడం తో మంచి లాభాలను ఆర్జించగలిగామని డాక్టర్ రెడ్డీస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, గ్లోబల్ హెడ్ ఐటీ సుమేన్ చక్రబర్తి ఇక్కడ మీడియా తో చెప్పారు. గ్లోబల్ జెనెరిక్ రెవెన్యూ క్యూ3లో రూ.3,135 కోట్లకు ఎగబాకగా... క్రితం ఏడాదితో పోల్చుకుంటే నాలుగు శాతం పెరిగింది. వీటిలో అభివృద్ధి చెందిన మార్కెట్లతో పాటు భార త్ మార్కెట్ల వంతు గణనీయంగా ఉందని ఆయ న వివరించారు. అయితే ఉత్తర అమెరికా రెవెన్యూ ఎనిమిది శాతం క్షీణించి రూ.1,480 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1607 కోట్లని తెలిపారు. ఫార్మాస్యూ టికల్ సర్వీసెస్‌తో పాటు యాక్టివ్ ఇంగ్రిడియెంట్ ల నుంచి రెవెన్యూ రూ.594 కోట్లు సాధించిందని.. క్రితం ఏడాదితో పోల్చుకుంటే తొమ్మిది శాతం వృద్ధి కనిపించిందని ప్రకటన లో వివరించింది.



కేసీఆర్ పథకాలే దిక్కయ్యాయి!

అరకొర సాయంతో లాభం లేదు

టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం చేసిన ప్రయత్నంలా ఉందని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నవిధంగా పూర్తిస్థాయిలో రైతులకు సహాయం ఇవ్వకుండా అరకొరా పెట్టుబడి సహాయం ప్రకటించారని వెల్లడించారు. కేంద్రం బడ్జెట్ ప్రకారం 2 హెక్టార్లకు ఏడాదికి రూ. 6,000 ఇస్తామంటే, కనీసం నెలకు రూ. 500 కూడా ఇచ్చినట్టు కాదని అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఏడాదిలో ప్రతి సీజన్‌కు, అది కూడా ప్రతి ఎకరానికి రూ. 5,000 ఇస్తోందని గుర్తుచేశారు. ఈ పథకంతో పోల్చుకుంటే బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన సహాయం రైతులను మోసం చేసే విధంగానే ఉందని వెల్లడించారు. అయితే రైతులకు ఒక రూపాయి ఇవ్వాలనే ఆలోచన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి స్ఫూర్తి పొందినందుకు సంతోషంగా ఉందని కవిత వ్యాఖ్యానించారు.బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన అనేక పథకాలు చూస్తుంటే అవన్నీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకుని ఓట్లు పొందడం కోసమే ప్రవేశపెట్టినట్టు స్పష్టంగా అర్థమవుతోందని ఎంపీ కవిత అన్నారు. అయితే ఓటర్లు ఒక విషయం గుర్తుపెట్టుకోవాలని, ఐదేళ్లలో 5 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన బీజేపీ సర్కారుకు ఇవన్నీ చేయాలన్న ఉద్దేశం ఉంటే ఇప్పటికే అమలు చేసి ఉండేవారని అన్నారు. ఎన్నికలు కేవలం ఇంకా రెండు నెలలు ఉన్నాయనగా ఇవన్నీ ప్రకటించారంటేనే ఇందులో సగం అమలయ్యే పరిస్థితి లేదని అర్థమవుతోందని ఆమె వ్యాఖ్యానించారు. రైతులకు పెట్టుబడి సహాయంలోనూ మరింత స్పష్టత రావాలని ఆమె పేర్కొన్నారు. సంస్కరణల పేరుతో ఆశించిన ఫలితాలు రాలేదని, నోట్ల రద్దు కారణంగా వెనక్కి తెచ్చిన నల్లధనం ఎంతో ఇప్పటికీ లెక్కలు చెప్పలేకపోతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. చివరకు సంస్కరణలతో ఫలితాలు రాకపోవడంతో కేసీఆర్ చేపట్టిన పథకాలను చేపడితే తప్ప గెలవలేమని బీజేపీ అగ్ర నాయకత్వం భావించిందని ఎంపీ కవిత అన్నారు.

ద.మ. రైల్వేకు రూ.5,924 కోట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మధ్యంతర బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,924 కోట్లను కేటా యించారు. ఈ నిధులన్నీ ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులకు మాత్రమే ఇచ్చారు. కొత్త ప్రాజెక్టులను ప్రకటించలేదు. గత ఏడాది పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఎస్‌సీఆర్‌కు రూ. 5752 కోట్లను కేటా యించగా, ఈ సారి స్వల్పంగా నిధులను పెంచారు.


- అక్కన్నపేట- మెదక్ లైన్ కోసం రూ. 10 కోట్లు , కొత్తపల్లి - మనోహరాబాద్ మధ్య 150 కిలోమీటర్ల లైన్ కోసం రూ. 200 కోట్లు, ఓబు లవారిపల్లి - కృష్ణపట్టణం కొత్త లైన్‌కు రూ. 30 కోట్లు,
- ముద్కేడ్ - పర్బనీకి రూ. 34.5 కోట్లు, గుంటూరు - తెనాలి మధ్య విద్యు దీకరణకు రూ. 5 కోట్లు, ఎంఎంటీఎస్ ఫేజ్ 2 కోసం రూ. 10 లక్షలు, మునీరాబాద్ - మహబూబ్‌నగర్ కోసం రూ. 275 కోట్లు,
- భద్రా చలం - సత్తుపల్లి మధ్య 56 కిలోమీటర్ల లైన్ కోసం రూ. 405 కోట్లు, ఖాజీపేట - బలార్షా మధ్య 202 కిలోమీటర్ల మూడవ లైన్ ప్రాజెక్టు కోసం రూ. 265 కోట్లు, నడికుడి - శ్రీకా ళహస్తి 309 కిమి కొత్త లైన్ ప్రాజెక్టు కోసం రూ. 700 కోట్లు,
- కడప - బెంగళూరు మధ్య 225 కిలోమీటర్ల కొత్త లైన్ నిర్మాణానికి రూ. 210 కోట్లు, గుంతకల్ - కల్లూరు మధ్య 40.60 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న డబుల్ లైన్ కోసం రూ. 15 కోట్లు, గుంటూరు - గుంతకల్ మధ్య 443 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న డబ్లింగ్‌లైన్ కోసం రూ. 280 కోట్లు,
- విజయవాడ - భీమవరం - నిడదవోలు మధ్య 221 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న డబ్లింగ్ లైన్ కోసం రూ. 175 కోట్లు, కోటిపల్లి - నర్సాపూర్ మధ్య 57 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న కొత్త లైన్ కోసం రూ. 200 కోట్లు,
- సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య 85 కిలోమీటర్ల డబ్లింగ్ లైన్ పనుల కోసం రూ. 200 కోట్లు, గుత్తి - ధర్మవరం మధ్య 90 కిలోమీటర్ల డబ్లింగ్ లైన్ కోసం రూ. రూ.126 కోట్లు,
- ఖాజీపేట - విజయవాడ మధ్య 219 కిలోమీటర్ల డబ్లింగ్ పనుల కోసం రూ. 110 కోట్లు, విజయవాడ - గుంటూరు మధ్య 287 కి.మి మూడవ లైన్ నిర్మాణానికి రూ. 350 కోట్లు, ఘట్‌కేసర్ - యాదాద్రి ఎంఎంటీఎస్ కోసం రూ. 20 కోట్లు, బైపాస్ లైన్ల కోసం రూ. 143 కోట్లు,
- చర్లపల్లి సాటిలైట్ టర్మినల్ అభివృద్ధి కోసం రూ. 5 కోట్లు రోడ్ ఓవర్ బ్రిడ్జీల కోసం రూ. 397 కోట్లు, లైన్ల ఆధునీకరణ కోసం రూ. 657 కోట్లు, తిరుపతి రైల్వే స్టేషన్‌కు రెండవ ప్రవేశద్వారం కోసం రూ. 12.45 కోట్లు, తిరుచానూర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 6 కోట్లను కేటాయించారు.

ఇది ఓట్ల బడ్జెటే



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ మరోసారి వ్యాపారస్థుల పార్టీ అని తేలిపోయిందన్నారు. నాలుగున్నరేళ్లుగా గుర్తుకు రాని రైతులు ఎన్నికల్లో ఓట్ల కోసం వరాలు ఇచ్చారని విమర్శించారు. రాజ్యాంగ విరుద్ధంగా బడ్జెట్ ఉన్నదని ఆయన ఆరోపించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్పందించారు. బడ్జెట్‌లో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇన్‌కంట్యాక్స్ పరిధిని పెంచి వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని చెపడం దారుణమన్నారు. పన్ను ఎగవేత దారుల విషయంలో ఎందుకు మాట్లాడలేదని ఆయన నిలదీశారు.

రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?



నాలుగేళ్లుగా రైతులను పట్టించుకోని ప్రధాన మంత్రి నరేంద్రమోడి.. ఎన్నికల వస్తున్నందునే ఇప్పుడు రైతులపై ప్రేమ కురిపిస్తున్నాడని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి విమర్శించారు. మోడి హయాంలో ఒక్కసారైనా రైతు పండించిన పంటకు మద్దతు ధరను పెంచారా..? అంటూ ఆయన నిలదీశారు. మోడి అధికారంలోకి వచ్చాక వంటనూనే, చెక్కర, పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకోవడంతో,, వ్యవసాయ రంగం సంక్షోభానికి అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. బీజేపీ సర్కార్ అమలు చేస్తున్న క్రాప్ ఇన్సూరెన్స్ ఓ పెద్ద స్కామ్ అని ఆయన విమర్శించారు.

ఇది దూరదృష్టి బడ్జెట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేదల పట్ల దూరదృష్టితో ఆలోచించి బడ్జెట్ పెట్టిన గొప్ప వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని, బడ్జెట్‌ను తాము స్వాగతిస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ స్వాగతించారు. రైతులు, పేదలు, చిరు వ్యాపారులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుని వారికి పెద్దపీట వేశారని కొనియాడారు. సమూలమైన మార్పులు ఆకాంక్షిస్తూ అవినీతిరహిత సమాజ నిర్మాణం చేయడమే భాజపా లక్ష్యమన్నారు. సమాజంలో అంతరాలు లేకుండా ఆర్థిక ప్రాతిపధికన రిజర్వేషన్లు కల్పించడం సామాన్య విషయం కాదన్నారు. ఆర్థిక సంస్కరణలు, జిఎస్టీ, పెద్దనోట్లు రద్దుతో పారదర్శకత పెరిగిందని కితాబిచ్చారు.

నిరుద్యోగంపై మోడీ క్షమాపణ చెప్పాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ధరల పెరుగుదలకు, గడచిన ఐదు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయిన నిరుద్యోగానికి కారణమైన ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి క్షమాపణ చెప్పాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నేతలు చాడా వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.దేశ వ్యాప్తంగా గ్రామాల్లో నిరుద్యోగం 6.1 శాతం, పట్టణాల్లో 7.8 శాతం నిరుద్యోగం ఉందని, నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం నివేదిక వెల్లడించిందని, ఇంత పెద్ద అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దాచి పెట్టిందని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, నిజమైన నివేదిక దేశానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీతో టీఆర్ లాలూచీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

ఎన్నికల ముందు తాయిలాలా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్ళ పాటు ప్రజలను ఇబ్బందులు పెట్టి ఎన్నికల ముందు తాయిలాల కోసం బడ్జెట్ రూపొందించినట్లుగా ఉందని తెలంగాణ తెలుగుదేశంపార్టీ దుయ్యబట్టింది. రెండు నెలల కోసం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో రాష్ట్రాల అవసరాలను విస్మరించి ఓటర్లను మా త్రమే మభ్యపెట్టే ప్రయత్నం చేశారని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. నోట్ల రద్దుతో ఎంత నష్టం జరిగిందో కేంద్ర ప్రభుత్వం కనీసం అంచనా వేయలేదని, కేవలం మోడీని పొగడడమే మంత్రులు, ఎంపీలకు ఒక కార్యక్రమంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. నోట్ల రద్దువల్ల వచ్చిన నష్టాలపై ఇంతవరకు ఒక సమీక్ష కూడా జరపలేదని, జీఎస్టీ శ్లాబులుగా విడదీసినప్పటికీ పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రావుల చెప్పారు. రైతులకు పంటసాయం చేస్తున్నామంటున్న కేంద్ర ప్రభుత్వంవద్ద రైతుల గణాంకాలు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. రైతు ఖాతాలోకే నేరుగా కేంద్రమే డబ్బులు జమ చేస్తామనడం ఫెడరల్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని రావుల అన్నారు.

విద్యారంగ కేటాయింపుల్లో నిరాశ


టీఎస్‌యుటీఎఫ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్నికల ముందు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019-20 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులు నిరాశపరిచాయని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం కేటాయింపులు జరపాలన్న డిమాండ్‌ను విస్మరిస్తూ గత కేటాయింపులను కూడా కుదించడం దారుణమని విమర్శించారు. గత బడ్జెట్‌లో విద్యారంగానికి 3.4 శాతం కేటాయించగా, తాజా బడ్జెట్‌లో 3.37 శాతానికి కుదించడం కేంద్రానికి విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో వారు తెలిపారు.

కృత్రిమ మేథ.. లక్ష డిజిటల్ గ్రామాలు

త్వరలో జాతీయ ఏఐ సెంటర్, పోర్టల్

బడ్జెట్ ప్రసంగంలో పీయూష్ గోయల్




న్యూఢిల్లీ : కొత్తతరం ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని ఆ రంగంలో దూసుకుపోతున్న భారత్‌లో మునుముందు కృత్రిమ మేథ సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వనుందని, అందుకోసం జాతీయ కృత్రిమ మేథాకేంద్రాన్ని ప్రారంభించనున్నామని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆయన తన ప్రసంగంలో ఈ విషయం వెల్లడించారు. దేశంలో ప్రతి ఒక్కరికి సాంకేతిక ఫలాలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. ప్రపంచంలో స్టార్టప్‌లు, డేటా, వాయిస్‌కాల్స్ రంగంలో భారత్ కేంద్రంగా మారిందని, రెండోస్థానంలో నిలించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఇటీవలికాలంలో అమలు చేస్తున్న డిజిటలైజేషన్ ఫలితాలను ఆసరాగా చేసుకుని 2030 నాటికి డిజిటల్ మౌలిక వసతులు, డిజిటల్ ఎకానమీ సృష్టించాలన్నది లక్ష్యమని ఆయన చెప్పారు. సాంకేతిక రంగంలో అద్భుత ఫలితాలు సాధిస్తున్న మన యువత లక్షల ఉద్యోగాల సృష్టించేదుకు స్టార్టప్‌లతో దూసుకుపోతున్నారని గుర్తు చేశారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ కృత్రిమ మేథా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకోసం ఏఐ (ఆర్టిఫీషిల్ ఇంటెలిజెన్స్) నేషనల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, దీనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనుసంధానం చేస్తామని, 9 అంశాలలో ఇది పనిచేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని ప్రకటించారు. ఏఐ జాతీయ పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నామని చెప్పారు. డేటా విశ్లేషణలో ఏఐ టెక్నాలజీ ఉపకరిస్తుందన్న ఆయన గడచిన ఐదేళ్లలో భారత్ మొబైల్ డేటా విశ్లేషణలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. భారత్‌లో నెలవారీ డేటా వినియోగం గడచిన ఐదేళ్లలో 50 రెట్లు పెరిగిందన్నారు. డేటా, వాయిస్‌కాల్స్ తక్కువ ధరకే భారత్‌లో అందుబాటులోకి వచ్చాయని ఆయన చెప్పారు. రక్షణ, మొబైల్, ఆటోమొబైల్స్, వైద్యరంగాల్లో ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ అభివృద్ధి సాధించిందని అన్నారు. మొబైల్ ఫోన్ల రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించామని, వేలాది ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఇప్పటికే దేశంలో 3 లక్షల సాధారణ సేవాకేంద్రాలు (సీఎస్‌సీ)లలో 12 లక్షల మంది పనిచేస్తూ డిజిటల్ సేవలు అందిస్తున్నారని, వచ్చే ఐదేళ్లలో ఆయా కేంద్రాల ద్వారా లక్ష గ్రామాలను డిజిటల్ విలేజెస్‌గా మార్చబోతున్నామని ఆయన ప్రకటించారు. ఉద్యోగాల కోసం ప్రభుత్వంపైనో, ప్రైవేటు సంస్థలపైనో నిరుద్యోగ యువత ఆధారపడే రోజులు పోయాయని, ఉద్యోగార్థులే ఉద్యోగాలు సృష్టించే రోజులొచ్చాయని ఆయన చెప్పారు. ఇప్పిటికే దేశం స్టార్టప్‌ల హబ్‌గా మారిందని, పెద్దఎత్తున ఉద్యోగాలు సృష్టిస్తోందని గోయల్ చెప్పారు.

గోయల్ ప్రస్థానం

అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కేంద్రమంత్రిగా పనిచేసిన వేద్‌ప్రకాశ్ గోయల్ కుమారుడే పీయూష్ గోయల్. 1964 జూన్ 13న గోయల్ జన్మించారు. ముంబయిలోని మతుంగాలో పాఠశాల విద్యను పూర్తిచేశారు. సీఏగా ఆల్‌ఇండియా రెండో ర్యాంక్ సాధించారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి భాజపాలో చేరారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా బోర్డుల్లో ప్రభుత్వ నామినీ సభ్యుడిగా పనిచేశారు.

- భాజపాలో అనేక కీలక పదవులు చేపట్టారు. 2016లో మహారాష్ట్ర నుంచి రాజ్య సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. విద్యుత్, బొగ్గు, గనుల శాఖలకు సహాయమంత్రిగా వ్యవహరించారు. 2017 సెప్టెంబరు 3న గోయల్ రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- పీయూష్ గోయల్ ఆర్థిక మంత్రిగా తాత్కాలిక బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గతేడాది మే నెలలో అరుణ్‌జైట్లీ కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. ఆ సమయంలో గోయల్‌కు ఆర్థికశాఖ బాధ్యతలు అప్పగించారు. 2018 మే నుంచి ఆగస్టు వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు.
- ఇటీవల జైట్లీ మరోసారి అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లారు. దీంతో గోయల్ మళ్లీ తాత్కాలిక ఆర్థికమంత్రి బాధ్యతలు చేపట్టారు.



బెంగుళూరు: భారత వాయసేనకు చెందిన మిరాజ్ 2000 విమానం కూలి ఇద్దరు పైలెట్లు దుర్మరణం

ప్రత్యేక హోదాపై పార్లమెంట్‌లో వైకాపా ఎంపీల నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంటులో ఆందోళనకు దిగారు. శుక్రవారం పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ధర్నా నిర్వహించారు. వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. విభజన చట్టం హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు.

ఏపీకి అన్యాయంలో చంద్రబాబు పాత్ర

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని వైసీపీ నేత విజయసాయి రెడ్డి అన్నారు. ఏపీకి నాలుగేళ్లుగా బడ్జెట్‌లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కనీసం ఈ బడ్జెట్‌లో కూడా ఏపీకి న్యాయం జరగలేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రస్తావన కూడా చేయలేదని వాపోయారు. విభజన చట్టం హామీలను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. ఏపీకి సంబంధించి ఏ విషయం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. గత నాలుగేళ్లుగా బీజేపీతో కేంద్రంలో అధికారం పంచుకున్న చంద్రబాబు ఏపీకి జరిగిన అన్యాయానికి కారకుడని ఆరోపించారు. ఏపీకి జరిగిన అన్యాయంలో చంద్రబాబు ప్రమేయం ఉందని ఆరోపించారు.

మా పనులే మాట్లాడాయి

అవకతవకలు లేకుండా సహజ వనరుల వేలం

అవినీతి రహిత పాలన అందించాం

న్యూఢిల్లీ: బొగ్గుతోపాటు ఇతర సహజ వనరులు, స్పెక్ట్రం వేలాన్ని తమ ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిందని తాత్కాలిక ఆర్థికశాఖమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తమకంటే తాము చేసిన పనులే గట్టిగా మాట్లాడాయని ఆయన వ్యాఖ్యానించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. కొత్త పారదర్శక విధానాలకు ఏర్పాటు చేశాం. అవినీతి రహిత పాలన అందించామని వివరించారు. 2015లో ఎన్‌డీఏ ప్రభుత్వం తొలిసారిగా బొగ్గును వేలం వేసింది. బొగ్గుగనుల ప్రత్యేక చట్టం 2015ను రూపొందించింది. ప్రత్యేక నిబంధనల ద్వారా ఇప్పటివరకూ 85 బొగ్గుగనులను వేలం వేసింది.

రైతు సాయం పథకంపై చంద్రన్న స్టాంపు వద్దు

జీవీఎల్ నరసింహారావు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పిఎం-కిసాన్ పథకానికి చంద్రన్న స్టాంపు వేయొద్దని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయన విజయ్ చౌక్‌లో విలేకరులతో మాట్లా డారు. నరేంద్రమోడీ ప్రభు ప్రకటించిన రైతు ఆదాయ పథ కాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఖాతాల్లో జమ చేసుకోవద్దని అన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలనుకుంటే అదనంగా ఇవ్వాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కేంద్ర పథకానికి చంద్రన్న స్టాంప్ వేయడం అలవాటైందని ఎద్దేవా చేశారు. అయితే రైతు ఆదాయ పథకానికి చంద్రన్న స్టాంపు వేయొద్దని విజ్ఞప్తి చేశారు.

ఇది ఎన్నికల స్టంట్

ఎంపీ సుబ్బిరామిరెడ్డి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓ ఎన్నికల స్టంట్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎంపీ సుబ్బిరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విజయ్ చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. తాత్కాలిక బడ్జెట్‌లో జనాకర్షక పథకాలను ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రైతుల ఆదాయ పథకం అమలు కావడం అసంభవమని అన్నారు.

ఎవడబ్బసొమ్ము? ఎందుకివ్వరు?

● రక్తం పొంగిపోతోంది... ● మీకు ఊడిగం చేయాలా? ● లేదంటే కేసులు పెడతారా? ● సిగ్గు లేకుండా మాట్లాడతారా? ● అసెంబ్లీలో బాబు ఆగ్రహం ● విష్ణుకుమార్ రాజుపై మండిపాటు

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు విషయంలో కేంద్రప్రభుత్వం వివక్షపూరిత తీరుపై' రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఉదయం జరిగిన ప్రత్యేక చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజుపై తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ఉదయం 9 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలుకు కేంద్రప్రభుత్వం అడుగడుగునా అడ్డుతగులు తోందని అధికారపార్టీ శాసనసభ్యులు వ్యాఖ్యానించారు. చర్చలో పాల్గొన్న విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 98శాతం హామీలను నెరవేర్చిందని, రాష్ట్రానికి చెప్పిన దానికంటే ఎక్కువే కేంద్ర ప్రభుత్వం చేసింది.. కేవలం మరో రెండు శాతం మాత్రమే బాకీ ఉంది. అధి కారపార్టీ అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు, తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించిన సమయంలో సభానాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలోకి ప్రవే శిస్తూ.. విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో నిప్పులు కురిపించారు. ..'సిగ్గులేకుండా మాట్లాడుతున్నావు, ఎవడబ్బసొమ్మని ఇవ్వరండీ.. రాష్ట్రంలో ఉన్న సామాన్యుడికి ఉన్న కనీస బాధ్యత కూడా లేకుండా సభలో మాట్లాడుతున్నారు.. ఈగడ్డపైన పుట్టిన మీకు చీము నెత్తురు.. అభిమానం ఉంటే పార్టీలకు అతీతంగా కేంద్రం తీరుపై నిరసన వ్యక్తం చెయ్యాలి.. మీకు ఊడిగం చెయ్యాలా? లేదంటూ కేసులు వేసి వేధింపులకు గురిచేస్తారా? ఇదే మీ బీజేపీ నినాదం.. దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను, విభజన బిల్లులో పొందుపర్చిన వాటినే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామే కానీ.. గొంతెమ్మ కోర్కెలు మేం కోరడం లేదే..? ఎందుకు మాపై ఈ వివక్ష..? రాష్ట్ర విభజన జరిగిన సమయంలో రోడ్డుమీదకి వచ్చి తమ నిరసనలు వ్యక్తం చేసింది ప్రజలు.. ఇప్పుడు హోదాకోసం పోరాటాన్ని చేస్తోంది కూడా ప్రజలే.. అప్పుడు మీరెక్కడున్నారు..? ఇప్పుడు మీరెక్కడ కూర్చొని కబుర్లు చెబుతున్నారు..? అంటూ చంద్రబాబు విష్ణుకుమార్‌రాజుపై మండిపడ్డారు. రక్తం పొంగి పోతోంది... ఎవరికి ఊడిగం చెయ్యాలి? రాష్ట్రం నష్టపోతే ఆవేదన ఉండదా? అని చంద్రబాబు ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత మీపైన లేదా? పక్కనున్న తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి చూడండి, గుజరాత్ వెళ్లిచూడండి ఎన్నెన్ని నిధులు ఇచ్చారో తెలుస్తోంది.. వాటిని ఒకసారి ఆంధ్రప్రదేశ్‌తో పోల్చి చూడాలి.. అప్పుడు మీకు వాస్తవాలు తెలుస్తాయి.. సర్ధార్‌పటేల్ విగ్రహానికి 3500 కోట్లా.. కొత్త రాష్ట్రానికి 1500 కోట్లా..? ఏమిటీ మీ లెక్కలు.. ఇక్కడ నుండి నేను పన్నులు కట్టడం లేదా? నా డబ్బును తిరిగి నాకు ఇవ్వమంటే మాపై నిందు వేస్తారా? అవాకులు చవాకులు పేల్తారా? ఎవరికోసం నిధులిస్తారు? హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, ఢిల్లీలో ఎన్ని సంస్థలు ఉన్నాయి..? ఎవరబ్బా సొమ్ము అనుకుంటున్నారు. వినేవాళ్లు ఉంటే మీ ఇష్టప్రకారం మాట్లాడతారు.. సాధారణ పౌరుడికి ఉన్న ఆసక్తి, ప్రజా ప్రతినిధిగా ఉండే అర్హత మీకు లేదు.. రక్తం పొంగిపోతోంది.. మీ ఇష్టప్రకారం తమాషాలు ఆడుతున్నారు.. కొత్త రాష్ట్రం ఏర్పడితే దానికి సహకరించాల్సిందిపోయి సిగ్గువదిలిపెట్టి మాట్లాడుతున్నారు. అంటూ తీవ్ర స్వరంతో బీజేపీ పక్షనేత విష్ణుకుమార్ రాజును నిండుసభలో నిలదీశారు. రాష్ట్రానికి పూర్తిగా న్యాయం జరిగేంత వరకూ వదిలిపెట్టం.. భాజాపా నేతలను తిరగనివ్వం.. అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఆనాడు సహకరించిన వెంకయ్యకు ప్రమోషనా..?

భారతీయ జనతాపార్టీలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏం అభివృద్ధి సాధించిందో చెప్పాలని విష్ణుకుమార్‌రాజును నిలదీసారు. దక్షిణాది నండి ప్రస్తుతం ఏ ఒక్కరైనా కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతల్లో ఉన్నారా? అంటూ ప్రశ్నించారు. అన్యాయం చేసింది కాక.. తిరిగి తమనే విమర్శిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దక్షిణాది నుండి కేంద్రమంత్రిగా వెంకయ్యనాయుడు ఉండేవారు.. వీళ్ల కోపంతో ఆయన్ను కూడా తీసుకువెళ్లి పక్కన పెట్టేశారు. అది పనిష్మెంటా? లేక ప్రమోషనా అనేది దేవునికే తెలియాలి. దేశంలో దక్షిణాది ఒక భాగం కాదా? కాంగ్రెస్ హయాంలో ఉత్తరాది వారు ప్రధానిగా ఉంటే దక్షిణాది వ్యక్తిని రాష్ట్రపతిని చేసేవారు. ఈశాన్య రాష్ట్రాలతో సహా సముచిత స్థానం ఇచ్చి గౌరవించేవారు.కర్నాటక నుండి ఉన్న అనంతకుమార్ మృతిచెందారు. ఒక్క సదానంద గౌడ మాత్రమే మిగిలారు. దక్షిణాదిలో ఎంతమంది మంత్రులకు ఎన్ని పోర్టుపోలియోలు ఇచ్చారో ఒక్కసారి గుర్తుచేసుకోండి.. మనోభావాలను ఎలా కాపాడాతారు? ఉపన్యాసాలు ఎలా ఇస్తారు? దక్షిణాదిలో ఖాతా తెరవలేదు, కానీ మీకు బలముందా? అశాస్త్రీయమైన విభజన జరిగింది. ఢిల్లీలో కేంద్రమంత్రుల ఇంటింటికీ తిరిగాను. ప్రధాని మోడీని ఎకక్కడికొస్తే అక్కడ కలిశాను.. న్యాయం చేస్తారనే తిరిగానను, నాకోసం తిరగలేదు. రాష్ట్రప్రయోజనాలకోసం ఎక్కడా రాజీపడలేదు. ఈనేలపై పుట్టిన ప్రతీఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరుతున్నా.."



గోయల్ బడ్జెట్‌లో ఎవరికి ఎంత?

ఎన్నికల వేళ... గురిచూసి వదలిన బడ్జెట్ అస్త్రం లక్ష్యాన్ని ఛేదించినట్లే కనిపిస్తోంది. శుక్రవారం లోక్‌సభలో ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో రైతులు, ఉద్యోగులు, మధ్య తరగతి, గ్రామీణులే లక్ష్యంగా అనేక వరాలు కురిపించారు. మొత్తంమ్మీద రాజకీయంగా, పథకాల పరంగా ఈ బడ్జెట్ ఎవరికి కలిసొస్తుంది, ఎవరికి కష్టం కలిగిస్తుందన్నది ఓ సారి చూద్దాం.



వీరికి లాభం..

రైతులు ..

రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన 75 వేల కోట్ల రైతు సహాయ పథకం వీరికి పెద్ద ఊరట. ఐదె కరాల లోపు భూమి ఉన్నరైతులకు ఏటా 6 వేల రూపాయల సాయం ఈ పథకం లక్ష్యం. దీని వల్ల 12 కోట్లమంది చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలన్నీ ఈ పథకం వల్ల లబ్ది పొందనున్నాయి. అలాంటి సంస్థల్లో శక్తి పంప్స్ ఇండియా, జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్, కేఎస్‌బీ, కిర్లోస్కర్ బ్రదర్స్, అవంతి ఫీడ్స్, వాటర్ బేస్, జేకే అగ్రి జెనిటిక్స్, పీఐ ఇండస్ట్రీస్ వంటివి ఉన్నాయి.

పన్ను చెల్లింపుదార్లు ..

ఏటా 5లక్షల లోపు ఆదాయం ఉన్నవారు ఇక ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేదు. ఒకవేళ పీఎఫ్, కొన్ని ఈక్విటీలలో పెట్టుబడులు పెడితే ఆ పరిమితి రూ.6.5 లక్షలుగా పరిగణించి పన్ను చెల్లించనక్కర లేదు. ఇలా లబ్ధి పొందేవారి సంఖ్య దాదాపు 3 కోట్లమంది ఉంటారని మంత్రి గోయల్ చెప్పినమాట.


గ్రామీణ భారతం ..

పశుసంవర్ధకశాఖ, మత్స్య పరిశ్రమ రంగాలలే కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు భారీగా పెంచడంతో పాటు వడ్డీతగ్గింపు పథకాలు అమలు చేస్తామని ప్రకటించింది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలు పెట్టాలనుకున్న చిన్న, మధ్యతరహా సంస్థలకు మేలు జరుగుతుంది. ఇది పల్లెల వికాసానికి తోడ్పడుతుంది. దీనివల్ల మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు లబ్ది పొంద నున్నాయి.

రియల్‌ఎస్టేట్..

బడ్జెట్‌లో సానుకూల నిర్ణయాలతో శుక్ర వారం స్టాక్ మార్కె ట్లు లాభాలు గడిం చాయి. కొత్తగా ఇళ్ల కొను గోలును ప్రోత్స హిం చేవిధంగా ప్రభుత్వం నిర్ణయా లున్నా యి. దేశం లో ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండా లన్నది ప్రభుత్వ లక్ష్యంగా గోయల్ పేర్కొన్నారు. రెండో ఇల్లు కొను గోలుకు రాయితీ లివ్వడం(కేపిటల్ గెయిన్స్), రెండో ఇంటి అద్దె ఆదా యంపై పన్ను రాయితీ ఇవ్వడం వంటివి రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిస్తాయి. అలాగే ఆటోమేకర్ రంగం కూడా లబ్ది పొందబోతోంది.

మోడీకి మేలు..



ఎవరూ ఊహించని విధంగా ఆదాయపుపన్ను పరిమితి పెంచడం, వ్యవసాయంపై ఆధార పడినవరికి సాయం ప్రకటించడం, కార్మిక వర్గాలకు పెన్షన్ పథకం వర్తింప చేయడం వంటి నిర్ణయాలు రాజకీయంగా ప్రధానిమోడీకి కలసి రానున్నాయి. మేలో ఎన్నికల నేపథ్యంలో జనాకర్షక బడ్జెట్ ఆయనకు రాజకీయంగా మేలు చేయనున్నదని భావిస్తున్నారు. ప్రజాదరణ పెంచడానికి ఈ బడ్జెట్ ఎంతగానో ఆయనకు ఉపకరిస్తుంది.

కార్మికవర్గం ..

గోయల్ బడ్జెట్‌లో ప్రకటించిన మెగా పెన్షన్ ప్లాన్‌తో వీరికి ఎనలేని లబ్ది కలగబోతోంది.60 ఏళ్లలోపు అసంఘటిత కార్మికులు నెలకు వంద రూపాయల చొపన చందా కడితే నెలకు 3వేల చొప్పున పెన్షన్ ఇవ్వడం ఈ పథకం ఉద్దేశం. దేశంలోని పరిశ్రమలు, చిన్నపాటి సంస్థల్లో పనిచేస్తున్న 10 కోట్లమంది అసంఘటిత కార్మికులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది.



వీరికి నష్టం

విపక్షాలు ..

గోయల్ బడ్జెట్‌లోని ప్రత్యేకపథకాలు, కీలకప్రకటనలు అమలవుతాయా లేదా అన్నది పక్కనబెడితే విపక్షాలకు మాత్రం రాజకీయంగా ఏమాత్రం ఉపయోగపడవు. పైపెచ్చు నష్టాన్ని కలిగించే అవకాశమే ఎక్కువ. రైతులు, మధ్యతరగతి, కార్మికవర్గాలకు ఈ బడ్జెట్ ఎంతో కొంత ఉపశమనం కలిగించనుంది. మేలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో కేంద్రం పలు పథకాలు ప్రకటించింది. విపక్షాలు ఇంతకన్నా మెరుగైన పథకాలు ప్రకటించినా ఎంతవరకు జనం విశ్వసిస్తారన్నది ప్రశ్న. కేవలం ఎన్నికల ప్రణాళికలనే నమ్ముకున్న విపక్షాలకు జనం ఓట్లేస్తారా అన్నది చూడాలి.

భూమిలేని కార్మికులు..

గ్రామీణ ప్రాంతాల్లో ఏ పంటభూములూ లేని పేద కార్మికులకు ఈ బడ్జెట్ ఏమీ ప్రయోజనం కల్పించడం లేదు. నిజానికి మిగతా రైతులు, కార్మికులతో పోలిస్తే వీరు నిరుపేదలే.

బాండ్ హోల్డర్స్..

ఆర్థిక విశ్లేషణ సంస్థ మూడీస్ , ఎస్ అండ్ పీ రేటింగ్ తగ్గిస్తూ ఇచ్చిన నివేదికల నేపథ్యంలో ప్రభుత్వ బాండ్ హోల్డర్లకు నష్టం జరగనుంది. ద్రవ్యలోటు విషయంలో వరుసగా రెం డో ఏడాది కూడా కేంద్రప్రభుత్వం విఫల మైనట్ల యింది. ఈసారి ఆర్థికలోటు 3.4 శాతంగా పేర్కొనడంతో వీరికి నష్టం తప్పదు.

రక్షణరంగం ..



ఈ ఏడాది రక్షణరంగానికి 3.05 లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి కే టాం ుం పుల స్వల్పంగా పెరిగినప్పటికీ ఎక్కువ పాత అప్పులు, ఖర్చులు తీర్చడానికే సరిపోతుంది. ముఖ్యంగా ఆయుధాల కొనుగోలుకు కేటా యించిన నిధులు ఇలాఎరిగిన ధరలతో కరిగిపోనున్నాయి.



దేశ సమగ్రతే లక్ష్యం

దేశ సమగ్ర అభివృద్దే ప్రధాని మోడీ లక్ష్యం. ఎన్నికల తరువాత రూ.5లక్షల పన్ను పరిధిని పెంచేందుకు యోచిస్తున్నాం. ప్రతి వర్గానికి మేలు కలగాలనేది తమ ఆశయం. మళ్లీ మోడీ ప్రభుత్వమే అధికారం లోకి వస్తుంది. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. చిన్న వ్యాపా రులకు ఊరట ఇవ్వాలని అనుకున్నాం. అదేవిధంగా రైతులను ఆదు కోవాలని భావించాం. అందుకే 5 ఎకరాల్లోపు భూమి ఉన్న వారికి ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించాం. డిసెంబర్, 2018 నుంచి అర్హులైన రైతులకు అందజేస్తాం. 60 ఏళ్లు పైబడిన అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ అందజేస్తున్నా. నెలకు రూ.100 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

రైతులకు ఒరిగేదేమీ లేదు




బడ్జెట్ దేశానికి ఏవిధంగా కూడా ఉపయోగపడదు. ఇది వ్యతిరేకం. అదేవిధంగా రైతులకు ఏడాదికి రూ.6వేలు ఇవ్వడంతో ఒరిగేదేమీ లేదు. జుమ్లేబాజీగా ఉంది. గతేడాది బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా ఇలాగే ఉంది. చెప్పినవి ఏవీ చేయలేదు. జుమ్లేబాజీ దేశ తలరాతను మార్చలేదు. పేదరికం, నిరుద్యోగం వంటి దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించేలా బడ్జెట్ ఉండాలి. అలాంటివి ఏవీ కూడా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదు.

మా పథకాలే కాపీ కొట్టారు



మా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలనే కేంద్ర ప్రభు త్వం కాపీ కొట్టింది. ఇది విలువల్లేని బడ్జెట్. ఎన్‌డీఏ పాలన అంతం అవుతుంది అనడానికి ఈ బడ్జెటే నిదర్శనం. ఈ పథ కాలను ఎవరు కొనసాగిస్తారు..? వచ్చే ప్రభు త్వమా..? ఎన్నికల కమిషన్ ఈ బడ్జెట్‌ను పరిగణలోకి తీసుకోవద్దు. ఎన్నికల ముందు ప్రవే శపెట్టిన ఈ బడ్జెట్‌కు ఎలాంటి విలువ ఉండదు. ఇటువంటి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి బీజేపీకి నైతిక హక్కు లేదు. గత నాలుగేళ్ల కాలంలో రైతుల కోసం ఎందుకీ పథకం తీసుకు రాలేదు..? ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోడీ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రైతులకు అందజేస్తా మంటున్న రూ.6వేల సాయం మాకు వద్దు. మేం తీసుకోం.

ఆర్ఎస్ఎస్ తయారు చేసిందా?



లోక్‌సభలో ఎన్‌డీఏ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక మంత్రిత్వ శాఖ తయారు చేసిందా..? రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తయారు చేసిందా..? ఇది ఒక ఎన్నికల బడ్జెట్ అనేది స్పష్టం అవుతోంది. దీన్ని అంతగా సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. వచ్చేది కొత్త ప్రభుత్వం కావున మళ్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుంది. పన్ను చెల్లింపు అనేది రూ.5లక్షలకు పెంచుతారు అనేది ముందే తెలుసు. ఇందులో కొత్తేమీ లేదు. రైతు నాడి పట్టుకోలేకపోయారు.

ఇది బ్యాలెన్స్‌డ్ బడ్జెట్




అన్ని వర్గాల ప్రజలు, అన్ని రంగాలను సమాన దృష్టితో చూసి నిధులు కేటాయించడాన్ని బట్టి చూస్తే ఇది బ్యాలెన్స్‌డ్ బడ్జెట్. భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఇది ఎంతో తోడ్పతుంది. రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలు, యువకులు ఈ బడ్జెట్‌తో ఎంతో లబ్ది పొందుతారు. ప్రధాని మోడీకి, బడ్జెట్ ప్రవేశపెట్టిన పియూష్ గోయల్‌కు నా ధన్యవాదాలు. అరుణ్ జైట్లీ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

ప్రజామోదం పొందిన బడ్జెట్




ఇదే ప్రజలకు అవసరమైన బడ్జెట్. ప్రజలు, పురోగతి, శ్రేయస్సు అనే మూడు ముఖ్యమైన అంశాలపై బడ్జెట్ కొనసాగింది. ప్రజామోదం పొందిన బడ్జెట్ ఎంతో బాగుంది. 2022లో నవ భారత్ నిర్మాణం కోసం ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే అవకాశం ఈ బడ్జెట్‌తో దక్కింది. పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపొందించడం జరిగింది.

ఇది రెండో సర్జికల్ స్ట్రైక్



ప్రతిపక్షాలపై మోడీ ప్రభుత్వం బడ్జెట్ ద్వారా రెండో సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది. మొదటి సర్జికల్ స్ట్రైక్ ఆర్మీ జవాన్లు బుల్లెట్‌ల ద్వారా సరిహద్దు దాటి ముష్కరులను అంతం చేస్తే మోడీ బడ్జెట్‌తో సమాధానం చెప్పారు. ఈ బడ్జెట్‌తో రైతులు ఎంతో లబ్ది పొందారు. మోడీ మెరుపు దాడిగా భావించి ఇప్పటికైనా ప్రతిపక్షాలు బడ్జెట్‌ను స్వాగతించాలి. ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకున్నారు



లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. గత నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన తప్పులన్నీ కప్పి పుచ్చుకునేందుకు ఈ తరహా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ బడ్జెట్‌తో దేశం ఏ మాత్రం అభివృద్ధి చెందదు. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల సృష్టి గురించి ఎలాంటి హామీలు ఇవ్వలేదు.

రైతులకు ఎంతో ఉపయోగకరం



బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గోయల్ చారిత్రాత్మక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు. మెరుగైన జీవితం అందించేందుకు ఈ బడ్జెట్ ఎంతో తోడ్పడుతుంది. నవ భారత నిర్మాణం కోసం ఎంతో దోహదపడుతుంది.


బడ్జెట్ లీక్ అయ్యింది



పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టక ముందే కొన్ని ముఖ్యమైన అంశాలు లీక్ అయ్యాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వ వర్గాలే మీడియాకు సమాచారం అందించాయి. వీటికి సంబంధించిన ఫొటోలు కూడా విడుదల చేశాను. ప్రవేశపెట్టక ముందు చెప్పిన అంశాలే అధికారికంగా వివరించిన తరువాత గమనించొచ్చు. బడ్జెట్‌ను లీక్ చేయడం తీవ్రంగా పరిగణించాలి. రహస్య విషయాల ఉల్లంఘన కిందికి వస్తుంది.

జోష్ ఎలా ఉంది!

- యురీ డైలాగ్‌తో ఉత్సాహం నింపిన పీయూష్ గోయల్
- ఆదాయపన్ను పరిమితి పెంపు ప్రకటనలో ఉత్కంఠ
- ప్రకటన అనంతరం మోడీ సహా సభ్యుల హర్షధ్వానాలు
- చిరునవ్వులు.. ఉత్సాహం.. మోడీ మోడీ నినాదాలతో హోరెత్తిన లోక్‌సభ
- తొలి బడ్జెట్‌లో గోయల్ తనదైన ముద్ర.. భుజంతట్టి ప్రశంసించిన మోడీ



న్యూఢిల్లీ: అర్థంకాని పదాలు, కేటాయింపుల గందర గోళాలపై ఎవరికీ పెద్దగా ఆసక్తి ఉండదు. సుదీర్ఘంగా సాగే బడ్జెట్ ప్రసంగం అందరినీ ఆకట్టుకోవాలంటే కత్తిమీద సామే. కానీ ఈ విషయంలో గోయల్ ఊహించని వరాలు ప్రకటించి నవ్వులు పూయిం చారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వైద్యచికిత్స కోసం అమెరికా వెళ్లడంతో ఈసారి బడ్జెట్ బాధ్యత పీయూష్ గోయల్‌కు ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాది బడ్జెట్ రూపకల్పనలో పీయూష్ సహమంత్రిగా భాగస్వామి అయిన ప్పటికీ, బడ్జెట్ సమర్పించే అవకాశం రాలేదు. కానీ ఈసారి జైట్లీ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదించి... ప్రసంగించారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఎదుర్కోవలసి ఉండటం, మళ్లీ అధికారం లోకి రావాలన్న ఎన్డీఏ ఆశల నేపథ్యంలో రూపొందించిన బడ్జెట్ సమర్పణలో ఎంత జోష్ ఉండాలో పసిగట్టి.. పనిచేయడంలో గోయల్ సక్సెస్ అయ్యారు.

గ్రే జాకెట్, నల్లని కుర్తా ధరించి, బడ్జెట్ ప్రతి ఉన్న సూట్‌కేసుతో ఠీవిగా లోక్‌సభలోకి అడుగుపెట్టిన గోయల్, బడ్జెట్ ప్రసంగం మొదలుపెట్టినప్పుడు కాస్త అసౌకర్యం గానే ఉన్నప్పటికీ రానురాను తనదైన శైలిలో... సాధికారికంగా.. చివరకు ఉరకలెత్తే ఉత్సాహంతో బడ్జెట్ ప్రసంగం పూర్తి చేశారు. బడ్జెట్ స్పీచ్ ఇంగ్లీష్‌లో ముందుగానే సిద్ధం చేస్తారు. దానిని చూసి ఇంగ్లీష్‌లో ప్రసంగం ప్రారంభించిన ఆయన ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ బడ్జెట్‌లో విశేషాలను వల్లెవేశారు. ఐదెకరాల లోపు పంట భూములున్న రైతులకు ఏటా ఆరువేల రూపాయల సహాయం నేరుగా వారి అకౌంట్లలో వేస్తామన్న తాజా పథకాన్ని ప్రకటిం చిన క్షణం నుంచి మంత్రి పీయూష్ స్వరంలో ఉత్సాహం ఉరకలెత్తింది. అప్పటివరకు ఆంగ్లంలో మాట్లాడిన పీయూష్ అలవోకగా హిందీలో మాట్లాడటం మొదలుపెట్టారు. ఇంగ్లీష్ లోనే మాట్లాడినప్పటికీ కీలక అంశాలను హిందీలో వివరించి సభ్యుల మన్ననలు పొందారు.

యురీ డైలాగ్‌తో ఉత్సాహం

తన బడ్జెట్ ప్రసంగంలో వివిధ అంశాలను ప్రకటిస్తూ వచ్చిన మంత్రి గోయల్ బాలీవుడ్ అంశాలను స్పృశించారు. సినిమా షూటింగ్‌లకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను మరింత సరళతరం చేశామని చెప్పిన గోయల్ సర్జికల్ స్ట్రైక్స్ నేపథ్యంలో నిర్మించిన యురీ సినిమా ప్రస్తావన చేయడంతో లోక్‌సభలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇటీవలే తాను ఆ చిత్రాన్ని చూశానని, అది ఎంతో శక్తినిచ్చిందని చెప్పారు 'ఈ మధ్య యురీ సినిమా చూసే సౌభాగ్యం దక్కింది. ఎంతో ఫన్ ఉంది.

> "దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు వనరులపై పూర్తి స్థాయి హక్కులు కలిగి ఉంటారు. గ్రామీణ వ్యవస్థను కాపాడుతూ ముందుకు వెళ్తున్నాం. అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలిపే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతోంది. స్వచ్ఛభారత్ మిషన్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఎంతో విజయవంతం కూడా అయ్యింది. గ్రామీణ భారతదేశంలో 98 శాతం మరుగుదొడ్లు నిర్మించాం. 5.4 లక్షల గ్రామాల్లో బహిరంగ మల, మూత్ర విసర్జనలు నిరోధించబడ్డాయి."
>
> **పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి గోయల్**

ఎంతో మజా వచ్చింది. ఎంతో శక్తినిచ్చింది' అని అన్నారు. చాలా జోష్...వచ్చిందని అంటూ ప్రసంగించడంతో సభలో అధికారపక్ష సభ్యులు ఉత్సాహంగా బల్లలు చరిచారు. చివరకు ప్రధాని మోడీ కూడా చిరునవ్వులు చిందిస్తూ బల్లపై చేతితో కొట్టారు. మరో మంత్రి రవిశంకర్ ప్రసాద్ కల్పించుకుంటూ జోష్ ఎలా ఉందంటూ నినదించారు. ఆ సమయంలో తృణమూల్ సహా మరికొన్ని విపక్ష పార్టీల సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ విమర్శలు కురిపించినా ఎవరూ పట్టించుకోలేదు. ఆ సినిమాలోని జోష్ అన్న పదాన్ని గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో రెండుసార్లు ప్రస్తావించారు. ఈ సందర్భంలో విపక్షాల అభ్యంతారలను ఆక్షేపిస్తూ.. గతంలో ప్రధాని చేసిన రామ్‌లీలా విమర్శ గుర్తొస్తోందని అన్నారు. గతంలో రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి గట్టిగా మాట్లాడి, నవ్వడాన్ని తప్పుబట్టిన ప్రధాని మోడీ... రామ్‌లీల మైదానంలో మాట్లాడినట్లు ఇక్కడ మాట్లాడ కూడదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఆదాయపు పన్ను ప్రకటనలో...

దేశంలో ఎక్కువమంది ఎదురు చూసే ఆదాయ పన్ను పరిమితి పెంపు అంశాన్ని ప్రకటించడంలో ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ నేర్పు ప్రదర్శించారు. తన ప్రసంగంలో మొదట ఆదాయపు పన్ను వసూళ్ల గురించి ప్రస్తావించిన గోయల్ మొదట పరిమితి పెంపు అంశాన్ని ప్రస్తావించకుండా మిగతా అంశాల్లోకి వెళ్లిపోయారు. ఇక ఈ అంశంపై ప్రకటన ఏదీ ఉండదన్న ధోరణిలో ఆయన ప్రసంగం కొనసాగించారు. మరికొద్దిసేపటిలో ప్రసంగం ముగుస్తుందనగా ఉన్నట్టుండి ఆదాయపు పన్ను వార్షిక పరిమితిని రెట్టింపు చేస్తూ 5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించడంతో లోక్‌సభ ఉత్సాహంతో ఊగిపోయింది. దాదాపు రెండు నిమిషాలపాటు ప్రధాని మోడీసహా సభ్యులు బల్లలు చరుస్తూనే ఉన్నారు. మోడీ... మోడీ అంటూ సభ్యుల నినాదాలు హోరెత్తిపోయాయి. ఆసమయంలో ప్రసంగాన్ని కొనసాగించిన గోయల్ ఇంకా ఉందంటూ... మరికొన్ని రాయితీలను ప్రకటించారు.

వినమ్రత.. అభినందన... ఆనందం

లోక్‌సభలో బడ్జెట్ సమావేశం ప్రారంభానికి ఆరేడు నిమిషాలముందే చేరుకున్న ఇంటీరియమ్ ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ మొదట బీజేపీ సీనియర్ సభ్యులు, మంత్రులు నితిన్ గడ్కరీ, ఉమాభారతి, శాంతకుమార్ పాదాలను తాకి నమస్కరించారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఈ సమావేశంలో లేకపోవడంపట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించిన గోయల్ తరువాత ప్రసంగం కొనసాగించారు. యురీ సినిమా ప్రస్తావన, ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంపు ప్రకటన, రైతులకు రాయితీల అంశాలను ప్రస్తావించిన సమయంలో లోక్‌సభలో సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ బల్లలు చరిచి ప్రోత్సహించినపుడు... గోయల్ ప్రధాని నరేంద్రమోడీ వైపు ముకుళిత హస్తాలతో చూశారు. పసు సందర్భాలలో బల్లపై పదేపదే చరచి ఆనందం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ చిరుదరహాసం చిందిస్తూ గోయల్ వద్దకు వెళ్లి భుజం తట్టి అభినందించారు.

బడ్జెట్ ప్రసంగం పూర్తయిన వెంటనే పలువురు సభ్యులు గోయల్ దగ్గరకు వచ్చి ప్రశంసలలో ముంచెత్తారు. విజిటర్స్ గేలరీలో నిలుచుని తనవైపే చూస్తున్న తన సతీమణి సీమా గోయల్ సహా కుటుంబ సభ్యులను చూసి చేతులు ఊపుతూ పలకరించిన గోయల్‌కు వారు బొటనవేలు పైకెత్తి విజయసంకేతం చూపిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. మొత్తంమీద ఎన్నికల సంవత్సరంలో... తన మొదటి బడ్జెట్‌లో గోయల్ తొలి గోల్ గురి చూసి కొట్టడంలో విజయం సాధించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చిన స్పందనే అందుకు ఉదాహరణ.

బడ్జెట్ హైలైట్స్

- 12 కోట్ల మంది రైతులకు లబ్ది కలిగించేలా సరికొత్త సంక్షేమ పథకం.
- ఏడాదికి రూ. 6 వేలను పంటసాయం 2018 డిసెంబర్ నుంచే అమలు.
- కిసాన్ క్రెడిట్ కార్డులపై 2 శాతం వడ్డీ రాయితీ
- ఆదాయపు పన్ను పరిమితి రూ.2.5 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంపు
- సెక్షన్ 80సీ పరిమితి రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షలకు పెంపు
- పోస్టల్, బ్యాంకు డిపాజిట్లపై టీడీఎస్ పరిమితి పెంపు
- టీడీఎస్ పరిమితి రూ. 10 వేల నుంచి రూ. 40 వేలకు పెంపు
- స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి రూ. 40 వేల నుంచి రూ. 50 వేలకు పెంపు
- ఇంటి అద్దెలపై టీడీఎస్ రూ. 180 లక్షల నుంచి రూ. 2.40 లక్షలకు పెంపు
- గోకుల్ మిషన్ కు రూ. 750 కోట్ల కేటాయింపులు
- గో ఉత్పాదకతను పెంచడం కోసం సరికొత్త 'రాష్ట్రీయ కామ్ ధేన్ ఆయోగ్'
- పెన్షన్ విధానానికి మార్పులు. ప్రభుత్వ వాటా 14 శాతానికి పెంపు
- ఈఎస్ఐ పరిధి రూ. 15 వేల నుంచి రూ. 21 వేలకు పెంపు
- ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ ధన్ పేరిట మరో సరికొత్త స్కీమ్
- నెలకు రూ. 100 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత రూ. 3వేల పెన్షన్
- కొత్త పెన్షన్ విధానానికి రూ. 500 కోట్లు కేటాయింపు
- 10 కోట్ల మంది కార్మికులకు పెన్షన్‌స్కీమ్‌తో లాభం
- గ్రాట్యుటీ లిమిట్ రూ. 10 లక్షల నుంచి రూ. 30 లక్షలకు పెంపు
- రక్షణ రంగానికి రూ. 3 లక్షల కోట్ల కేటాయింపు
- కార్మికుల ప్రమాద బీమా రూ. 1.50 లక్షల నుంచి రూ. 6 లక్షలకు పెంపు
- వన్ ర్యాంక్ - వన్ పెన్షన్ కోసం రూ. 35 వేల కోట్లు
- కేంద్రస్థాయిలో ప్రత్యేక మత్స్యశాఖ ఏర్పాటు
- పశు సంవర్ధక, మత్స్య పరిశ్రమలకు 2 శాతం వడ్డీ రాయితీ
- రైల్వేలకు బడ్జెటరీ సపోర్ట్ కింద రూ. 64,587 కోట్లు
- మిజోరం, మేఘాలయా రాష్ట్రాలను రైల్వేతో అనుసంధానం
- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి రూ. 15,166 కోట్ల కేటాయింపు
- సినిమా పరిశ్రమ 18శాతం నుంచి 12 శాతం జీఎస్టీ పరిధిలోకి
- సినిమా షూటింగ్ అనుమతులకు సింగిల్ విండో
- ఇన్ లాండ్ వాటర్ వేస్ కు పెద్దపీట
- శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు మరిన్ని కేటాయింపులు
- డిజిటల్ ఇండియా కలను సాకారం చేసి చూపిస్తాం

సీబీఐకి కోటి కట్




న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తాయిలాలకు పెద్దపీట వేస్తూ.. ఆయా రంగాలకు నిధుల కేటాయింపుల్లో కోతలు విధించింది. దేశంలోని అత్యున్నత దర్యాప్తుసంస్థ సీబీఐ కూడా ఇందులో ఉండటం గమనార్హం. సీబీఐకి గతేడాది బడ్జెట్‌లో రూ.778.93 కోట్లు కేటాయించగా.. మధ్యంతర బడ్జెట్‌లో రూ.777.27 కోట్లు కేటా యించారు. 2017-18 సంవత్సరంలో సీబీఐకి రూ.698.38 కోట్ల కేటా యింపులు చేయగా.. 2018-19 సంవత్సరంలో 778.93 కోట్లు(2.79 శాతం అధికం) కేటాయించారు. అగస్టావెస్ట్‌లాండ్ నుంచి పోంజీ స్కాం, అక్రమ మైనింగ్, మణిపూర్‌లో ఫేక్ ఎన్‌కౌంటర్లుతో పాటు హై ప్రొఫైల్ ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, జతిన్ మెహతా, మెహుల్ చోక్సీ లాంటి వారి కేసులను కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. నేరారోపణ కేసుల పరిష్కారానికి భారీగా సిబ్బంది అవసరమున్న నేపథ్యంలో సీబీఐకి గతేడాది నుంచి కేటాయింపులు పెంచుతున్నా.. ఈ సారి మాత్రం కోత పడింది.

నిరుద్యోగుల ఊసేదీ..?




న్యూఢిల్లీ: ఎన్నికల వేళ పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో దేశంలో ప్రధానమైన సమస్యలను సైతం పక్కన బెట్టారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మన దేశంలో నిరుద్యోగ సమస్య 6.1 శాతం ఉండగా.. 2019లో ఇది 8 శాతానికి ఎగ బాక వచ్చని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బడ్జెట్‌లో పేర్కొనకపోవడం గమనార్హం. ప్రతీ ఏడాది 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని 2014 ఎన్నికల సమయంలో మోడీ హామీ ఇవ్వడంతో దాదాపు 15 కోట్ల మందికి పైగా యువత బీజేపీ వైపు నిలిచారు. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 13 కోట్ల మంది యువత ఓటెయ్యబోతున్నారు. ఇలాంటి తరుణంలో మోడీ సర్కారు నిరుద్యోగుల ఆశలు, ఆకాంక్షలను పక్కనబెట్టిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం మన దేశంలో గ్రామాల్లో కంటే పట్టణాల్లోనే నిరుద్యోగం అధికంగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. వీరిలో పురుష నిరుద్యోగులు 18.7 శాతం కాగా.. మహిళా నిరుద్యోగులు 27.2 శాతంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగుల ఓటు కూడా కీలకం కావచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

లోక్‌పాల్ బడ్జెట్ యథాతథం



న్యూఢిల్లీ: 2019-20 ఆర్థిక సంవత్సరానికి గానూ లోక్‌పాల్‌కు కేవలం రూ. 4.29 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం 2018- 19లో కూడా రూ. 4.29 కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే. అవినీతిని నిర్మూలన లక్ష్యంగా లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013ను రూపొందించారు. రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలను విచారించడానికి కేంద్ర స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్తను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ. 35.5 కోట్లను కేటాయించారు. 2018-19 సంవత్సరంలో కేటాయించిన రూ. 34 కోట్లను స్వల్ప మొత్తంలో పెంచారు. ఈ బడ్జెట్ ద్వారా సీవీసీ కార్యాలయం ఖర్చులను సమకూర్చుకోనుంది.



మోడీ రైతు బంధు..

పథకం పేరు	పీఎం కిసాన్ సమ్మాన్ నిధి
ఎంత సాయం	: ఏడాదికి రూ.6వేలు
ఎలా	: మూడు విడతల్లో(ఒక్కో విడత రూ.2 వేలు)
ఎవరు అర్హులు	: 5 ఎకరాల్లోపు చిన్న రైతులు
ఎప్పటి నుంచి	: డిసెంబర్ 1,2018
ఎంతమందికి లబ్ధి	: 12 కోట్ల రైతు కుటుంబాలు
కేటాయించే నిధులు	: రూ.75 వేల కోట్లు
లక్ష్యం	: 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

ఒక్కో రైతుకు ఏడాదికి రూ. 6వేల సాయం



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు భారీగా తాయిలాలు ప్రకటించింది. చిన్న, సన్నకారు రైతులకు లబ్ది జరిగేలా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని అమలు చేయబోతోంది. ఈ పథకం కింద 5 ఎకరాల లోపు వ్యవసాయం చేసే రైతులకు ఏడాదికి రూ.6,000 చెల్లిస్తారు. ఈ మొత్తం సొమ్మును ఒకేసారి కాకుండా మూడు వాయిదాల్లో (ప్రతీ వాయిదాలో రూ.2000) రైతు ఖాతాలో జమచేస్తారు. తొలి విడత వాయిదా డిసెంబర్ 1 నుంచి మార్చి 31 కాలానికి రూ.2 వేలు త్వరలోనే రైతుల ఖాతాల్లో జమచేస్తారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దేశంలోని 12 కోట్ల మంది చిన్న రైతులకు లబ్ది చేకూరుతుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.75,000 కోట్లను కేటాయించింది. తెలంగాణలో అమలౌతున్న రైతుబంధు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల కోసం ఒడిశాలో అమలౌతున్న కలియా(కృషిక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కం అడ్‌మెంటేషన్) పథకాలను పరిశీలించిన తర్వాత ప్రధానమంత్రి కిసాన్‌సమ్మాన్ నిధిని ప్రకటించారు.

మూడు వాయిదాల్లో నేరుగా ఖాతాల్లోకి...

మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులకు అందించే నగదు సాయం ఎకరం చొప్పున కాదు.. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.6 వేలు అని నిపుణులు స్పష్టంచశారు. 2 హెక్టార్లు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగిన రైతులు (హెక్టార్‌కు 2.47 ఎకరాల) ఒక యూనిట్‌కు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎకరాను యూనిట్‌గా తీసుకుని రైతుబంధును అమలు చేస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం రైతును యూనిట్‌గా తీసుకుని కిసాన్ సమ్మాన్ నిధిని అమలు చేయబోతోంది. ఈ లెక్కన 5 ఎకరాల భూమి కలిగిన రైతు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏడాది రూ. 50 వేల ఆర్థిక సాయం పొందితే.. కేంద్రం నుంచి రూ.6 వేల మాత్రమే అందుకుంటాడని నిపుణులు తెలియజేశారు.

ఏంటీ పథకం...?

పంట సాగుకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అప్పులు చేయకుండా రైతులకు అందించే నగదు సాయం. పంట వేసే ముందు పెట్టుబడి కోసం అన్నదాత వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం ఇచ్చే చేయూత. రెండు లేదా అంతకంటే తక్కువ హెక్టార్ల(5 ఎకరాలు) సాగు చేసే రైతులను ఆర్థికంగా ఆదుకోవడం పథకం ఉద్దేశం.

రోడ్ల నిర్మాణానికి రూ.19 వేల కోట్లు



ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యాలు కల్పిస్తాం. గ్రామీణ, పట్టణ మధ్య అంతరాల తొలగింపుచేందుకు కృషి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ సడక్‌యోజనలో భాగంగా రహదారుల నిర్మాణం మూడు రెట్లు పెరిగింది. ప్రధాన మంత్రి సడక్ యోజనకు రూ.19,000 కోట్లు కేటాయించడం జరిగింది. ఇప్పటి వరకు రూ.3000 కోట్ల పేదల ధనం ఆదా అయ్యింది. 2014కు ముందు బస్సు సౌకర్యం లేని అన్ని గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగుపరిచాం. రోజుకు 27 కిలో మీటర్ల రహదారిని నిర్మిస్తున్నాం. ప్రపంచంలో అత్యంత వేగంగా రహదారులు నిర్మిస్తున్న దేశంగా భారత్ నిలిచింది. 2.5 కోట్ల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లలో విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది. పేద, మధ్య తరగతి ప్రజల కోసం 143 కోట్ల ఎల్ఈడీ బల్బులను అందజేశాం. ఎల్ఈడీ బల్బుల కారణంగా విద్యుత్ బిల్లు సుమారు ఏడాదికి రూ.50వేల కోట్లు ఆదా అవుతోంది. ప్రపంచంలో అత్యధిక జాతీయ రహదారులు కలిగిన దేశం భారత్. ఈశాన్య రాష్ట్రాలతో కనెక్టివిటీ పెంచడం జరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.15,500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు.

'ఉపాధి'కి రూ. 60 వేల కోట్లు



మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి(ఎంజీఎన్ ఆర్ఈజీఏ) 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ. 60 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గతేడాది నిధుల కంటే 11 శాతం అధిక నిధులను కేటాయించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏకు రూ. 60 వేల కోట్లు అంచనా వేస్తున్నామని గోయల్ తెలిపారు. అవసరమైతే ఈ పథకానికి మరిన్ని నిధులు కేటాయించనున్నామని ఆయన వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ రూ. 55 వేల కోట్లు కేటాయించారు. అనంతరం బడ్జెట్‌ను సవరించారు. మొత్తం రూ. 61,084 కోట్లను కేటాయించారు.

గోకుల్ మిషన్‌కు రూ.750 కోట్లు



దేశవ్యాప్తంగా గోసంపదను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. గోకుల్ మిషన్ పేరుతో అమలులోకి రానున్న ఈ ప్రత్యేక పథకానికి రూ. 750కోట్లు కేటాయించారు. గోఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా రాష్ట్రీయ కామధేను ఆయోగ్ ఏర్పాటు చేయనున్నారు. ఉత్తమ జాతి ఆవుల ఉత్పత్తికి కృషి జరుగుతుందని గోయల్ తెలిపారు. ఆవుల సంక్షేమాన్ని రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ పర్యవేక్షించనుంది.

5 లక్షల వరకు ఫ్రీ

ఆదాయ పన్ను పరిమితి రెట్టింపు



న్యూఢిల్లీ : ఎట్టకేలకు వేతన జీవులకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మోడీ సర్కార్ ఊరటనిచ్చింది. దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పన్ను రాయితీ ఇవ్వడం ద్వారా మధ్య తరగతి వర్గాన్ని సంతోషపెట్టింది. ప్రస్తుతం ఉన్న ఆదాయపన్ను పరిమితిని రెట్టింపు చేసింది. వ్యక్తిగతంగా 5 లక్షలు ఆర్జిస్తున్న వారికి పూర్తి ట్యాక్స్ రిబేట్‌ను కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పన్నులు చెల్లిస్తున్న వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి తన ప్రసంగం చివరల్లో ఐటీశ్లాబ్ అంశాన్ని ప్రస్తావించారు. పన్ను చెల్లింపుదారులకు ధన్యవాదాలు అంటూ గోయల్ అన్నారు. పన్నులు చెల్లించడం వల్లే దేశవ్యాప్తంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. తాజా ట్యాక్స్ శ్లాబ్ ప్రకారం వార్షికంగా 6.5 లక్షలు సంపాదించేవాళ్లు కూడా పన్ను శ్లాబ్‌లోకి వస్తారు. ఏదైనా రీతిలో తమ సొమ్మును ఆదా (సెక్షన్ 80సీ కింద పొదుపు పెట్టుబడి) చేసే వారికి కోసం ఈ వెసలుబాటు కల్పించారు. అయితే ఈ సంవత్సరానికి మాత్రం పన్ను స్లాబ్‌లో మార్పులు లేవు. కొత్తగా ప్రకటించిన రిబేట్‌తో సుమారు మూడు కోట్ల మంది పన్నుదారులకు లబ్ధి చేకూరనున్నది. పన్ను చెల్లింపుదారులు, పన్ను అధికారులకు మధ్య ఎటువంటి సంబంధం లేకుండా చేస్తామని పీయూష్ గోయల్ చెప్పారు. పన్ను వ్యవస్థను పూర్తిగా కంప్యూటరీకరిస్తాం అని వెల్లడించారు.


పన్ను మినహాయింపు వల్ల ఎక్కువగా లాభపడింది మాత్రం రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారే. వీరు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ ట్యాక్స్ కేటగిరిలో ఉన్న వారు ఇదివరకు రూ.13,000 పన్ను చెల్లించేవారు. ఆదాయం రూ.5 లక్షలు దాటితే.. అప్పుడు సాధారణ పన్ను రేట్లు వర్తిస్తాయి. ఇవి 5 శాతం, 20 శాతం, 30 శాతంగా ఉన్నాయి. వీటికి సెస్సు, సర్‌చార్జ్ అదనం.

ఆదాయం రూ.5 లక్షలు దాటినా కూడా పన్ను భారం తప్పించుకోవచ్చు. పన్ను ప్రయోజనాలు అందించే ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈ ప్రయోజనం పొందొచ్చు. వీటికి క్లెయిమ్ చేసుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తికి రూ.6.5 లక్షల ఆదాయం వస్తోంది. ఇందులో రూ.1.5 లక్షలను సెక్షన్ 80సీ వర్తించే సాధనాల్లో ఇన్వెస్ట్ చేశారు. అప్పుడు రూ.1.5 లక్షల వరకు డిడక్షన్ కోసం క్లెయిమ్ చేసుకోవాలి. అప్పుడు ఆదాయం రూ.5 లక్షలకు తగ్గుతుంది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80డీ మార్గాల్లో కూడా డిడక్షన్ పొందొచ్చు.

పన్ను లెక్కింపు ఎలాగంటే?

అంశాలు	ప్రస్తుతం	బడ్జెట్ ప్రతిపాదన
బేసిక్ శాలరీ, డీఏ	రూ.3,77,200	రూ.3,77,200
ఇతరపన్ను అలవెన్సులు	రూ.1,72,800	రూ.1,72,800
స్థూల వేతనం	రూ.5,50,000	రూ.5,50,000
స్టాండర్డ్ డిడక్షన్	(రూ.40,000)	(రూ.50,000)
డిడక్షన్ తర్వాత ఆదాయం	రూ.5,10,000	రూ.5,00,000
ఆదాయపు పన్ను	రూ.14,500	రూ.12,500
సెక్షన్ 87ఏ రిబేట్	(రూ.12,500)	
రిబేట్ తర్వాత పన్ను	రూ.14,500	
సర్ చార్జ్:	10/15 శాతం	
సర్ చార్జ్ తర్వాత పన్ను	రూ.14,500	
ఎడ్యుకేషన్ సెస్సు:	రూ.580 (4శాతం)	
పన్ను, సర్‌చార్జ్, ఎడ్యుకేషన్ సెస్సు	రూ.15,080	





- రెండో గృహానికి లభించే అద్దెపై ఆదాయ పన్ను మినహాయింపు.
- పోస్టాఫీస్ పొదుపు పథకాలపై వచ్చే వడ్డీపై టీడీఎస్ రాయితీ రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంపు.
- ఇంటి అద్దెలపై టీడీఎస్ రూ.1.80 లక్షల నుంచి రూ.2లక్షలకు పెంపు.
- ఆదాయ పన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంపు. రూ.6.5లక్షల వరకు ఆదాయం ఉండి ప్రావిడెంట్‌ఫండ్, ప్రతిపాదిత పొదుపు పథకాల్లో పెట్టుబడులు పెట్టే వారు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.
- రూ.2లక్షల వరకు గృహరుణాలు, ఆరోగ్య బీమా, జాతీయ పింఛను పథకం చెల్లింపులపై మినహాయింపు
- దేశవ్యాప్తంగా మూడు కోట్ల మందికి రూ.18,500 కోట్ల మేరకు లబ్ధి కలుగుతుంది.
- రూ. 40 వేల నుంచి రూ.50 వేలకు స్టాండర్డ్ డిడక్షన్ పెంపు .
- ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 54 కింద రెండు ఇళ్లపై పెట్టుబడులు పెట్టవచ్చు. దీనికి సంబంధించి రూ.2 కోట్ల వరకు మూలధన లబ్ధి (కేపిటల్స్ గెయిన్స్) నుంచి మినహాయింపు. జీవిత కాలంలో ఇది ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది.
- పేదలకు ఇళ్ల పథకం కింద 2020లోపు రిజిస్టర్ చేసుకొన్న గృహ ప్రాజెక్టులకు ఆదాయపన్ను మినహాయింపు.

అసంఘటితరంగ కార్మికులకు వరం

నెలకు రూ.3000 పింఛన్

అసంఘటిత రంగ కార్మికులకు బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్త పింఛన్ పథకానికి ఎన్‌డీఏ సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్రధాన్ మంత్రి శ్రమ యోగి మాంధన్ (పీఎంఎస్‌వైఎం) స్కీంను తీసుకొచ్చింది. 60 ఏళ్లు నిండిన వారు మాత్రమే దీనికి అర్హులుగా ప్రకటించింది. వీరందరికీ నెలకు రూ.3000 పింఛన్ కేంద్ర ప్రభుత్వం అందించనుంది. దీని కోసం కార్మికులు నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా రానున్న ఐదేళ్ల కాలంలో సుమారు 10 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు లబ్ధి పొందుతారు. అసంఘటిత రంగ కార్మికుల పింఛన్ స్కీం కోసం రూ.500 కోట్లు కేటాయించారు. దేశ వ్యాప్తంగా 42 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వీరంతా దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నెలకు రూ.15,000 ఆదాయం ఉన్న ఆటో రిక్షా డ్రైవర్లు, కార్మికులు వంటి వారు ఈ పథకానికి అర్హులు.

గ్రాట్యూటీ పరిధి రూ.30లక్షలకు పెంపు

ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో ఈపీఎఫ్‌వో సభ్యులు పెరిగారు. ఈపీఎఫ్‌వో బోనస్ పరిమితిని 21 వేలకు పెంచారు. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను రహిత గ్రాట్యూటీని రూ.20 లక్షలకు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. 2019-2020 బడ్జెట్‌లో గ్రాట్యూటీ పరిధిని రూ.30లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు.


రైల్వే ₹1.58 లక్షల కోట్లు

రైల్వే చరిత్రలో ఇదివరకు ఎప్పుడూ కేటాయించని విధంగా మొదటిసారిగా రూ. 1.58 లక్షల కోట్లు కేటాయించారు. ఆర్థిక సంవత్సరం 2019-20 మూలధన వ్యయానికి గానూ ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దేశంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థ అయిన రైల్వేకు ఇదే అత్యధిక బడ్జెట్ కావడం విశేషం. రైల్వే ఆదాయాన్ని పెంచేందుకు ఈ బడ్జెట్‌ను కేటాయించామని మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. 2018-19 ఏడాది భారత రైల్వేకు సురక్షితమైన సంవత్సరంగా నిలిచింది. తక్కువ ప్రమాదాలు జరిగాయని మంత్రి వెల్లడించారు. బ్రాడ్ గేజ్ లైన్లల్లో సిబ్బందిలేని లెవల్ క్రాసింగ్స్‌ను పూర్తిగా తొలగించామన్నారు. రైల్వే బడ్జెట్ మూలధన వ్యయంలో తొలిసారిగా అత్యధికంగా రూ. 1.58 లక్షల కోట్లు కేటాయించామని మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గతేడాది ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ రూ. 1.48 లక్షల కోట్లను రైల్వేకు కేటాయించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించని సెమీ హైస్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం భారతీయ ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభూతిని కలిగించనుందన్నారు. రైల్వేలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా రైల్వే ఇంజనీర్లు మేకిన్ ఇండియా కార్యక్రమానికి ఊతమిస్తున్నారు. ఉద్యోగాల కల్పన కూడా జరుగుతోందని మంత్రి వివరించారు. వ్యవస్థ నియంత్రణ నిష్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 96.2 శాతంగా వృద్ధి చెందింది. 95 శాతంగా మెరుగుపరచుకోవడమే లక్ష్యంగా పని చేయనున్నామని వెల్లడించారు. రైల్వేకు కేటాయించిన ఈ బడ్జెట్ నిధుల్లో రూ. 7,255 కోట్లను కొత్త లైన్ల నిర్మాణానికి ఉపయోగిస్తారు. రూ. 2,200 కోట్లతో గేజ్ మార్పులు, రూ. 700 కోట్లతో డబ్లింగ్, రూ. 6,144 కోట్లతో రోలింగ్ స్టాక్, రూ. 1,750 కోట్లతో సిగ్నలింగ్, టెలికం కోసం కేటాయించనున్నారు. ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కోసం రూ. 3,422 కోట్లను కేటాయించారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యాలకు కేటాయిస్తున్న రూ. 1000 కోట్లకు ఇది ఈ నిధులు అదనమని మంత్రి గోయల్ వెల్లడించారు.



వైద్యానికి రూ. 61,398 కోట్లు

2019-20 ఆర్థిక సంవత్సరానికి గానూ వైద్యరంగానికి రూ. 61,398 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఏబీ-పీఎంజేఏవై ఆరోగ్య బీమా పథకానికి రూ. 6400 కోట్లు కేటాయిస్తున్నామని పీయూష్ గోయల్ వెల్లడించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చితే ఈ బడ్జెట్ 16 శాతం అధికమని తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఆయుస్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య పథకం(ఏబీ-పీఎంజేఏవై)కి రూ.6,400 కోట్లు కేటాయించనున్నామని వివరించారు. ఈ పథకాన్ని గతేడాది సెప్టెంబర్ 23న ప్రధానమంత్రి ప్రకటించారు. 10 కోట్ల కుటుంబాలు లబ్దిపొందనున్నాయని మంత్రి వెల్లడించారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పథకం కింద ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు రూ. 250 కోట్లు కేటాయించనున్నామని తెలిపారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌కు రూ. 1350 కోట్లు కేటాయించనున్నామని వివరించారు. నేషనల్ ఎయిడ్స్ అండ్ ఎస్టీడీ కంట్రోల్ ప్రొగ్రాంకి రూ. 2500 కోట్లు కేటాయించారు. ఏఐఐఎంఎస్‌లకు రూ. 3599 కోట్లను కేటాయించారు. నేషనల్ మెంటల్ హెల్త్‌కి రూ. 40 కోట్లు కేటాయించాం.



విద్యకు రూ. 93, 847 కోట్లు

ఆర్థిక సంవత్సరం 2019-20కి గానూ విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం గణనీయమైన నిధులను కేటాయించింది. రూ. 93, 847 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరం కేటాయించిన నిధుల కంటే 10 శాతం ఎక్కువగా కేటాయించారు. ఉన్నత విద్యకు రూ. 37, 461 కోట్లు. ప్రాథమిక విద్యకు రూ. 56, 386 కోట్లను కేటాయించారు. రైజ్(రివైటలిజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టం ఇన్ ఎడ్యుకేషన్) అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో భాగంగా రానున్న నాలుగు సంవత్సరాలలో విద్యారంగంలో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. వైద్య విద్య సంస్థలతోపాటు ఇతర విద్యాసంస్థల్లో పరిశోధన, మౌలిక వసతుల ఏర్పాటు కోసం పెట్టుబడులు పెట్టనున్నారు. పరిశోధనలు, ఆవిష్కరణల కోసం గతేడాది కేవలం రూ. 350 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 608 కోట్లను కేటాయించారు.


కొత్తగా రెండు పూర్తిస్థాయి ఎస్‌పీఏ (స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్)లను సవాలుగా తీసుకుని ఏర్పాటు చేయనున్నామని మంత్రి పీయూష్ గోయల్ ప్రతిపాదించారు. అదనంగా మరో 18 ఎస్‌పీఏలను స్వయంప్రతిపత్తిగల ఐఐటీ, నిట్స్‌లలో ఏర్పాటు చేయనున్నామన్నారు. దిశ పథకం ద్వారా టీచర్లకు డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించనున్నాం. దీక్షా వెబ్‌సైట్ ద్వారా టీచర్లకు టెక్నాలజీ గురించి వివరిస్తాం. వినూత్న విధానాల్లో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే అవకాశం ఉంటుంది. గతేడాది రూ.85, 010 కోట్లు కేటాయించారు.

3 లక్షల కోట్లు రక్షణకు



భారత రక్షణరంగ వార్షిక బడ్జెట్ తొలిసారిగా రూ. 3 లక్షల కోట్లు దాటింది. 2019-20 బడ్జెట్‌కు గానూ మూడు లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. సరిహద్దు భద్రత, అత్యుత్తమ ప్రమాణాల సంసిద్ధత కోసం ఈ బడ్జెట్‌ను కేటాయించామని మంత్రి వివరణ ఇచ్చారు. అవసరమైతే అదనపు నిధులను కేటాయిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2.85 లక్షల కోట్లు కేటాయించగా.. ఈసారి అదనంగా రూ. 20 వేల కోట్లతో బడ్జెట్‌ను కేటాయించామన్నారు. రక్షణ బడ్జెట్‌పై ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి పీయూష్ సమాధానమిచ్చారు. భారతీయ సాయుధ దళాల మాజీల నుంచి వన్ ర్యాంక్ వన్ పెన్షన్(ఓపీఓఆర్) డిమాండ్ సుధీర్ఘకాలంగా ఉంది. 40 ఏళ్లుగా ఈ డిమాండ్ ఉంది. ఈ పథకం అమలు కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ. 35 వేల కోట్లు కేటాయించింది. మిలిటరీ సేవల చెల్లింపుల్లో గణనీయమైన పెరుగుదల ఉంది. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తున్న నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ప్రత్యేక అలవెన్సులు కూడా చెల్లిస్తున్నానమి ఆయన వివరించారు. గత ప్రభుత్వాలు మూడు మధ్యంతర బడ్జెట్‌లను ప్రవేశపెట్టాయి. 2014-15 మధ్యంతర బడ్జెట్‌లో గత ప్రభుత్వం కేవలం రూ. 500 కోట్లు కేటాయించింది. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఆత్మశుద్ధితో ఓపీఓఆర్ పథకాన్ని అమలు చేస్తున్నాం. రూ. 35,000 కోట్లు కేటాయించాం. రక్షణ రంగానికి అవసరమైనప్పుడు మరికొన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన వివరణ ఇచ్చారు.వన్ ర్యాంక్ వన్ పెన్షన్(ఓపీఓఆర్) పథకం ప్రకారం సమాన హోదా కలిగిన అధికారి పదవి విరమణ ఎప్పుడు చేశారనే విషయంతో సంబంధం లేకుండా అందరికీ సమాన పెన్షన్‌ను చెల్లిస్తారు.

నవ భారత్ నిర్మాణం దిశగా..



గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చారిత్రాత్మకం. ఇది నవ భారత నిర్మాణం కోసం ఎంతో దోహదపడుతుంది. పన్ను మినహాయింపు పరిధి రూ.5లక్షల వరకు పెంచడం బాగుంది. దీనికితోడు ప్రావిడెంట్ ఫండ్, ప్రతిపాదిత పొదుపు పథకాల్లో రూ.1.50ల పెట్టుబడి పెట్టినా ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వడం సంతోషదాయకం. ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పన్ను మినహాయింపు నిర్ణయం పేద, మధ్య ప్రజలకు ఎంతో ఊరట ఇస్తుంది. రైతులు, కార్మికులు, నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించడం బాగుంది. 2030 కల్లా భారత్ ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది.

అన్ని వర్గాలకు లబ్ది చేకూరేలా..



యువకులు, రైతులు, పేద, మధ్య ప్రజలు ఇలా అన్ని వర్గాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అందరి గురించి ప్రస్తావించడం జరిగింది. పన్ను చెల్లింపు నుంచి భారీ ఊరట లభించింది. రైతులకు ఏడాదికి రూ.6వేలు ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేదు. ఇదో మైలు రాయి. 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. రుణమాఫీ ద్వారా రైతు కేవలం ఒకే సారి లబ్ది పొందుతాడు. అదే ఆర్థిక సాయం అందిస్తే ప్రతీ ఏడాది ఆర్థికంగా వృద్ధి చెందుతాడు. రక్షణ రంగానికి రూ.3లక్షల కోట్లు కేటాయించడం ఎంతో బాగుంది. ఎన్‌డీఏ ప్రభుత్వం రక్షణ శాఖకు మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. ఆవుల విషయంలో మహాత్మా గాంధీ, వినోబబావే పెట్టుకున్న లక్ష్యాలను ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ముందుకు తీసుకెళ్లింది. సంఘటిత కార్మికులకు నెలకు రూ.3వేల పింఛన్ అందజేయడం కూడా ఎంతో బాగుంది.

రైతులు, పేదలకు అండగా ..



ప్రస్తుతం వైద్యచికిత్స కోసం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న కేంద్ర మంత్రి జైట్లీ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019-20తాత్కాలిక బడ్జెట్‌పై ట్విటర్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుత బడ్జెట్ ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్‌కు అభినందనలు తెలుపుతున్నాను అని ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికి ఇచ్చిన విధానపరమైన మార్గదర్శకాల్లో కీలకాంశాలును నేడు పీయూష్ గోయల్ సమర్పించిన తాత్కాలిక బడ్జెట్ వెల్లడిస్తోందన్నారు. రైతులు, పేదలతోపాటు మధ్యతరగతి వర్గాలకు అండగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు.



3 నిర్ణయాలు..23 కోట్ల ఓట్లు

• ఎన్నికల వేళ ఓటు బ్యాంక్‌కు ఎర • వైరి వర్గాల ఎత్తులను తిప్పికొట్టే వ్యూహం

సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మెజారిటీ ఓటు బ్యాంకే లక్ష్యంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఏకంగా 23 కోట్ల మందికి ఎరవేసినట్లుగా ఉంది. రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు అడగకుండానే తాయిలాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మూడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయిన తరుణంలో సార్వత్రిక ఎన్నికల ప్రజా తీర్పు కీలకమని భావించిన మోడీ ప్రభుత్వం నజరానాలు , తాయిలాలు ప్రకటించింది. ఓవైపు మహాకూటమి, మరోవైపు ఎస్పీ- బీఎస్పీల కలయిక.. ఇంకోవైపు ప్రియాంక తెరగ్రేటం.. ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నం.. ఇంతమంది ఓ వైపు అయితే మోడీ ఓవైపు అన్నట్లుగా సాగనున్న ఎన్నికల్లో ప్రజలను మెప్పించాలంటే చాణక్య వ్యూహమే రచించాలి. అందుకే మోడీ దేశంలోని ఓటర్లలో దాదాపు సగం మందికి గాలం వేశారు.

రూ.6వేలు.. 12 కోట్ల ఓట్లు..



దేశానికి వెన్నుముక లాంటి రైతన్న వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కీలక భూమిక పోషించబోతున్నాడు. అన్నదాత తీర్పే కేంద్రంలో ఎవరు కొలువుదీరనున్నారా నిర్ణయిస్తుంది. ఈ విషయాన్ని ముందే గుర్తించిన మోడీ ప్రభుత్వం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్' నిధి పేరుతో రైతుబంధు వంటి పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరనుంది. ఏడాదికి రూ.6 వేలను మూడు కిస్తీల్లో(ఒక్కో విడత రూ.2వేలు) రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. 2019 మార్చి నాటికి రైతుల ఖాతాల్లో తొలి విడత సాయంగా రూ.2వేల నగదు అన్నదాత అకౌంట్లలో వేస్తారు.

పెన్షన్‌తో 10 కోట్ల ఓట్లు..

మన దేశంలోని 120 కోట్ల జనాభాలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య దాదాపు 1/3 వ వంతు. వారిని లక్ష్యంగా చేసుకొని ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పథకం ప్రకటించారు.. 60 ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వచ్చే విధంగా దీన్ని రూపొందించారు. నెలసరి ఆదాయం రూ.15వేల లోపు ఉండే వారు నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60ఏళ్ల తర్వాత రూ.3వేల పింఛన్ అందుతుంది. ఈ నిర్ణయంతో వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది ప్రయోజనం కలుగుతుంది.



మధ్యతరగతి ఓటర్‌కు గాలం..



ఎన్నికల వేళ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలకు నజరానాలు ప్రకటించడం సర్వ సాధారణం. ఈ వర్గాల వారిలో చదువుకున్న వారంగా ప్రభుత్వ పనితీరును విశ్లేషించుకొని ఓటేస్తుంటారు. నిత్యావసరాల ధరలు, పన్నులు వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెడతారు. ఈనేపథ్యంలో ఎన్‌డీఏ సర్కార్ వీరికి భారీ తాయిలం ప్రకటించింది. రూ.5లక్షల వరకు ఆదాయంపై పన్నును పూర్తిగా తొలగించింది. గ్రాట్యూటీ, స్టాండర్డ్ డిడక్షన్, గృహరుణ చెల్లింపులు, చెల్లించిన అద్దెకు పన్ను మినహాయింపులు... ఇలా అవకాశం ఉన్నచోటల్లా వారికి లబ్ధి చేకూర్చారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంపు

మధ్యంతర బడ్జెట్‌లో మోడీ సర్కారు మహిళలకు పెద్ద పీట వేసింది.గ్రామీణ ప్రాంతాల్లోని 8 కోట్ల మందికి ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చేందుకు రూపొందించిన 'ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన 'పథకం ద్వారా ఇప్పటికే 6 కోట్ల మందికి ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది వేతాన్ని 50 శాతం పెంచారు. 'ప్రధాన్ మంత్రి ముద్రా యోజన' పథకంలో 75 శాతం మంది మహిళా లబ్ధిదారులన్నారు. 'మాతృత్వ యోజన' పథకం ద్వారా మహిళా ఉద్యోగులకు 26 వారాల సెలవు దినాలు ప్రకటించారు.



హవ్వ.. రైతుకి అవమానం



15 మంది పారిశ్రామికవేత్తలకు రూ.3.5 లక్షల కోట్లు మాఫీ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు రోజుకు రూ.16.44 ఇస్తారా..? సంవత్సరానికి రూ.6000 వేలు ఇస్తే రైతు ఆదాయం రెట్టింపు అవుతుందా..? అది కూడా మూడు దఫాల్లో ఇస్తే ఎలా ఉపయోగిస్తారు..? పారిశ్రామికవేత్తలపై ఉన్న ప్రేమ రైతులకు ఒకింత కూడా లేకపోవడం బాధాకరం. రోజుకు రూ.16.44 ఇవ్వడం అంటే అవమానించడం కాదా..? గత ఐదేళ్ల కాలంలో రైతుల జీవితాలు చాలా దుర్భరంగా మారాయి. రైతులు, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడులు, రాఫెల్ వంటి అంశాలు ఎన్నికల పోరాటంలో ప్రధాన అంశాలు. అంతేగానీ అవమానపర్చే పథకాలు కావు. బడ్జెట్ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలా ఉంది.

బడ్జెట్.. ఓ ఎన్నికల మేనిఫెస్టో..



గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రానున్న ఎలక్షన్‌లను దృష్టిలో పెట్టుకుని చేశారు. ఇదో ఎన్నికల మేనిఫెస్టో. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ చేస్తున్న ఓ బడ్జెట్ కుట్ర. ఎన్నికల సమయంలో చేసిన హామీలే ఇప్పటి వరకు నెరవేర్చలేదు. ఓటర్లకు నేరుగా లంచం ఇచ్చేలా బడ్జెట్ ఉంది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామన్న మోడీ హామీ ఏమైంది..? ఐదేళ్లలో 10 కోట్ల ఉద్యోగాల సృష్టిమాట ఊసేలేదు. బీజేపీ మేనిఫెస్టోను పార్లమెంట్‌లో పియూష్ గోయల్ చదివారు అంతే. బీజేపీ జిమ్మిక్కులకు ఎవరూ పడిపోరు. ప్రజలు దీన్ని గమనిస్తూ ఉన్నారు. దళితులకు ఎలాంటి లబ్ది చేకూరడం లేదు. రైతులను పిచ్చోళ్లను చేస్తోంది. నెలకు రూ.500 ఇస్తే ఎలా వారి ఆదాయం రెట్టింపు అవుతుంది..?

పదేపదే బల్ల చరిచి...




ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్ వేళ ప్రధాని నరేంద్ర మోడీ చాలా ఉత్సాహంగా కనిపించారు. లోక్‌సభలో ఇవాళ పీయూష్ గోయల్ బడ్జెట్ చదువుతున్నంత సేపు జోష్ ప్రదర్శించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం సాధించిన ఘనతను కొనియాడుతున్న సమయంలో, పదే పదే బల్లను చరిచారు. మిగతా బీజేపీ సభ్యుల మాదిరిగా మనసులోని ఉత్సాహాన్ని వ్యక్తంచేశారు.

పన్ను ప్రతిపాదనలు

వ్యక్తిగతంగా వాటి ప్రభావమెంత?

మధ్యంతర బడ్జెట్ 2019-20

	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన
వేతనం జీతం	5 లక్షలు	5 లక్షలు	7.5 లక్షలు	7.5 లక్షలు	20లక్షలు	20 లక్షలు
స్థిర మినహాయింపు	40,000	50,000	40,000	50,000	40,000	50,000
నికర ఆదాయం	4.6లక్షలు	4.5లక్షలు	7.1లక్షలు	7లక్షలు	19.6లక్షలు	19.5 లక్షలు
పన్ను	10,500	10,000	54,500	52,500	3,00,500	2,97,500
నికర పన్ను	10,500	నిల్	54,500	52,500	3,00,500	2,97,500
సర్‌చార్జ్						
విద్యాసెస్సు	420	నిల్	2,180	2,100	12,020	11,900
మొత్తం పన్ను	10,920	నిల్	56,680	54,600	3,12,520	3,09,400
పన్ను పొదుపు	--	10,920	--	2,080		3,120



లీకులపై ఆందోళన

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే మీడియాలో దీనికి సంబంధించి సమాచారంపై కథనాలు రావడాన్ని ప్రతిపక్షాలు తప్పుబట్టాయి. ఇందుకు నిరసనగా శుక్రవారం స్పీకర్ సుమిత్రా మహాజన్ చైర్‌లోకి రాగానే విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభ ముందుకు బడ్జెట్ ప్రతులు రాకముందే మీడియాకు సమాచారం ఇచ్చారంటూ కాంగ్రెస్, వామపక్ష సభ్యులు మండిపడ్డారు. ఇదే సందర్భంలో కొందరు సభ్యులు దేశంలో నిరుద్యోగ సమస్య రికార్డుస్థాయికి చేరడంపై ఆందోళన వ్యక్తంచేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ తెదేపా ఎంపీలు నినాదాలు చేశారు.

దశాబ్ది దర్శిని!

విజన్ 2030

అభివృద్ధికి పది కోణాలు!!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బలమైన దేశంగా భారతదేశం ఎదగడానికి అడ్డుగా ఉన్నవాటిని ఈ అయిదేళ్లలో చాలామటుకు తొలగించామని, మరికొన్ని సవాళ్లను పరిష్కరించాల్సి ఉందని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అయిదేళ్లలో అయిదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎనిమిదేళ్లలో పది ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా వృద్ధి చేయాలన్నారు. భారత దేశంలో ఏ పనికైనా పది కోణాలుంటాయని, అందుకనే ఎన్డీయే ప్రభుత్వ విజన్ 2030కి అన్ని కోణాలున్నట్లు గోయల్ చెప్పారు.

1 **హాయిగా జీవిద్దాం..** దేశంలో అన్ని రంగాల్లో మౌలిక సౌకర్యాల కల్పనతో సులభ తరమైన జీవనాన్ని సాకారం చేయడం మొదటి అభివృద్ధి కోణమని గోయల్ చెప్పారు. రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, ఊపరితల జల రవాణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకి ప్రాధాన్యత.

2 **అందరితో అనుసంధానం..** డిజిటల్ ఇండియాని నిర్మించడం ద్వారా ఆసేతు హిమాచలాన్ని అంతర్జాలంతో అనుసంధానించడం. ఆర్థిక వ్యవస్థలోని ప్రతి పాయింట్‌ను, ప్రతి పౌరుడిని అనుసంధానించే డిజిటల్ ఇండియాని పూర్తి స్థాయిలో సాకారం చేయడం.

3 **చమురు వద్దు.. సూర్యుడు ముద్దు** చమురు దిగుమతులపై భారత్ ఆధారపడడాన్ని తగ్గిస్తూ.. ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం, దేశ ప్రజలకు విద్యుత్ భద్రతను కల్పించడం లక్ష్యంగా ఉంటుంది. ఇకపై భారత దేశం విద్యుత్ వాహనాలను నడిపే దిశగా ప్రయాణం సాగించాలి.

4 **గ్రామీణ పారిశ్రామికీకరణ!** ఆధునిక పారిశ్రామిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామీకరణ చేయడం. మేక్ ఇన్ ఇండియా ఆధారంగా గ్రామాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీలను నెలకొల్పాలి. ఇప్పటికే భారత దేశం చాలా రంగాల్లో అంతర్జాతీయ తయారీగా హబ్‌గా ఎదిగింది.

5 **స్వచ్ఛ నదులు!** దేశంలోని నదులను పరిశుభ్రం చేసి పౌరులందరికీ స్వచ్ఛమైన తాగు నీటిని అందుబాటులోకి తేవడం. గంగా నదిని శుభ్రం చేయడానికి అనుసరిస్తున్న పద్ధతుల్లోనే మిగిలిన నదులపైనా దృష్టిపెట్టడం. వ్యవసాయ అవసరాల కోసం సూక్ష్మ సాగు పద్ధతలను అభివృద్ధి చేయడం.

6 **తీరంతో సమరం!** భారతదేశానికి సుదీర్ఘమైన కోస్తా తీరం ఆర్థిక రంగానికి పెట్టని గోడలా ఉంది. నీలి ఆర్థిక విధానం ద్వారా కోస్తా తీరంలో జీవించే ప్రజల జీవన ప్రమాణాలను వృద్ధి చేయడం. సాగరమాలతో పాటు అంతర్గత జల రవాణాను అభివృద్ధి చేయడం.

7 **అంతరిక్షంలో అడుగిడుతాం..** దేశ గగనతల రక్షణతో పాటు అంతరిక్ష కార్యక్రమాలను ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశానికి తీసిన పోని విధంగా రూపొందించడం. ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో ప్రపంచ లాంఛింగ్ పాడ్‌గా భారత్‌ను మార్చడం. 2022 నాటికి అంతరిక్షంలో మానవ సహిత వ్యోమ నౌకను ప్రయోగించడం.

8 **ప్రపంచానికి తినిపిస్తాం..** ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తూ, ప్రపంచ దేశాల అవసరాలకు కూడా ఎగుమతి చేసే స్థాయికి చేరడం. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తిని పూర్తిగా సేంద్రియ విధానంలోకి తీసుకొని వస్తూ, ఫుడ్ ప్రాసెసింగ్, నిల్వ, నిర్వహణ కోసం శీతల గిడ్డంగులను నిర్మించడం.

9 **ఆరోగ్య భారతం!** సంపూర్ణ ఆరోగ్య భారతావనిని ఆవిష్కరించడం. వైద్య సంబంధమైన మౌలిక సౌకర్యాల సృష్టితో పాటు దేశ ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించడం. ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భారతాన్ని నిర్మిస్తూ అందులో మహిళలను భాగస్వాములను చేస్తూ వారి భద్రతకు, సాధికారతకి ప్రాధాన్యత ఇవ్వడం.


10 **ప్రభుత్వం కాదు.. టీమిండియా!** ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులంతా టీమిండియాలాగా వ్యవహరిస్తూ, ఎన్నికైన ప్రభుత్వాలతో అంకిత భావంతో కలిసిమెలిసి పని చేస్తూ.. తక్కువ ప్రభుత్వం... ఎక్కువ పాలనను సాధించడమే తమ పదో కోణమని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. 2030 నాటికి భారత దేశంలో అధికార యంత్రాంగం ప్రజానుకూలంగా, మరింత బాధ్యతాయుతంగా, స్నేహపూరితంగా తయారవుతుందని గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పది కోణాలతో దేశంలో పేదరికం, పౌష్టికాహార లేమి, మురికివాడలు, నిరక్షరాస్యతను పారద్రోలి, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యధిక వృద్ధి రేటుతో సమానత్వాన్ని వెదజల్లుతూ, పారదర్శక సమాజాన్ని ఆశిస్తున్నట్లు ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు.

ఓట్ల ఏరువాకలో.. మోడీ మెరుపుల్..

ఇది ట్రైలర్ మాత్రమే..

ఈ బడ్జెట్ కేవలం ట్రైలర్ మాత్రమే. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందాక దేశాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తాం. రైతులు, మధ్య తరగతి వేతన జీవులు సహా అందరి ఆకాంక్షలను ప్రతిబింబించేలా బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్‌తో 12 కోట్ల మంది రైతులు, మూడు కోట్ల మధ్య తరగతి కుటుంబాలు, 30 నుంచి 40 కోట్ల అసంఘటిత రంగ కార్మికులు లబ్ది పొందుతారు. ఎన్‌డీఏ హయాంలో పేదరికం ఎంతో తగ్గింది. అన్ని వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకున్నాం. ఎక్కువ ప్రభుత్వ పతకాలు ప్రవేశపెట్టడంతో దేశంలో పేదరికం తగ్గుముఖం పట్టింది. నవ భారత నిర్మాణానికి ఈ బడ్జెట్ మరింత శక్తిని అందజేస్తుంది. ప్రభుత్వ పథకాల ద్వారా 1.5 కోట్ల మంది శాశ్వత గృహాలు నిర్మించుకున్నారు. మధ్య తరగతి ప్రజలు, వేతన జీవులకు భారీ ఊరటగా ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5లక్షలకు పెంచాం. ఇక నుండి ఐదు లక్షలలోపు ఆదాయం ఉన్న వారు ఎలాంటి పన్ను కట్టనక్కర్లేదు. పేద మధ్య తరగతి ప్రజలు కలలు సహకారం అవుతాయి. పీఎం కిసాన్ నిధి ఓ చారిత్రాత్మక పథకం. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏడాదికి రూ.6వేలు (మూడు దఫాల్లో) అందజేస్తాం. అరుణ్ జైట్లీ వైద్య పరీక్షల కోసం విదేశాలకు వెళ్లారు. పియూష్ గోయల్ బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ధన్యవాదాలు.

- నరేంద్ర మోడీ, ప్రధాన మంత్రి







వేతన జీవికి బంపర్ ఆఫర్

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని ఏకంగా రెట్టింపు చేస్తూ మధ్యతరగతి ఉద్యోగులపై వరాల జల్లు కురిపించింది. ఇప్పటివరకు వార్షికాదాయం రూ. 2.50 లక్షలు దాటితే ఉద్యోగులు పన్ను కట్టాల్సి ఉండగా.. ఇప్పుడు ఆ పరిమితిని ఏకంగా రూ. 5 లక్షలకు పెంచుతూ మోడీ సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక, అదేవిధంగా గృహరుణాలు, ఇంటి అద్దెలు, ఇన్సురెన్స్‌లు కలిపి 6.50 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్ను ఉండబోదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న మూడు కోట్ల మంది మధ్యతరగతి ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఇక, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలకు పెంచినట్టు ప్రకటించిన గోయల్.. పొదుపు ఖాతాలపై వచ్చే వడ్డీ 10 వేల నుంచి 40 వేలకు పెంచుతున్నట్టు తెలిపారు. నెలకు 50 వేల జీతం వరకు టీడీఎస్ వర్తించబోదని, సొంతిల్లు అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయంపై రూ. 2.50 లక్షల వరకు పన్ను ఉండదని స్ప ష్టం? చేశారు. ఇవన్నీ మధ్యతరగతి ఓటర్లను సంతృప్తిపరిచే నిర్ణయాలే కావడం గమనార్హం.

రూ 100 చెల్లిస్తే.. రూ. 3వేలు పెన్షన్

దేశంలోని అసంఘటితరంగ కార్మికులకూ మోదీ సర్కారు తన మధ్యంతర బడ్జెట్‌లో భారీ ఊరటనిచ్చింది.

ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్ పేరుతో అసంఘటితకార్మికులకు పింఛన్‌పథకాన్ని కేంద్రం ప్రకటించింది. 60 ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వచ్చే విధంగా ఈ పథకం రూపొందించారు. ఈ పథకంలో భాగంగా నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల దాటిన తర్వాత రూ.3వేల పింఛన్ పొందవచ్చు. అసంఘటిత రంగంలోని 10 కోట్లమంది కార్మికులకు ఈ పథకం వర్తించనుంది.



టెలికాంలో విప్లవాత్మక మార్పులు

అతి తక్కువ ఖర్చుతో డేటా, వాయిస్ కాల్స్. టెలికాం రంగంలో విప్లవాత్మకమైన మార్పులు. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో డేటా, వాయిస్ కాల్స్ సేవలు.

ఈశాన్య భారతానికి 58 వేల కోట్లు

ఈశాన్య భారత దేశానికి కేటాయింపులు రూ.58,166 కోట్లకు పెంపు. గత ఏడాదితో పోలిస్తే ఇది 21శాతం అదనం.

గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాలు
పేదలకు ఆహారం అందించేందుకు 1.17 కోట్లు
గ్రామీణ సడక్ యోజనకు రూ.19వేల కోట్లు కేటాయింపు
2.5 కోట్ల మందికి విద్యుత్ సదుపాయం అందించా
కోటీ 53 లక్షల ఇళ్ల నిర్మాణం జరిగింది

రైతుకు రొక్కం

వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు మోడీ సర్కారు ముందుకొచ్చింది. ఎన్నికల నేపథ్యంలో అన్నదాతలను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఒక కొత్త పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా చిన్నసన్నకారు రైతులకు ఏడాదికి రూ. 6వేల నగద సాయం నేరుగా అందజేస్తామని, ఐదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతుల ఖాతాలకు ఈ నగదును మళ్లిస్తామని గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ పథకం కోసం రూ. 75 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు తెలిపారు. మూడు విడతల్లో నగదు అందజేస్తామని, 2018 డిసెంబర్ నుంచి ఈ పథకం అమల్లో ఉంటుందని, తొలి విడతగా రూ.2వేల సాయం తక్షణమే రైతులకు అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలోకి మళ్లిస్తామని చెప్పారు. ఈ పథకంతో దేశవ్యాప్తంగా ఉన్న 12 కోట్ల రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇక, కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలు అందిస్తామని, రుణాలు సకాలంలో చెల్లించినవారికి రాయితీలు చెల్లిస్తామని పేర్కొంది. ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతుల రుణాల రీషెడ్యూల్ చేస్తామని హామీ ఇచ్చింది. పాడి పరిశ్రమ రుణాలు సకాలంలో చెల్లించే వారికి అదనంగా మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తామని చెప్పారు.

పెరిగిన జీఎస్‌టీ వసూళ్లు

2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధి జీఎస్‌టీ లక్ష్యాన్ని కేంద్రం చేరుకోలేకపోయింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో పరోక్ష పన్ను రూపంలో రూ.7.61 లక్షల కోట్లు రాబట్టుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరి వరకు రూ.7.43 లక్షల కోట్ల జీఎస్‌టీని రాబట్టుకోవాలని కేంద్రం నిర్ణయించింది. దీన్ని సవరించి రూ.6.43 లక్షల కోట్లకు నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు 10 నెలల కాలంలో రూ.9.71 కోట్ల జీఎస్‌టీని వసూలు చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.13.48 లక్షల కోట్లు వసూలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జీఎస్‌టీ ప్రారంభంలో నెలకు రూ.89,700 కోట్లు వచ్చేంది. ఇప్పుడు సగటున రూ.97,100 కోట్లకు చేరింది. జీఎస్‌టీ తీసుకొచ్చాక మొదటి ఐదేళ్లలో కేంద్ర ఆదాయం 14 శాతం ఆదాయం వృద్ధి చెందుతుంది. రిట్నర్న్‌ను ఆన్‌లైన్‌లో చేయడం జరిగింది. ఈ స్థానంలో ఈ వే బిల్లును తీసుకొచ్చారు. నిరుపేదలు ఉపయోగించే వస్తువులు తక్కువ స్లాబ్‌లోకి మళ్లించారు. సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా కొనుగోలుదారులకు ఊరట కల్పించారు.



సహజ వనరుల ఆధారిత విద్యుత్

రవాణ రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని తాత్కాలిక ఆర్థికశాఖమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. విద్యుత్ శక్తితో నడిచే వాహనాలు, విద్యుత్ నిల్వ పరికరాలతో రవాణ రంగంలో భారత్ కీలకంగా మారనుందని ధీమా వ్యక్తం చేశారు. సహజ వనరుల నుంచి విద్యుత్‌ను తయారు చేసి భారత్ తన విద్యుత్ అవసరాలను తీర్చుకోగలదన్నారు. తద్వారా దేశానికి విద్యుత్ శక్తి భరోసా ఉంటుందన్నారు. విద్యుత్ కొనుగోలుపై ఆధారపడడం కూడా తగ్గుతుందన్నారు. విదేశాల నుంచి ఇంధనం, గ్యాస్ దిగుమతిని విరమించుకున్నప్పుడు సహజ వనరుల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి వేగంగా పెరుగుతుందన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించినప్పుడు విదేశీ నగదు మిగులుతుంది. తద్వారా మనపై మనమే ఆధారపడొచ్చని మంత్రి గోయల్ వ్యాఖ్యానించారు. 2030 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 30 శాతం పెరిగే అవకాశం ఉందని నీతిఆయోగ్ అంచనా. 25.36 మిలయన్ల వాహనాలు అమ్మకాలు జరిగే అవకాశం ఉందని నీతిఆయోగ్ అంచనా వేసిన సంగతి తెలిసిందే.



రోడ్ల నిర్మాణం వేగవంతం

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం రూ.19 వేల కోట్లు కేటాయించమన్నారు. ప్రస్తుతం దేశంలో రోజుకు 27కి.మీ. రహదారిని నిర్మిస్తున్నాం. ప్రపంచంలో అత్యంత వేగంగా రహదారులను నిర్మిస్తున్న దేశంగా భారత్ నిలిచిందన్నారు. 'సాగర్ మాల' కింద పోర్టుల ద్వారా సరక ు రవాణా సులభం చేశామన్నారు. బ్రహ్మపుత్ర నది ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు సరకు రవాణా కల్పించామని తెలిపారు.



ఆయుష్మాన్ ద్వారా 10లక్షల మందికి వైద్యచికిత్స

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్. దీని ద్వారా ఇప్పటి వరకు 10లక్షల మంది రోగులకు వైద్య చికిత్స అందించాం. జన్ ఔషధీ స్టోర్స్ ద్వారా తక్కువ ధరకే మందులు అందిస్తున్నాం. తద్వారా మూడు లక్షల కోట్ల ప్రజాధనం ఆదా అయింది. దేశవ్యాప్తంగా 21 ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ద్వారా పేదలకు వైద్యచికిత్స అందిస్తున్నాం. గత ఐదేళ్లలో 14 ఎయిమ్స్ కేంద్రాలు మంజూరు చేయడం జరిగింది. 22వ ఎయిమ్స్ హర్యానాలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు జారీచేశాం.

మార్చిలోగా 2.5 కోట్ల గృహాలకు విద్యుత్

ఈ ఏడాది మార్చినాటికి గుర్తించిన 2.5 కోట్ల కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నదే సంకల్పం. తద్వారా దేశంలోని ప్రతి ఇంట వెలుగులు నింపుతాం. సౌభాగ్య పథకం లక్ష్యం పూర్తవుతుంది. సౌభాగ్య పోర్టల్ ప్రకారం 2017లో ప్రారంభించిన ప్రధానమంత్రి సహజ్ బిజలీ ఘర్ యోజన (సౌభాగ్య) పథకం ద్వారా 2,48,19,168 కుటుంబాలకు రూ.16,320 కోట్ల వ్యయంతో విద్యుత్ కనెక్షన్ అందించడం జరిగింది. రాజస్థాన్‌లో 8,460 కుటుంబాలు, ఛత్తీస్‌గఢ్‌లో 20,134 కుటుంబాలు కూడా ఉన్నాయి.



8 కోట్ల గ్యాస్ కనెక్షన్లు!!

ఉజ్వల స్కీమ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అందించే ప్రతి ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్‌కు రూ.1,600 సబ్సిడీ రూపంలో అందిస్తోంది. గ్రామీణ ప్రాంతంలోని పేదరికంలో మగ్గుతున్న గృహిణుల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఉజ్వల పథకం కింద 2020 నాటికి 8 కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. 2016లో ప్రారంభమైన ఈ స్కీమ్ ద్వారా తొలిగా 5 కోట్ల కుబుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే 2018 బడ్జెట్ ప్రసంగంలో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. ఉజ్వల స్కీమ్‌ను 2021 నాటి కల్లా 8 కోట్ల కుబుంబాలకు చేరువచేస్తామని ప్రకటించారు. దేశంలో ఎల్‌పీజీ కవరేజ్ దాదాపు 90 శాతానికి చేరిందని తెలిపారు. 2014లో ఇది 55 శాతంగా ఉందన్నారు.

కేటాయింపులు ఇలా...

పెన్షన్లు	రూ 1,74,300 కోట్లు
రక్షణరంగం	రూ3,05,296 కోట్లు
సబ్సిడీలు	రూ 2,96,684 కోట్లు
వ్యవసాయం	రూ. 1,49,981 కోట్లు
వాణిజ్యం-పరిశ్రమలు	రూ. 27,660 కోట్లు
ఈశాన్యరాష్ట్రాలకు	రూ. 3,000 కోట్లు
విద్య	రూ 93,848 కోట్లు
ఇంధన రంగం	రూ. 44,101 కోట్లు
విదేశీ వ్యవహారాలు	రూ. 16,062 కోట్లు
ఆర్థికశాఖకు	రూ 19,812 కోట్లు
ఆరోగ్యరంగం	రూ 63,538 కోట్లు
హోంమంత్రిత్వశాఖకు	రూ 1,03,927 కోట్లు
వడ్డీలు	రూ 6,65,061 కోట్లు
ఐటీ-టెలికాం	రూ. 21,549 కోట్లు
ప్రణాళిక-గణాంకాలు	రూ 5,594 కోట్లు
గ్రామీణాభివృద్ధి	రూ1,38,962 కోట్లు
స్థాంకేతిక శాఖకు	రూ 26,237 కోట్లు
సాంఘికసంక్షేమశాఖకు	రూ. 49,337 కోట్లు
పన్నుల నిర్వహణ	రూ. 1,17,285 కోట్లు
రాష్ట్రాల కేటాయింపులకు	రూ. 1,66,883 కోట్లు
రవాణా వ్యవస్థకు	రూ 1,56,187 కోట్లు
కేంద్ర పాలిత ప్రాంతాలకు	రూ. 15,042 కోట్లు
పట్టణాభివృద్ధికి	రూ. 48,032 కోట్లు
ఇతర రంగాలకు	రూ. 75,822 కోట్లు

ఎస్సీ, ఎస్టీ సంక్షేమనిధి పెంపు

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధిని రూ.62,574 కోట్ల నుంచి రూ.76,800 కోట్లకు పెంచారు. కేటాయింపుల్లో 35శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. సంచార, పాక్షిక సంచార వర్గాల కోసం కమిటీ ఏర్పాటు చేయనున్నాం. ఈ కమిటీ నీతిఆయోగ్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఇప్పటివరకు ఈ వర్గాలను వర్గీకరించలేదు. వీరి సంక్షేమానికి అందించే ప్రత్యేక పథకాలు సంచార వర్గాలకు చేరటం కష్టసాధ్యంగా ఉంది. వీరికి లబ్ధి చేకూరేలా సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకుంటాం. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వర్గీకరణ తరువాత వారి అభివృద్ధితోపాటు, నిధుల కేటాయింపులు పెరిగాయి. తొలుత 2018-19లో షెడ్యూల్ కులాలకు రూ.56,619 కోట్లు కేటాయింపునకు బడ్జెట్ అంచానావేసి అనంతరం కేటాయింపును రూ.62,474 కోట్లుకు, 2019-20 బడ్జెట్‌లో రూ.76,801కోట్లు కేటాయించాం. షెడ్యూల్ తెగలకు రూ.50,086 కోట్లు కేటాయించాం. గతేడాది కేటాయింపులతో పోలిస్తే ఇది 28శాతం అధికం.





సంక్షిప్తంగా కోట్లలో

	2017-18 Actuals (వాస్తవాలు)	2018-19 Budget Estimates (బడ్జెట్ అంచనాలు)	2018-19 Revised Estimates (అంచనాల మార్పు)	2019-20 Budget Estimates (బడ్జెట్ అంచనాలు)
రెవెన్యూ వసూళ్లు	1435233	1725738	1729682	1977693
మూల వ్యయ వసూళ్లు	706742	716475	727553	806507
మొత్తం వసూళ్లు	2141975	2442213	2457235	2784200
మొత్తం వ్యయం	2141975	2442213	2457235	2784200
రెవెన్యూ లోటు	443602	416034	410930	470214
వాస్తవ లోటు	591064	624276	634398	703999
ప్రాథమిక లోటు	62112	48481	46828	38938

క్రీడాప్రభ

సిరీస్ దక్కినా..
చివరి వన్డేలో ఓటమి

- న్యూజిలాండ్- భారత్ మహిళల వన్డే సిరీస్
- మూడో వన్డేలో భారత్‌పై 8 వికెట్ల తేడాతో కివీస్ గెలుపు

హామిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా మిథాలీ సేన శుక్రవారం ఆడిన మూడో వన్డేలో ఆతిథ్య జట్టు చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమి చెందింది. ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ నామ మాత్రమైన చివరి వన్డేలో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. కెప్టెన్ మిథాలీ రాజ్‌కు ఇది 200వ వన్డే కావడంతో.. ఈ మ్యాచ్‌ను కూడా గెలిచి సిరీస్ క్లీన్ స్వీప్ చేయాలని భావించిన భారత్‌కు ఆశాభంగమే కలిగింది. న్యూజిలాండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడంతో... భారత్ బ్యాటింగ్ ప్రారంభించి 44 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన దీప్తి శర్మ చేసిన 52 పరుగులే(90బంతులు, ఫోర్లు-4) అత్యధికం. 35 ఓవర్లు ముగిసేసరికి 117/4 పరుగుల వద్ద ఉన్న భారత్ మిగతా 32 పరుగులకే మిగతా ఆరు వికెట్లను పోగొట్టుకుంది. హర్మన్ ప్రీత్ కౌర్ చేసిన 24 పరుగులు జట్టులో రెండో అత్యధిక స్కోరు. న్యూజిలాండ్ బౌలర్లలో స్పిన్నర్ అన్నా పీటర్సన్ 28 పరుగులకు 4 వికెట్లు చేజిక్కించుకోగా, పేసర్ లీ తాహుహు 26 పరుగులకు 3 వికెట్లు దక్కించుకుంది. లెగ్ స్పిన్నర్ లెయ్ కాస్పెరిక్ ఒక వికెట్, అమీలియా కెర్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన న్యూజిలాండ్ రెండు వికెట్లు కోల్పోయి 29.2 ఓవర్లలో 153 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ విజయంతో న్యూజిలాండ్, సిరీస్‌లో భారత్ ఆధిక్యాన్ని 2-1కు తగ్గించింది. సూజి బేట్స్ 57(64 బంతులు, ఫోర్లు-8 ఒక సిక్స్) చేసి పూనం యాదవ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్‌కాగా, లారెన్ డోన్ 10(19బంతులు ఒక సిక్స్) పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగింది. నెంబర్ త్రీగా వచ్చిన కెప్టెన్ అమీ సాట్టర్‌వైట్ 66 పరుగులు(74బంతులు, ఫోర్లు-9, ఒక సిక్స్), సోఫీ డివైన్ 17(19బంతులు, ఒక ఫోర్, ఒక సిక్స్) పరుగులతో నాటౌట్లుగా నిలిచి తమ జట్టును విజయ పథాన నిలిపారు. 4వికెట్లు పడగొట్టి భారత్ బ్యాటిం గ్‌ను దెబ్బతీసిన ఆఫ్ స్పిన్నర్ అన్నా పీటర్సన్‌కు ప్లేయర్ ఆఫ ద మ్యాచ్ అవార్డ్ దక్కగా, ప్లేయర్ ఆఫ ద సిరీస్ అవార్డు స్మృతి మంధాన పొందింది. ఇదే మైదానంలో గురువారం జరిగిన పురుషుల వన్డే మ్యాచ్‌లో కూడా భారత్ 92 పరుగులకే ఆలౌట్ కావడమేకాక, ప్రత్యర్థి జట్టు బ్యాట్స్‌మన్ లక్ష్య ఛేదనను కూడా నిలువరించలేకపో యింది. ఫలితంగా సిరీస్‌లో తొలి ఓటమిని రోహిత్ నేతృత్వంలోని జట్టు పొందింది. న్యూజిలాండ్- భారత్ మధ్య టీ20 సిరీస్ 6న వెల్లింగ్టన్‌లో జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానుంది.





న్యూజిలాండ్‌లో సిరీస్ గెలవడం ఆనందంగా ఉంది: మిథాలీ

న్యూజిలాండ్‌లో తొలి సిరీస్‌ను గెలుపొంది నందుకు నాకు సంతోషంగా ఉంది. యువ క్రీడాకారిణులు దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ పరుగులు చేసి రాణించారు. మొత్తంగా సిరీస్‌లో మా బౌలర్లు కూడా రాణించారు. చివరి వన్డేలో ఎక్కువ పరుగులు చేయలేకపోయాం అని మిథాలీ మ్యాచ్ అనంతరం వ్యాఖ్యానించింది.

స్కోరు బోర్డు

భారత్: జెమీమా రోడ్రిగ్స్ (సి) అమీలియా కెర్ (బి) తాహుహు 12, స్మృతి మంధాన (సి) ఎస్ డివైన్ (బి) అన్నా పీటర్సన్ 1, దీప్తి శర్మ (సి) పెర్కిన్స్ (బి) అన్నా పీటర్సన్ 52, మిథాలీ రాజ్ (సి) అన్నా పీటర్సన్ (బి) కాస్పెరెక్ 9, హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) అన్నా పీటర్సన్ 24, దయాలన్ హేమలత (సి) బెర్నాడైన్ (బి) అమీలియా కెర్ 13, తానియా బాటియా ఎల్బీడబ్ల్యు (బి) అమీలియా కెర్ 0, శిఖా పాండే (సి) ఎస్ డివైన్ (బి) అన్నా పీటర్సన్ 8, జులన్ గోస్వామి నాటౌట్ 12, ఎక్తా బిష్త్ ఎల్బీడబ్ల్యు (బి) తాహుహు 3, పూనం యాదవ్ (సి) బెర్నాడైన్ (బి) తాహుహు 1 ఎక్స్ట్రాలు 14 మొత్తం 149 ఆలౌట్(44ఓవర్లు)

వికెట్ల పతనం: 12-1, 13-2, 39-3, 87-4, 117-5, 117-6, 129-7, 138-8, 146-9, 149-10

బౌలింగ్: లీ తాహుహు 9-1-26-3, అన్నా పీటర్సన్ 10-1-28-4, సోఫీ డివైన్ 3-0-8-0, హోలీ హడిలిసన్ 7-0-23-0, లెయ్ కాస్పెరెక్ 5-0-18-1, అమీలియా కె ర్ 10-1-43-2.

న్యూజిలాండ్: సూజి బేట్స్ (బి) పూనం యాదవ్ 57, లారెన్ డోన్ రనౌట్(గోస్వామి) 10, అమీ సాట్టర్‌వైట్ నాటౌట్ 66, సోఫీ డివైన్ నాటౌట్ 17 ఎక్స్ట్రాలు 3 మొత్తం 153/2(29.2 ఓవర్లు)

వికెట్ల పతనం: 22-1, 106-2.

బౌలింగ్:జులన్ గోస్వామి 8-0-26-0, ఎక్తా బిష్త్ 5-0-29-0, శిఖా పాండే 5-0-24-0, దీప్తి శర్మ 4.2-0-19-0, పూనం యాదవ్ 5-1-31-1, దయాలన్ హేమలత 2-0-22-0



ఇంకా పరుగులు సాధిస్తా: మంధాన

ప్లేయర్ ఆఫ ద సిరీస్ దక్కినందుకు సంతోషంగా ఉంది. తొలి రెండు మ్యాచ్‌లు సంతృప్తినిచ్చాయి. ఆ రెండు మ్యాచుల్లో విజయానికి కావలసిన పరుగులు సాధించినందుకు గర్వంగా ఉంది. ఆటలో ఇంకా మేము ఇంకా రాణించాల్సి ఉంది. అంతేకాక వ్యక్తిగతంగా నేను మరిన్ని పరుగులు సాధించడమేకాక, మరిన్ని మ్యాచుల్లోభారత్‌కు విజయాలను అందించాలనుకుంటున్నాను అని మంధాన తెలిపింది.

పుంజుకున్నాం: న్యూజిలాండ్ కెప్టెన్ సాట్టర్‌వైట్



చివరి మ్యాచ్‌లో మేము పుంజుకున్నాము. ఇక ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతాం. నేటి ఆట మాకు సంతృప్తిని చ్చింది.. అని మ్యాచ్ అనంతరం న్యూజిలాండ్ కెప్టెన్ అమీ సాట్టర్‌వైట్ అంది.



మిథాలీ 200 వన్డేల రికార్డు



హామిల్టన్: భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రపంచ క్రికెట్లో 200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డ్ సృష్టించింది. 36 ఏళ్ల మిథాలీరాజ్ అంతర్జాతీయ వన్డేల్లో 51.33 సగటున అత్యధికంగా 6,622 పరుగులు చేసిన క్రీడాకారిణిగా కూడా ఇప్పటికే తన పేర రికార్డును నమోదు చేసుకుంది. శుక్రవారం న్యూజిలాండ్‌తో తన 200వ వన్డే ఆడిన మిథాలీ కేవలం 9 పరుగులు మాత్ర మే చేయగలిగింది. ఇందుకు 28 బంతులను ఎదుర్కొంది. ఈ మ్యాచ్‌లో భారత్ 149 పరుగులకే ఆలౌట్‌కాగా న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలుపొం దింది. మూడు వన్డేల సిరీస్‌లో ఇది చివరి వన్డే. తొలి రెండు వన్డేల్లో గెలిచిన భారత్ సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకుంది. మిథాలీ రెండో వన్డేలో 63 పరుగులు(నాటౌట్) చేసింది.

200 రికార్డు అనేది ఒక సంఖ్య మాత్రమే

16 ఏళ్ల ప్రాయంలో ఉన్నప్పుడు.. 1999లో అంతర్జాతీయ వన్డేల్లోకి ప్రవేశించిన మిథాలీ భారత్ ఆడిన 263 వన్డేల్లో 200 వన్డేల్లో మైదానంలోకి దిగింది. అంతేకాక, మిథాలీ 10 టెస్ట్ మ్యాచ్‌లు, 85 టీ20 మ్యాచ్‌లు కూడా ఆడింది. కెరియర్‌లో తొలి వన్డేను మిల్టన్ కీన్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో ఆడింది. ఈ ఘనతపై మిథాలీ మాట్లాడుతూ.. నాకు 200 రికార్డు అనేది ఒక సంఖ్య మాత్రమే... ప్రపంచ వ్యాప్తంగా విభిన్న మైదానాల్లో ఆడాను. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. నేను క్రికెట్ ఆట మొదలు పెట్టాక ఈ స్థాయికి చేరుకుంటానని అనుకోలేదు. త్రివర్ణ పతాకం చేతబూనడమే నా లక్ష్యం. ఇంకా ఆడతాను అని మిథాలీ తెలిపింది. దీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఆటగాళ్లలో ఒడుదుడుకులు సహజమే.. నన్ను ప్రోత్సహించిన వారందరికి ధన్యవాదాలు అని పేర్కొంది.

పాక్- విండీస్ మహిళా టీ 20 సిరీస్
సూపర్ ఓవర్లో విండీస్ గెలుపు

టీ20 సిరీస్ కైవసం



కరాచి: పాకిస్తాన్ పర్యటనలో ఉన్న వెస్టిండీస్ మహిళా క్రికెట్ జట్టు శుక్రవారం జరిగిన రెండో టీ20లో సూపర్ ఓవర్ ద్వారా విజయం సాధించింది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని తేల్చారు. టాస్ గెలిచిన పాకిస్తాన్ బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఓపెనర్ జవేరియా ఖాన్ 26(28బంతులు, ఫోర్లు-3) బిస్మా సోహైల్ 31(34బంతులు, పోర్లు-2) చేయగా, నిదాదార్ 25(24బంతులు, ఒక ఫోర్, ఒక సిక్స్), అలియా రియాజ్ 23(13బంతులు, ఫోర్లు-3) చేశారు. విండీస్ బౌలర్లలో డియాండ్ర డొటిన్ రెండు వికెట్లు పడగొట్టగా, షకీరా సెల్‌మన్, అనీసా ఫ్లెచర్ చెరొక వికెట్‌ను తీశారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన విండీస్ 6 వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 132 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. విండీస్ బ్యాట్స్‌వుమెన్‌లో షిమేని కాంప్‌బెల్లీ 41(44బంతులు, ఫోర్లు-4, ఒక సిక్స్), కీసియా నైట్ 32(30బంతులు, ఫోర్లు-2 ఒక సిక్స్) చేయగా డియాండ్ర డొట్టిన్ 22(24బంతులు, పోర్లు-5) చేసి జట్టు స్కోరుకు గట్టి పునాది వేసినప్పటికి మిడిలార్డర్, లోవర్ ఆర్డర్ విఫలం కావడంతో.. 20 ఓవర్లలో 132 పరుగులు మాత్రమే చేయగలిగింది. సూపర్ ఓవర్లో విండీస్ 18 పరుగులు చేయడంతో పాక్ మూడు బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి 1 పరుగు మాత్రమే చేసింది. దీనితో విండీస్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను విండీస్ కైవసం చేసుకుంది. సిరీస్‌లో నామమాత్రమైన చివరి మ్యాచ్ ఆదివారం జరుగనుంది. ప్లేయర్ ఆఫ ద మ్యాచ్ అవార్డు షిమేని క్యాంప్‌బెల్లీకు లభించింది.

తొలి టీ 20లో దక్షిణాఫ్రికా విజయం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న శ్రీలంక మహిళా క్రికెట్ జట్టు ఆతిథ్య దేశంతో ఆడిన తొలి టీ20లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మూడు మ్యాచుల సిరీస్‌లో తొలి మ్యాచ్ న్యూలాండ్స్‌మైదానంలో జరిగింది. దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి శ్రీలంక బ్యాటింగ్ చేపట్టి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. హసీనా పెరీరా చేసిన 27 పరుగులే అత్యధికం. దక్షిణాఫ్రికా బౌలర్లలో డేన్ వాన్ నికెర్క్ 3/12, మాసాబాటా క్లాస్ 2/22, తుమి సెకుకునే 1/18 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 3 వికెట్లు కోల్పోయి 14.2 ఓవర్లలో 94 పరుగులు చేసి గెలుపును అందుకుంది. నికెర్క్ 71 పరుగులు(55బంతులు, 13 ఫోర్లు) చేసి నాటౌట్‌గా ఉండి జట్టుకు విజయాన్ని అందించింది. ప్లేయర్ ఆఫ ద మ్యాచ్ అవార్డు నికెర్క్‌కు లభించింది.

డేవిస్ కప్ ఫైనల్స్ క్వాలిఫయర్స్
ఆరంభంలోనే ఎదురు దెబ్బ

- *సింగిల్స్ మ్యాచుల్లో భారత్ ఓటమి*
- *ఇటలీ 2-0తో ముందంజ*



కోల్‌కతా: డేవిస్ కప్ క్వాలిఫయర్ ప్రారంభ మ్యాచ్‌లో భారత్ పేలవమైన ప్రదర్శన చేసింది. గ్రాస్ కోర్టులో భారత ఆటగాళ్లు బాగా ఆడతారని ఆశించినప్పటికి.. నిరాశే ఎదురైంది. శుక్రవారం కల్‌కత్తా సౌత్ క్లబ్ కోర్టులో ప్రారంభమైన డేవిస్ కప్ ఫైనల్స్ క్వాలిఫయర్ సింగిల్స్ పోటీల్లో ఇటలీ గెలిచి 2-0 ఆధిక్యాన్ని సాధించింది. ఆండ్రియాస్ సెప్పీ ప్రారంభంలో కొంచెం తడబడ్డప్పటికి.. రామ్‌కుమార్ రామనాథన్ ను 6-4, 6-2 తేడాతో ఓడించాడు. మరో సింగిల్స్ పోరులో మాజీ భారత నెంబర్ వన్ ప్రజ్నేష్ గుణేశ్వర న్ 4-6, 3-6 తేడాతో ఇటలీ ఆటగాడు మాటెవో బెరెట్టిని చేతిలో పరాజయం పాలయ్యాడు. గంటా పదకొం డు నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో రామ్‌కుమార్ రామనాథన్‌పై ఆండ్రి యాస్ సెప్పీ పైచేయి సాధించాడు. ఎదురులేని సర్వీస్‌లకు మారుపేరయిన రామ్‌కు మార్ ఎనిమిది ఏస్‌లు సాధించినప్పటికిఫలితంలేకపోయింది. బలహీనమై న రిటర్న్‌లు అతన్ని వెనకబడేలా చేశాయి. తొలి సెట్లో రెండు బ్రేక్ పాయింట్లను కూడా పాయింట్‌గా మలచడంలో రామ్‌కుమార్ విఫలమయ్యా డు. 41 నిమిషాలపాటు సాగిన తొలి సెట్లో రామ్‌కుమార్ 4-6తేడాతో ఓడాడు. రెండో సెట్లో నామ మాత్రమైన ప్రదర్శనగా సాగింది. రామ్‌కువమార్ 2-6తేడాతో ప్రత్యర్థికి సెట్‌ను కోల్పోయాడు. మరో సింగిల్స్ మ్యాచ్ తొలి సెట్లో ప్రజ్నేష్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన బెరెట్టిని పాయింట్‌ను పొందాడు. అనంతరం ఇరువురు పోటాపోటీగా సాగారు. బెరెట్టిని తన సర్వీసులను నిలబెట్టుకుంటూ తొలిసెట్‌ను 6-4తో గెలుచుకు న్నాడు. రెండోసెట్లో కూడా బెరెట్టిని 1-0 లీడ్‌ను పొందాడు. బెరెట్టిని కొట్టిన గ్రౌండ్ షాట్లకు ప్రజ్నేష్ వద్ద సమాధానం లేకపోయింది. ప్రేక్షకులు తమ హర్షధ్వానాలతో ప్రజ్నేష్‌ను ఉత్సాహపరిచినప్పటికి ఫలితంలేకపోయింది. బెరెట్టిని 5-3తో దూసుకుపో యాడు. చివర్లో ప్రజ్నేష్ తప్పిదం చేయడంతో బెరెట్టినికి లాభించిం ది.6-3తోసెట్‌ను గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నా డు. ఇలాంటి గెలుపు అందుకోవాలని నేను బాల్యం నుంచి కలలు కన్నాను. నా శైలిలో ఆడుతూ విజయం సాధించాను అని మ్యాచ్ అనంతరం బెరెట్టిని వ్యాఖ్యానించాడు.

ఈ ఓటములతో భారత్ 0-2తో వెనకబడ్డ నేపథ్యంలో శనివారం జరిగే డబుల్స్ పోటీల్లో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జోడీ తప్పని గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటలీ తరఫున టాప్ ర్యాంక్ సింగిల్స్ ఆటగాళ్లు మార్కో సెచినాటో, సిమోన్ బొలెల్లీతో కలిసి బరిలోకి దిగుతున్నాడు. నేటి మ్యాచ్ భారత జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేష్ భూపతి మాట్లాడుతూ.. ఇంకా పరిస్థితులు చేయి దాటిపోలేదు. శనివారం జరిగే పోటీల్లో గెలవాల్సి ఉంటుంది. గత ఏడాది

నేటి డబుల్స్ మ్యాచ్‌లు కీలకం: భూపతి

ఆసియా/ఒషియానా గ్రూప్ 1 రబ్బర్ ఈవెం ట్‌లో భారత్ ఇదే పరిస్థితిలో ఉండి చైనాపై 3-2తో విజయం సాధించిందని భూపతి గుర్తు చేశాడు. ఇటలీ క్రీడాకారులు చాలా అనుభవమున్న ఆటగాళ్లు. మనకు లభించిన అవకాశాలను ఉపయో గించుకుంటే విజయం తథ్యం. దేశం తరఫున ఆడుతున్న సమయంలో ఒత్తిడి ఎలా ఉంటుందో నాకు తెలుసు. అనుకోని ఘటనలు ఎదుర వుతాయి. చైనాలో అదే జరిగింది. చైనా కంటే ఇటలీ క్రీడాకారు లు శక్తివంత మైనవారు. అయినా మా జట్టు గెలుస్తుంది అని భూపతి విశ్వాసం వ్యక్తం చేశాడు.





క్రీడా బడ్జెట్
214 కోట్లు పెరిగింది

- *2019-2020 ఏడాదికి మొత్తం కేటాయింపులు రూ. 2216.92 కోట్లు*

న్యూఢిల్లీ: రానున్న ఆర్థిక సంవత్సరం(2019-2020) బడ్జెట్‌లో క్రీడల కేటాయింపులు పెరిగాయి. ప్రస్తుత ఏడాదితో పోలిస్తే 214.20 కోట్లు ఎక్కువగా కేంద్రం కేటాయించింది. ఈ పెరిగిన మొత్తంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)కోసం నిధులు, క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయి. శుక్రవారం ఆర్థిక మంత్రి పీయూష్‌గోయల్ 2019-2020 ఏడాదిగాను మధ్యంతర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టాడు. మొత్తంగా క్రీడల కేటాయింపులు 2002.72 కోట్లు(2018-19) నుంచి 2216.92 కోట్లకు(2019-2020) పెంచారు. ఈ పెంచిన కేటాయింపులతో లబ్ది పొందే విభాగాల్లో సాయ్, నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎన్ఎస్‌డీఎఫ్), క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహక మొత్తాలకుద్దేశించిన కార్పస్ నిధుల విభాగాలున్నాయి. సాయ్‌కు కేటాయింపులు రూ.55 కోట్లు పెరిగాయి. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఈ మొత్తం రూ.395కోట్లుండగా తాజా ప్రతిపాదనల్లో అది రూ.450కోట్లుకు పెరిగింది. జాతీయస్థాయిలో క్యాంపుల నిర్వహణ, దేశవ్యాప్తంగా క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలు, ఇతర సామాగ్రిని సాయ్ అందిస్తుంది. ఎన్ఎస్‌డీఎఫ్ బడ్జెట్‌ను (ప్రస్తుత ఏడాది) రూ.2 కోట్ల నుంచి 2019-2020 సంవత్సరానికి రూ.70కోట్లకు పెంచారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహక మొత్తాలను కూడా కేంద్ర మంత్రి పెంచారు. ప్రస్తుత ఏడాది కేటాయింపులు రూ. 63 కోట్లనుంచి రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.89 కోట్లకు పెంచారు. అయితే దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ క్రీడా సమాఖ్యలకు(ఎన్ఎస్ఎఫ్) ఆర్థిక సహాయంలో కోత పెట్టారు. ప్రస్తుత ఏడాది ఇది రూ.245.13 కోట్లుండగా, 2019-2020కి గాను రూ. 245 కోట్లను కేటాయించారు. ఓవరాల్‌గా క్రీడాకారుల అవార్డులకిచ్చే కేటాయింపులు ఇతర ప్రోత్సాహకాల్లో కేటాయింపులు ప్రస్తుత ఏడాదిలోని మొత్తం రూ.316.93 కోట్ల నుంచి రానున్న ఆర్థిక ఏడాదిగాను రూ. 411కోట్లుగా నిర్ణయించారు. దేశంలో గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకుద్దేశించిన ఖేలో ఇండియా జాతీయ క్రీడల అభివృద్ధి కార్యక్రమానికి కూడా కేటాయింపులు పెరిగాయి. ప్రస్తుత ఏడాదిలోని రూ. 550.69 కోట్ల నుంచి రూ. 601కోట్లకు పెంచారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

అరుణ్‌జైట్లీ బదులు పీయూష్ గోయల్ బడ్జెట్ సమర్పణ





ఆర్థిక మంత్రులు అనారోగ్యాలు!

ఇదేమీ కొత్తకాదు

ఈ ఏడాది పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వపు చివరి బడ్జెట్ ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టవలసి ఉంది. అయితే ఆయన అనారోగ్యం కారణంగా ఆయనకు బదులుగా తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయుష్ గోయల్ బడ్జెట్ ని ప్రవేశపెట్టారు. అత్యంత ముఖ్యమైన ఒక చారిత్రక సందర్భానికి జైట్లీని దూరంగా ఉంచింది అనారోగ్యం. అరుణ్ జైట్లీయే కాదు...గత బుధవారం నాడు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్ సైతం అనారోగ్యంతో బాధపడుతూ...ముక్కులో ట్యూబ్ ఉండగానే బడ్జెట్ ని ప్రవేశపెట్టారు. వీరే కాదు...ఆర్థిక మంత్రులు అస్వస్థతకు గురయిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. అయితే ఈసారి జైట్లీ ఆనారోగ్యం...ప్రత్యామ్నాయంగా మరొకరు బడ్జెట్ ని ప్రవేశపెట్టేలా చేసింది.



కిడ్నీ మార్పిడి అనంతరం తిరిగి విధుల్లోకి...

బడ్జెట్ రూపకల్పనలో దానిపైన వచ్చే విమర్శలను ఎదుర్కోవటంలో ఆర్థిక మంత్రి...ప్రత్యక్షంగా తెరపైన కనబడినా....దానివెనుక ఎంతోమంది పనిచేస్తారు. దాని ప్రభావాన్ని కూడా ప్రభుత్వంలోని అన్ని శాఖలూ భరిస్తాయి. అయితే తెర వెనుక ఎంతమంది పనిచేసినా సినిమా తెరమీద హీరోనే హైలెట్ అయినట్టుగా బడ్జెట్‌ని ప్రవేశపెట్టేరోజు ఆర్థికమంత్రే...అత్యంత ముఖ్యుడు. బడ్జెట్...అనగానే మనకు వేలు లక్షలు కోట్లు...ఇలా అంకెలే మొదట గుర్తొస్తాయి. సంపాదించడం కంటే...ఎవరెవరికి ఎంత ఇవ్వాలి...అనేది నిర్ణయించడం చాలాకష్టం. ఇంటికైనా దేశానికైనా ఇదే వర్తిస్తుంది. సంవత్సరానికి ఒకసారి దేశ, రాష్ట్రా ల ఆర్థిక మంత్రులకు ఆ కష్టాలు తప్పవు. బడ్జెట్ చుట్టూ ఉన్నవి అంకెల్లాగే కనిపిస్తాయి కానీ బడ్జెట్‌తో రాజకీయాలు సైతం అనుసంధానమై ఉంటాయి. బడ్జెట్ భిన్న వర్గాల ప్రజా జీవితాలను ఎంతగా ప్రభావితం చేస్తుందో...అంతగానూ అధికార ప్రతిపక్ష పార్టీలను ప్రభావితం చేస్తుంది. బడ్జెట్ అంటే అంకెలు గారడీల రాజకీయాలే కాదు...ప్రజల ఎమోషన్లు...ఆశలు నిరాశలు...ఎవరికి న్యాయం జరిగింది...ఎవరికి అన్యాయం జరిగింది... అనే ప్రశ్నలు బడ్జెట్ ప్రసంగంలోని ప్రతి అక్షరానికి ఎదురవుతూనే ఉంటాయి. అందుకే ఎన్నికల చుట్టూ ఎంత టెన్షన్ నెలకొని ఉంటుందో బడ్జెట్ చుట్టూ కూడా అంతేస్థాయి ఉత్కంఠభరితమైన వాతావరణం ఉంటుంది. ఇక అలాంటి బడ్జెట్‌ని తయారుచేస్తున్నపుడు ఆర్థిక మంత్రులకు ఎంతో కొంత టెన్షన్, ఒత్తిడి ఉండటం సహజమే. ఎంతగా కసరత్తులు చేసినా...అందరికీ న్యాయం జరిగింది...అనిపించుకోవటం అసాధ్యమే. అయినా ఎక్కువశాతం ప్రజలనోట బడ్జెట్ బాగుంది...అనిపించాలనే తపన ఆర్థికమంత్రులకు ఉంటుంది.

గంట 45 నిముషాల కాలవ్యవధిలో పూర్తి చేయాల్సి ఉండటం, మధ్యలో భిన్న అంశాలపై అధికార ప్రతిపక్షాల నుండి వచ్చే పాజిటివ్ నెగెటివ్ ప్రతిస్పందలు...వీటన్నింటి నడుమ...బడ్జెట్ సమర్పణ ఆషామాషీ వ్యవహారం కాదని చెప్పవచ్చు. ఇవన్నీ కాకుండా బడ్జెట్‌ని ప్రవేశపెట్టేది చలికాలం కావటం,...ఆర్థిక మంత్రులు అందరూ సీనియర్ రాజకీయ నేతలే అయిఉండటం వలన కూడా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటన్నింటితో పాటు బడ్జెట్ ప్రసంగం ఒకరకంగా కత్తిమీద సాము లాంటిదే. కేటాయింపులు ఎలా ఉన్నాయి... అనేది ఒక విషయమైతే...ఎవరినీ నొప్పించకుండా, వినేవారికి విసుగు పుట్టించకుండా, తమ ప్రభుత్వ విధానాలను నొక్కి చెబుతూ...అందంగా ఆకట్టుకునేలా ప్రసంగం ఉండాలి. ఇవన్నీ ఆర్థిక మంత్రిపైన ఉండే భారాలే.

టెన్షన్..స్వల్ప అనారోగ్యాలు


బడ్జెట్ రూపకల్పనలో ఒకవైపు ప్రజలకు న్యాయం చేయాలి..మరొకవైపు అధికార పక్షాన్ని ఆ మేరకు ప్రజలకు దగ్గర చేయాలి. అన్ని శాఖల మంత్రులను సమన్వయ పరుచుకుని వారినుండి సేకరించిన వివరాలతోనే బడ్జెట్ రూపకల్పన జరిగినా...పరీక్షల ఫలితాలు వెల్లడించే సమయంలో ఉండే టెన్షన్...ఆర్థిక మంత్రికి బడ్జెట్‌ని ప్రవేశపెడుతున్నపుడు ఉంటుంది. ఆ టెన్షన్ వల్లకానీ, ఇతర అనారోగ్య సమస్యల వలన కానీ...ఆర్థిక మంత్రులు బడ్జెట్‌ని ప్రవేశపెడుతున్నపుడు స్వల్ప అనారోగ్యానికి గురికావటం చాలా సందర్భాల్లో జరిగింది. పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నపుడు మన్మోహన్ సింగ్, తమిళనాడులో జయలలిత, వాజ్‌పేయి ప్రభుత్వంలో జస్వంత్ సింగ్, హర్యానాలో చౌతాలా... ఇలా బడ్జెట్ సమయంలో బిపిలో హెచ్చుతగ్గులు, అలసట వంటి స్వల్ప అనారోగ్యాలకు గురయ్యారు. బడ్జెట్ సమర్పణ మొత్తం... ఒక

బడ్జెట్ ప్రవేశపెట్టని ఆర్థికమంత్రులు

కెసి నియోగి, హెచ్ ఎన్ బహుగుణ ఈ ఇద్దరు ఆర్థిక మంత్రులు మాత్రమే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయారు. రెండు బడ్జెట్ల నడుమ కాలంలో చాలా కొద్దికాలం మాత్రమే పదవిలో ఉండటం వలన వీరు బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేకపోయింది. ముఖ్యంగా మనదేశ రెండవ ఆర్థిక మంత్రి నియోగి కేవలం 35 రోజులు మాత్రమే బాధ్యతల్లో ఉన్నారు. ఇప్పుడు ఆర్థికమంత్రిగా ఉంటూ కూడా బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయిన వ్యక్తి అరుణ్ జైట్లీ. కాబట్టి ఈ జాబితాలో అరుణ్ జైట్లీ పేరు కూడా చేరింది.

అరుణ్ జైట్లీ...అనారోగ్యంతో బాధపడుతూనే

అరుణ్ జైట్లీ వరుసగా 2014నుండి గత ఏడాది వరకు బడ్జెట్‌ని ప్రవేశపెడుతూ వస్తున్నారు. 2014-15 బడ్జెట్ ప్రసంగం చేస్తున్న సమయంలో జైట్లీ మధ్యలో ఐదు నిముషాల పాటు విరామం కావాలని కోరారు. బడ్జెట్ ప్రసంగంలో విరామం తీసుకోవటం అనేది సాధారణంగా జరగదు. ఆర్థిక మంత్రులు నిలబడే అనర్గళంగా చదువుతుంటారు. అరుణ్ జైట్లీకి స్పీకర్ సుమిత్రా మహాజన్ ఐదు నిముషాల పాటు కూర్చునేందుకు అనుమతి ఇచ్చారు. అప్పటికే ఆయన ఆరోగ్యం సరిగ్గా లేదు. ఆ తరువాత సంవత్సరం ఆయన కాస్త ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేశారు. జైట్లీ టేబుల్‌కి పోడియంని ఏర్పాటు చేసింది...ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయం. ఒకవేళ ప్రసంగంలో భాగంగా పేపర్లను చూడాల్సి వచ్చినా...కిందకు వంగకుండా ఉండటం కోసం ఆ ఏర్పాటు. 2015వ సంవత్సరపు బడ్జెట్ ప్రసంగాన్ని జైట్లీ సుదీర్ఘంగా ఇచ్చారు. 1991లో మన్‌మోహన్ సింగ్ చేసిన ప్రసంగం తరువాతి స్థానంలో ఈ ప్రసంగం ఉంది. 2016లో స్పీకర్ అనుమతితో ఆయన కూర్చునే బడ్జెట్ ప్రసంగం చేశారు. అప్పటికే ఆయన కిడ్నీ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు.



జస్వంత్



జయలలిత

చాలా కాలంగా మధుమేహంతో బాధపడుతున్న అరుణ్ జైట్లీ బరువు పెరుగుదలను ఆపేందుకు 2014లో బేరియాట్రిక్ సర్జరీని చేయించుకున్నారు. అయితే ఆ సమయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. చికిత్స అనంతరం... ఆ తరువాత ఆయన గత ఏడాది వరకు వరుసగా నిరంతరాయంగా బడ్జెట్‌ని ప్రవేశపెట్టగలిగారు. అయితే గత ఏడాది మే 14న ఆయనకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగింది. ఆసుపత్రిలో ఉండగానే జైట్లీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఫేస్‌బుక్ పోస్టుని చేశారు. తన క్షేమానికి కోరుతున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్య కారణాలతో గత ఏడాది ఏప్రిల్ నుండి ఆఫీస్‌కి రావటం మానేసిన అరుణ్ జైట్లీ...నార్త్ బ్లాక్ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆఫీస్‌లో ఉన్న తన సీటుకి తిరిగి ఆగస్టు 23న వచ్చారు. ఈ ఏడాది గతనెల 13న అనుకోకుండా ఆయన మరోసారి ఆరోగ్యపరీక్షలకోసం అమెరికా వెళ్లారు. ఆయనకు సాఫ్ట్ టిష్యూ క్యాన్సర్‌కి ఆపరేషన్ జరిగినట్టుగా, వైద్యులు రెండువారాలు విశ్రాంతి తీసుకోమని చెప్పినట్టుగా తెలుస్తోంది. జైట్లీతో మాట్లాడానని ఆయన వేగంగా కోలుకుంటున్నారని పీయుష్ గోయల్ ఇటీవల వెల్లడించారు.



ముక్కులో ట్యూబ్ తో జోష్‌గా ఉన్నానంటూ బడ్జెట్ ప్రసంగం చేసిన గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్

బడ్జెట్ ప్రవేశపెట్టి....తిరిగి ఆసుపత్రికి

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్ సైతం పాంక్రియాస్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయన గత ఏడాది ఫిబ్రవరి నుండి గోవా, ముంబయి, ఢిల్లీ, న్యూయార్కుల్లో ఆసుపత్రి లోపల బయటా అన్నట్టుగా జీవితం సాగిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరి 14న కడుపు నొప్పితో పారీకర్ ఆసుపత్రిలో చేరారు. ఆ తరువాత పాంక్రియాస్ క్యాన్సర్ అని తేలటంతో చికిత్స తీసుకుంటున్నారు. ఆర్థిక శాఖని కూడా నిర్వహిస్తున్న పారీకర్ గత బుధవారం నాడు రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాల్లో...ముక్కులో ట్యూబుతోనే బడ్జెట్‌ని ప్రవేశపెట్టి ప్రసంగం చేశారు. బడ్జెట్‌ని పూర్తి జోష్‌తో ఉత్సాహంతో ఉత్తేజంతో ప్రవేశపెడుతున్నట్టుగా ఆయన చెప్పుకొచ్చారు. అనంతరం చికిత్సకోసం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కివెళ్లారు. గత కొంతకాలంగా ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ పారీకర్ ఆరోగ్యం గురించి వెల్లడించాలంటూ పట్టుబడుతోంది. దాంతో రాష్ట్ర బిజెపి పార్టీ పారీకర్ ఫొటో ఒకటి విడుదల చేసింది. ఆయన బాగానే ఉన్నారని, తమకు మార్గనిర్దేశనం చేస్తున్నారని రాష్ట్ర రవాణా మంత్రి వెల్లడించారు. గోవా అసెంబ్లీ సమావేశాలు, అటల్ సేతు బ్రిడ్జి ప్రారంభోత్సవం కారణంగా ఆయన చికిత్స ఆలస్యమయిందని తెలుస్తోంది.

వ్యాధులు కబళిస్తున్నా... దేశానికి దిక్సూచి

ఆస్ట్రేలియా ఆర్థికమంత్రి విజయగాథ

జార్జ్ టర్నర్ ఆస్ట్రేలియాకి మొదటి ట్రెజరర్(ఆర్థిక మంత్రి). దేశంలో బడ్జెట్ అంటే కేవలం నిధులను కేటాయించే విభాగం మాత్రమే కాదు. ఆర్థిక నిర్వహణ కోణంలోనే కాకుండా పనిచేయాలని చెప్పినవారు. అందుకే ఆయన ట్రెజరర్‌గా ఎప్పటికీ మరచిపోలేని వ్యక్తిగా పేరు సంపాదించుకోగలిగారు. అప్పటివరకు డబ్బుల లెక్కలంటే ఎకౌంటింగ్ అనే అభిప్రాయం ఉన్న సమయంలో బడ్జెటింగ్ అనేది ఒక సంపూర్ణ ఆర్థిక వ్యవస్థ అని చెప్పగలిగిన ఘనత ఆయనది. పలుసార్లు ఆయనకు ఆరోగ్యం సహకరించేది కాదు. పూర్తిగా అనారోగ్యంగా ఉన్న సమయంలోనూ ఆయన ట్రెజరర్‌గా తన బాధ్యతలు నిర్వహించారు.

జార్జ్ టర్నర్ 1851, ఆగస్ట్ 8న మెల్‌బోర్న్‌లో జన్మించారు. 14 ఏళ్ల వయసులోనే రాజకీయ ప్రవేశం చేశారు. ఆర్టికల్డ్ క్లర్క్ అనే కోర్సు పూర్తి చేసి 1881లో అటార్నీలో చేరారు. 1872 లో రోసా మోర్గాన్ అనే మహిళను వివాహం చేసుకున్నారు. ఆమె అతని ఉన్నతిలో ప్రతి అడుగులోనూ తోడున్నారు. రాజకీయాల్లో త్వరితంగా అడుగులు వేసుకుంటూ మంత్రిత్వ శాఖకు ఎదిగారు. 1891 లో ట్రేడ్ అండ్ కస్టమ్స్ ఆస్ట్రేలియా కమీషనర్‌గా నియామకం పొందారు. 1892 నుంచి సొలిసిటర్ జనరల్‌గా ఉన్నారు. తర్వాత ట్రెజరీ విభాగం తీసుకోవాల్సి వచ్చింది. అతని కష్టపడే మనస్తత్వంవలన, నమ్మకంగా, చిత్తశుద్ధితో పనిచేసేతత్వం వలన అన్ని పార్టీల నాయకులకు, గెలిచిన ప్రతి ప్రధాన మంత్రికి టర్నర్ ట్రెజరర్‌గా మొదటి ఛాయిస్‌లో ఉండేవారు. ట్రెజరర్‌గా బాధ్యలు తీసుకున్నాక మొత్తం ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్టేట్ ట్రెజరర్‌గా ఆయన ట్రెజరరీ విభాగం ఎంచుకున్నప్పటికి విక్టోరియా ప్రభుత్వం నిరుద్యోగం, లోటు బడ్జెట్ సమస్యలతో ఉంది. అటువంటి సమయంలో ఆ పరిస్థితులను నియంత్రించుకుంటూ 1896లో మొదటి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత టర్నర్‌దే. ఇతర ఖర్చులను నియంత్రించి విద్య, రక్షణ శాఖ మీద ఎక్కువ ఖర్చుపెట్టాలని చెప్పారు. మొదటిసారిగా గ్రాడ్యుయేటెడ్ ఆదాయపు పన్నును ప్రవేశపెట్టారు. అంటే ప్రజలు వారి సంపాదించే ప్రతి ఆదాయం మీద కొంత శాతం పన్ను రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలి. స్థానిక సేవింగ్స్ బ్యాంకులను స్టేట్ సేవింగ్స్ బ్యాంకులుగా మార్చారు. దాని వలన రాష్ట్రం ఆర్థికంగా పుంజుకుంది. 1897లో రెండోసారి బడ్జెట్ సమయానికి లోటు బడ్జెట్ సమస్య కొంతవరకు తీరింది. 1899లో

టర్నర్ మద్దతునిచ్చిన ప్రభుత్వం పడిపోయింది. అయినా 1900ఎన్నికలలో మళ్లీ పదవి చేజిక్కించుకున్నారు. శాసనసభలో వృద్ధాప్య పెన్షన్లు ప్రవేశపెట్టారు. తర్వాత రాజీనామా చేసి 1901లో ఫెడరల్ పాలిటిక్స్‌లో ప్రవేశించారు. మొదటి ఫెడరల్ ఎన్నికల తర్వాత తాత్కాలిక క్యాబినెట్‌లో ట్రెజరర్‌గా నియమింపబడ్డారు. టర్నర్‌నే ఎందుకు నియమిస్తున్నారనే దానిమీద అప్పటి ప్రధానమంత్రి వివరణ ఇచ్చారు. టర్నర్‌కు కస్టమ్స్, ఫైనాన్స్, కామన్‌వెల్త్ రుణాలు, స్టేట్ లోన్స్, ఇటువంటి అన్ని విషయాల మీద పట్టు ఉంది. అందుకే అతన్ని మళ్లీ నియమిస్తున్నామని తెలిపారు. ట్రెజరర్‌గా తన బాధ్యత ఆయనకు జీవితాశయంగా మారింది.



ప్రత్యేకంగా ట్రెజరీ విభాగం ఏర్పాటుకు టర్నర్ బాగా కృషిచేశారు. మొత్తం 20మంది నిపుణులను తన విభాగంలో చేర్చుకుని అధికారికంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. లెడ్జర్‌ను తయారు చేయడం, ఎకౌంట్స్ ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం ట్రెజరీలో ముఖ్య భాగమని అతని అభిప్రాయం. 1901-02 లో ఫెడరల్ ట్రెజరర్‌గా తన మొదటి బడ్జెట్ ప్రసంగాన్ని వినిపించారు. స్టేట్ బడ్జెట్‌తో పోలిస్తే ఫెడరల్ బడ్జెట్ తయారు చేయడం ఎంత కష్టమో చెప్పారు. అదనపు నిధులు ఇవ్వడం కంటే అనవసర ఖర్చులు తగ్గించుకోవాలనే విషయాన్ని గట్టిగా చెప్పారు. అది అందరినీ ఆకట్టుకుంది. 1902 సెప్టెంబర్ 23న తన రెండవ బడ్జెట్ స్పీచ్ ఖర్చులు, ఆదాయం మీద సుదీర్ఘ చర్చలా సాగింది. ఎదురైన అన్ని ప్రశ్నలకు దీటుగా జవాబునిచ్చి తన బడ్జెట్‌ను విజయవంతంగా ప్రవేశపెట్టారు. 1903 జూలై 28న తన మూడవ బడ్జెట్‌లో ఫెడరేషన్ ఏర్పాటు ముందు, తర్వాత పరిస్థితుల మీద ప్రసంగం సాగింది. టర్నర్ ట్రెజరర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు కరువుల వలన, ప్రపంచ ఆర్థిక సంక్షోభం వలన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చాలా దారుణంగా ఉంది. 1902లో వచ్చిన ఇంకో కరువు కూడా దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది. అయినా ట్రెజరర్‌గా టర్నర్ బడ్జెట్‌లను సమర్థవంతంగా నిర్వహించారు. ఇంతకూ టర్నర్ గొప్పగా వక్త కాదు. రాయడంలో దిట్ట కాదు. ఆయన బడ్జెట్ ప్రసంగాల్లో కవిత్వాలు లేవు. పైగా ఆయన తన మొదటి బడ్జెట్‌ను షేవింగ్ పేపర్ మీద రాసుకు వచ్చారని ఇంకో కథనం కూడా ఉంది. పార్లమెంటరీ ప్రసంగాలలో ఆర్థిక, వ్యాపార అంశాలు మాట్లాడేటప్పుడు మాటలు తడుముకునేవారు.

అయినా కూడా ట్రెజరర్‌గా ఆయన బాగా పనిచేస్తున్నారని నమ్మి 1903 ఎన్నికల్లో కూడా ఎదురు లేకుండా మళ్లీ ట్రెజరర్‌గా పదవిని ఆయనకే కట్టబెట్టారు. ట్రెజరర్‌గా అతని మొదటి కాలపరిమితి 1904, ఏప్రిల్‌లో పూర్తయింది. మళ్లీ ఎన్నికయిన ప్రభుత్వం టర్నర్‌కు సీనియర్ ప్రొటెక్షనిస్ట్ పదవి ఇస్తానంటే తీసుకోలేదు. ఆ సమయంలో రెండు ఆపరేషన్ల తర్వాత చాలా రోజుల పాటు స్పృహలో లేరు. అటువంటి అనారోగ్య సమయంలోనూ రెండవ టర్మ్‌లో కూడా ఆయన్ని ట్రెజరర్‌గా ఉండమని పిలిచారు. అలానే అనారోగ్యంతోనే 1904 బడ్జెట్‌ను తీసుకువచ్చారు. ఆ ప్రసంగంలో కూడా ఫెడరల్ ప్రభుత్వం నుంచి రాష్ట్రాలు ఎలా లబ్ది పొందగలుగుతున్నాయో తెలిపారు. తర్వాత బడ్జెట్ బాధ్యతలను జాన్ ఫారెస్ట్ అనే అతనికి అప్పచెప్పారు. 1906 ఎన్నికలకి టర్నర్ రిటైర్ అయారు. 1916 ఆగస్టు 13న 65 ఏళ్ల వయసులో చనిపోయారు.

-లైఫ్ డెస్క్

ముద్రవేసిన మంత్రులు

అటు కేంద్రం...ఇటు రాష్ట్రం.. .ప్రభుత్వాలు ఏవైనా ఆర్థిక శాఖ కీలక భూమిక పోషిస్తుందనడం అతిశయోక్తికాదేమో!


కాకతాళీయమే అయినా.. కేంద్రంలో ఆర్థిక శాఖను నిర్వహించిన వారు దేశాప్రధానులు, రాష్ట్రపతులు అయిన తీరు కూడా.. ఆర్థిక శాఖ ప్రాధాన్యతను చెప్పకనే చెబుతోంది. ఎందుకంటే..దేశ భవిష్యత్తును నిర్దేశించే బడ్జెట్ రూపకల్పన అంత ఈజీ కాదు. ఆర్థిక మంత్రులకు ఎంతో ప్రతిభా పాటవాలు ఉంటే తప్ప.. జనరంజకంగా బడ్జెట్ రూపొందించలేరు.. బడ్జెట్ రూపకల్పనలో అధికారులే కీ రోల్ పోషించినా..మార్గనిర్దేశం చేయాల్సింది మాత్రం ఆర్థిక మంత్రులే! బడ్జెట్‌కు దిశానిర్దేశం చేయడం అంటే పరోక్షంగా దేశ భవిష్యత్తుకు బాటలు వేయడమే. అరుణ్ జైట్లి అనారోగ్యం కారణంగా పీయూష్ గోయల్ మధ్యంత బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో...పార్లమెంట్ చరిత్రలో..ఎలాంటి ఈతిబాధలు ఎదుర్కోకుండా సమర్థవంతంగా...బడ్జెట్ ప్రవేశ పెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రుల గురించి ఓ సారి మననం చేసుకుందాం!

ప్రధానులైన కేంద్ర మంత్రులు

ప్రస్తుతం మధ్యంతర బడ్జెట్ ప్రవేశ పెట్టిన పీయూష్ గోయల్‌తో కలుపుకుని 1947 నుంచి ఇప్పటి వరకు 24మంది కేంద్ర ఆర్థిక శాఖను నిర్వహించారు. తమతమ పరిధిలో సమర్థవంతంగా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి సెహబాష్ అనిపించుకున్నారు. మనం మొదట చెప్పుకున్నట్లుగానే ఎంతో కీలకమైన ఆర్థిక శాఖను నిర్వించిన వారిలో మొరార్జీదేశాయ్, ఇందిరాగాంధీ, చరణ్‌సింగ్, వి.పి.సింగ్, రాజీవ్ గాంధీ, మన్‌మోహన్ సింగ్‌లు ఆ తర్వాత కాలంలో ప్రధానులు కావడం గమనార్హం. అలాగే కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన ఆర్.వెంకట్రామన్, ప్రణబ్ ముఖర్జీ దేశాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించడం విశేషం.

అందరూ..సమర్థవంతులే!

ముంచుకొస్తున్న 2019 సార్వత్రిక ఎన్నికలు....మధ్యంతర బడ్జెట్... ఆర్థిక మంత్రిగా ఉన్న అరుణ్ జైట్లి ఆనారోగ్యం.. ...ఆర్థిక శాఖ బాధ్యతను భుజాన వేసుకున్న పీయూష్ గోయల్...లోక్ సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన వైనం.... కేంద్ర ఆర్థిక మంత్రులు



మొరార్జీదేశాయ్



చిదంబరం



ప్రణబ్ ముఖర్జీ



మన్మోహన్ సింగ్

పనితీరు చర్చనీయాంశంగా మారింది. అరుణ్ జైట్లిలాగా అనారోగ్య కారణాల రీత్యా బడ్జెట్‌కూ దూరంగా ఉన్నవారు ఎవరైనా ఉన్నారా? అన్న సరికొత్త చర్చకు..మునుపెన్నడు లేనివిధంగా తెరలేచిందనే చెప్పాలి. గడిచిన రెండున్నర దశాబ్దాల కాలంలో..పీవీ నర్సింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మాజీప్రధాని మన్మోహన్ సింగ్..మాత్రం కాస్త అనారోగ్యానికి గురైనప్పటికి....తన బాధ్యత తానే నిర్వర్తించారు. అంతకు మినహా ప్రస్తుత పరిస్థితి ఎప్పుడూ తలెత్తిన దాఖలాలు కనిపించవు!

యశ్వంత్ సిన్హా

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా యశ్వంత్ సిన్హా రెండు పర్యాయాలు పనిచేశారు.1990-1991మధ్య కాలంలో ప్రధాని చంద్రశేఖర్ మంత్రివర్గంలో, 1998-2002 మధ్య ప్రధాని వాజ్‌పేయ్ మంత్రివర్గంలో ఆర్థిక శాఖను నిర్వర్తించారు. ఆయన కాలంలోనే భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పలు సంస్కరణలు ప్రవేశ పెట్టారు. బ్రిటిష్ బాటలోనే సాగుతూ అంతకు ముందు 53 సంవత్సరాలుగా వస్తున్న సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టే సాంప్రదాయానికి చెక్ పెట్టిన మొదటి ఆర్థిక శాఖమంత్రిగా చరిత్ర కెక్కారు.

జశ్వంత్ సింగ్

2002-2005 మధ్యకాలంలో వాజ్‌పేయ్ మంత్రివర్గంలో ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వర్తించిన జశ్వంత్ సింగ్ సమర్ధవంతమైన మంత్రిగా పేరుగడించారని చెప్పాలి. మార్కెట్ సంస్కరణలు ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించారు. మితవాద రాజకీయ నాయకునిగా పేరున్న జశ్వంత్..2001లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారు.

మన్మోహన్ సింగ్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 1991-1996 మధ్యకాలంలో పీవీనర్సింహారావు కేబినెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి .గా బాధ్యతలు నిర్వర్తించారు. దేశం ఆర్థిక సంక్షోభం ఎదు ర్కొంటున్న తరుణంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సింగ్...కీలకమైన ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన కాలంలోనే దేశంలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు మార్గం సుగ మం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రా రంభించారు.నేడు మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడానికి కార ణం సింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలే కారణం అనిచెప్పక తప్పదు.

ప్రణబ్ ముఖర్జీ

1982-1984 మధ్య కాలంలో ఇందిరాగాంధీ కేబినెట్‌లో, అలాగే 2009-2010 మధ్యకాలంలో మన్‌మోహన్ సింగ్ హయాంలోనూ ప్రణబ్ ముఖర్జీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఇందిరా హయాంలో ప్రపంచంలోనే ఉత్తమ ఆర్థిశాఖ మంత్రిగా కీర్తి గడించారు.

చిదంబరం

1996-1998 మరియు 2004-2009 మధ్యకాలంలో సుధీర్ఘ కాలం ఆర్థిక శాఖ బాధ్యతలు మోసిన కేంద్ర మంత్రి చిదంబరం. ప్రధాని పీవీ హయాంలోప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణలను కొనసాగించడంలో చిదంబరం కీలక భూమిక పోషించారు. సమర్థుడైన ఆర్థిక మంత్రిగా పేరు తెచ్చుకున్నారు.

చింతన

బుద్ధిమంతుడు భిన్నత్వాన్ని దర్శించడు

భగవద్గీత



యదా భూతపృథగ్భావమ్
ఏకస్థమనుపశ్యతి।
తత ఏవ చ విస్తారం
బ్రహ్మ సంపద్యతే తదా॥

అధ్యాయం 13, శ్లోకం- 31

తాత్పర్యం

బుద్ధిమంతుడైనవాడు భిన్నదేహముల కారణంగా భిన్న వ్యక్తిత్వములను దర్శించుటను విరమించి, జీవులు ఏ విధంగా సర్వత్రా విస్తరించిరో గాంచినపుడు బ్రహ్మభావమును పొందును.

భాష్యం

వేర్వేరు శరీరములు ఆత్మకు చెందినవి కావని, ఆత్మ కోరికల వలన వేర్వేరు శరీరాలలో కొనసాగవలసి వస్తుందని చూడగలిగినవారు వాస్తవాన్ని చూస్తున్నట్లు లెక్క. భౌతిక భావనలో ఇతడు దేవత, అతడు మానవుడు, లేదా కుక్క, పిల్లి ఇలా వేర్వేరు శరీరాలనే మనము చూస్తూ ఉంటాము. కానీ అది భౌతికమైన దృష్టి. శరీరములు నశించినప్పటికీ ఆత్మ ఒక్కటే. ఈ భౌతిక సృష్టిలో ఆత్మ వేరు వేరు శరీరాలను బట్టి వేర్వేరుగా కనిపిస్తుంది. ఎప్పుడైతే ఆధ్యాత్మికస్థితిని అర్థము చేసుకుని కృష్ణచైతన్యవంతుడవుతాడో, విశుద్ధ చైతన్యములో మానవుడు, జంతువు, పెద్ద, చిన్న అను తారతమ్యములను వీడి ఆధ్యాత్మిక దృష్టిని కలిగి ఉంటాడు. అటువంటి వ్యక్తి ఈ ప్రపంచాన్ని ఎలా చూస్తాడో రాబోవు శ్లోకములో వివరించబడినది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దిన ఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభ పరిణామాలు చోటు చేసుకొంటాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసికధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకా శాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేక పోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శ్రమ అధికమవుతుంది. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మధురభాషణే వాచక తపస్సు

> మనం ఎదుటనున్న వారినైనా, ఎదుటలేని వారి గురించి అయినా చెడుగా మాట్లాడడం వాచక హింసే. వ్యంగ్యంగా మాట్లాడడం అనేది మరొక తీవ్రమైన వాచక హింస. ఇతరులు కష్టంలో, బాధలో ఉన్నప్పుడు వారిని చూసి ఎగతాళి చేయడం, వ్యంగ్యంగా మాట్లాడడం లేదా నవ్వడం కూడా వాచక హింసే.



మాట్లాడేటప్పుడు మధురంగా మాట్లాడాలి. మన మాటలు ఇతరులకు ప్రశాంతతను, సంతోషం కలిగించాలి. మాటల్లో కాఠిన్యం ఉండకూడదు. "**నిర్దురకర్మస్య ఉర్జావమధుమతీ వాక్**" అని అధర్వవేదంలోని ఒక మంత్రం అంటే మన మాట శక్తివంతమై ఉండాలి. మధురంగా ఉండాలి. దుష్టస్వభావం ఉండరాదు. ఈ మూడు లక్షణాలు గల మాటలనే మాట్లాడడం సజ్జనుల ఆశయం కావాలి. మన మాట తీరు ఒకరిని నిందించేది. భయపెట్టేది కారాదు. ఇతరులను ఇబ్బంది పెట్టేలా ఉండరాదు. మనం మాట్లాడుతూ ఉంటే వినేవారు పెద్ద వృక్షం నీడలో సుఖంగా, ఆనందంగా ఉన్నామని భావించుకోవాలి. మండుటెండలో శీతలఛాయతో ఉంటే ఎలాంటి తృప్తి కలుగుతుందో మన మాట ద్వారా వారికలాంటి తృప్తి కలగాలి. అలా మాట్లాడగల ప్రజ్ఞనే వాగ్రూపమైన తపస్సు లేదా వాచక తపస్సు అంటారు. ఈ విషయం భగవద్గీత 17వ అధ్యాయం 15వ శ్లోకంలో శ్రీకృష్ణపరమాత్మ ఇలా వచించాడు.

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చయత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే॥

అనగా భయ దుఃఖాదులు కలిగించకుండుట, యథార్థ కథనము (సత్యవచనము), వినసొంపు కాలాంతరమున సుఖమును గూర్చుట, ఈ చతుర్గుణములతో కూడిన వాక్యములనే పలుకుట, వేదాధ్యయనము, వాగ్రూపమైన తపస్సు. ఇతరులను హింసించుట ధర్మము కాదు. మన ఋషిమునులు ధర్మానికి సరియైన నిర్వచనం చెప్పడం సాధ్యం కానిదంటూ ధర్మానికి ఉండవలసిన పది లక్షణాలను వివరించేరు. అంటే ఆ పది లక్షణాలను ఆచరించడమే ధర్మమని ప్రతిపాదించారు అందులో అహింస ఒక లక్షణం.

ఎదుటివారు ఎలాంటి మాటలతో మనను హింసిస్తారో అలాంటి మాటలను మనము వాడరాదు. పరుషమైన మాటల వలన ఎవరైనా బాధపడతారు. మాటలు కటువుగా ఉంటే బాధపడడం స్వాభావికం. వాచక తపస్సుకి పూర్తిగా విరుద్ధమైనది వాచక హింస. "**పాణిపీడవర్జనమ్**" అంటుంది శాస్త్రం. ఏ జీవులకు ఎలాంటి బాధను కలిగించడం గాని, కీడు కలిగించడం కాని కలుగజేయకూడదని ప్రతి వ్యక్తి నిశ్చయించుకోవాలి. ఏ ప్రాణికి ఎలాంటి బాధ కలిగించకుండుటయే అహింస. అహింసకు మించిన ధర్మము లేదు. హింస మూడు రకాలైనది, అవి శారీరక, మానసిక, వాచక హింసలు.

ప్రతి వ్యక్తి తను సమాజంలో గౌరవంగా బ్రతకాలని అనుకుంటాడు. తనను అందరు గౌరవించాలని అనుకుంటాడు. మనం ఇతరులను గౌరవిస్తేనే ఇతరులు మనలను గౌరవిస్తారు. తను ఇతరులను నిందిస్తూ ఎగతాళి చేస్తూ, తూలనాడుతూ మాట్లాడితే ఇతరులు మనలనెందుకు గౌరవిస్తారు? గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకోవలసినది.

ఒకరిని మాటలద్వారా హింసిస్తే దాని ప్రతికూల ప్రభావం నిందించిన వారిమీద పడుతుంది అని మనుస్మృతి చెప్తుంది. "నిందలు పడ్డ మనిషి మాత్రం సుఖంగా నిద్రిస్తాడు. ప్రశాంతంగా తిరుగుతాడు. కాని పరుష వాక్కులతో ఇతరులను నిందించినవాడే ఎక్కువ క్షోభను అనుభవిస్తాడు". నిందకు గురైన వ్యక్తిలో తనలో ఎలాంటి దోషము లేదని తనను తూలనాడడానికే ఎదుటివాడు ప్రయత్నిస్తున్నాడని వాటిని పట్టించుకోవలసిన అవసరం లేదు అన్న ఆత్మవిశ్వాసం ఉంటుంది. అయితే అవతలి వ్యక్తి శాంతంగా ఉంటే నిందించిన వాడు తప్పు చేసినట్లు గ్రహించి బాధపడతాడు. వేసిన బాణం ఆడిన మాట వెనక్కు రావు. ఒకరిని ముందుగా దుఃఖ పెట్టి ఆ తరువాత క్షమాపణ చెప్పినా ప్రయోజనం ఉండదు.

మనం ఎదుటనున్న వారినైనా, ఎదుటలేని వారి గురించి అయినా చెడుగా మాట్లాడడం వాచక హింసే. వ్యంగ్యంగా మాట్లాడడం అనేది మరొక తీవ్రమైన వాచక హింస. ఇతరులు కష్టంలో, బాధలో ఉన్నప్పుడు వారిని చూసి ఎగతాళి చేయడం, వ్యంగ్యంగా మాట్లాడడం లేదా నవ్వడం కూడా వాచక హింసే.

గచ్ఛతః స్కలనమ్ క్వపిభవతేవ ప్రమాదతః
హసంతి దుర్జనాః తతసమాదధతి సజ్జనాః

పొరపాటున ఎవరైనా జారిపడితే దుర్జనులు వారిని చూసి నవ్వుతారు. కాని మంచి మనస్సు గలవారు వారికి సహాయం చేసి ఓదార్చడానికి ప్రయత్నిస్తారు. అలా నవ్వడం అంటే వారిని మరింత బాధపెట్టడం. నవ్వు నాలుగు విధాల చేటు అన్న సామెత ఉంది. అనవసరపు నవ్వు ఎలాంటి తీవ్ర పరిణామాలకు దారితీస్తుందో చూపే ఒక ఉదంతం మహాభారతంలో ఉంది. చిత్రాతి చిత్రంగా నిర్మింపబడ్డ మయసభలో నడుస్తూ దుర్యోధనుడు ఒక పూల వాటిక అని అందులో అడుగుపెడతాడు. అది నిజానికి పూలవాటిక కాదు. అలా భ్రమింపజేసే చిన్న కొలను. అందులో పడిన దుర్యోధనుడిని చూసి ద్రౌపది ఇతర సఖులతో కలిసి నవ్వుతుంది. తను సరస్సులో పడినందుకు బాధపడుతున్న బాధకు మించి ఆ నవ్వు మరింత బాధ కలిగించింది దుర్యోధనునికి. ఆమె మీద కక్షసాధించాలనుకున్నాడు. తన ఎగతాళి పూర్వకమైన నవ్వుకు ఫలితంగా ద్రౌపది ఎన్నో అవమానాలను ఎదుర్కొంది. అందుకే సుమతీ శతకారుడిలా గంటాడు.


ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికామాటలాడి యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడె ధన్యుడు
సుమతీ.

అందువలన వాచక హింసకు దూరంగా ఉండడం శ్రేయస్కరం.

- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్)
09755110398

మహద్గ్రంథం

'రమ'ణీయం



ప్రపంచ రచనల్లో భగవద్గీతకు ఒక ప్రముఖ స్థానం ఉంది. అయితే అసలు భగవద్గీతలో ఉన్నది ఏమిటి? అది ఛాందసవాదులు భావిస్తున్నట్టు ఆధ్యాత్మిక పరిపూర్ణతను అందించే ఆధ్యాత్మిక గ్రంథమా? అభ్యుదయ వాదులు భావిస్తున్నట్టు ఓ పుక్కిటి పురాణంలోని భాగమా? సమాజాన్ని తిరోగమనంవైపు నడిపించే మరో విశ్వాస గ్రంథమా? అనే సందేహాలు రాకపోవు. ఈ అన్నిటిపై వాదోపవాదాలు జరిగాయి. అయితే విస్తృత రూపంలో మానవ వికాసాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని మనలో అణువణువునా ఆవిష్కరింపజేసే వ్యక్తిత్వ వికాస గ్రంథం భగవద్గీత అని చెప్పడం అతిశయోక్తి కాదు.


వ్యక్తిత్వ వికాసంలో వినయం, వివేకం, వందనం, విజ్ఞత, విజ్ఞానం అనే ఐదు 'వి'లు ఉన్నాయని చెబుతారు. ఈ ఐదు 'వి'లను విస్తృతంగా, అన్యాపదేశంగా అందిస్తుంది భగవద్గీత. వ్యక్తిత్వ వికాసంలో ఆంగ్లంలోని ఆరు 'డి'లు ఉంటాయని ఆధునిక వ్యక్తిత్వ వికాస నిపుణులు పేర్కొంటారు. అవి డిసిప్లిన్ (క్రమశిక్షణ), డివినిటి (దివ్యత్వం), డివోషన్ (భక్తి భావం), డిటర్మినేషన్ (పట్టుదల), డిస్క్రిమినేషన్ (విచక్షణ), డెడికేషన్ (అంకిత భావం). ఈ ఆరు 'డి'లను వినూత్న పద్ధతిన చర్చిస్తుంది, అందిస్తుంది భగవద్గీత. అంతేకాక మూడు 'పి'లు ప్యూరిటీ (స్వచ్ఛత), పర్ఫెక్షన్ (పరిపూర్ణత), పయస్‌నెస్ (పవిత్రత) గురించి ఎన్నో విధాలుగా విపులీకరిస్తుంది. భగవద్గీత. తత్ఫలితంగా మానవుని సంపూర్ణత్వాన్ని (టొటాలిటీ)ని ఆవిష్కరిస్తుంది. అందువల్ల భగవద్గీతను వ్యక్తిత్వ పోషణాత్మక గ్రంథం అని కూడా చెప్పక తప్పదు.

ఇక భగవద్గీతలో మత ఛాందసం ఉందంటారా?

భగవద్గీతలో ఎక్కడా, ఏ విధమైన మత ఛాందసం కనబడదు. సంస్కృతీ, సంప్రదాయం, సనాతన త్వపు జ్ఞానం, ప్రజ్ఞానం, సుజ్ఞానం ప్రతి మాటలోను ద్యోతకమవుతాయి. ఇంతటి విశిష్ట, విలక్షణలతో కూడిన మహాభాష్యాన్ని మరణ సమయంలో వినిపించే శోకగీతంలా కొందరు పరిగణించడం వారి అజ్ఞానానికి చి హ్నంలా భావించాలి. భగవద్గీతలో ఆత్మ గురించి, వైరాగ్యభావం గురించి చెప్పారు. అది తెలుసుకోవడం మంచిదే. కాని ఆ సమయంలో అది చదవాలనే నియమం ఎక్కడా లేదు. ఇది కొత్తగా తెలియనితనంతో వచ్చిన పోకడ. ఈ పోకడలో మార్పు రావాలి. భగవద్గీత ఏమిటో పేర్కొనడం ఒక్కమాటలో చెప్పడం సాధ్యం కాదు. అది జీవితానికి శాంతిని, ప్రశాంతతను అందించే ఊరట. పరమాత్మ చూపే వ్యవహార మార్గానికి అర్థాన్ని పారమార్థిక్యాన్ని, అందించే పవిత్ర గ్రంథం. అమరత్వాన్ని అమృతత్వాన్ని ఆవిష్కరింపజేసే రచన. ఆత్మ సౌందర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పరిపుష్టం చేసే ఉద్గ్రంథం.

మానవాళి మొత్తానికి జీవనాడి. జీవిత పథాన్ని, విధానాన్ని నిర్దేశించే మహోవ్రాత. దైవత్వం, మానవత్వాల మధ్య దూత. కురు క్షేత్ర సంగ్రామంలో గురువులను, బంధువులను చూసి మమకారంతో నీరు కారిన అర్జునునికి కర్తవ్య బోధ చేసిన శ్రీకృష్ణుని మాట. జీవితమనే యుద్ధంలో జయాలు, అపజయాలు, కష్టాలు, కన్నీళ్లు, మోదం, ఖేదం తప్పవని అన్నింటినీ ఓర్పుతో, నేర్పుతో ధైర్యంగా ఎదుర్కోవలసిందే అని జీవిత పాఠాలు నేర్పే మేనేజ్‌మెంట్ గ్రంథం. అది దేవదేవుడు మానవాళికి ఇచ్చిన అభయం, మానవాళి మొత్తాన్ని ఉన్న స్థానం నుంచి ఉన్నత శిఖరాలకు తీసికెళ్లే మహోత్కృష్టమైన, విశిష్టమైన, విశ్లేషణాత్మక శోధన. సాధకుని దివ్యత్వం అంచులకు తీసికెళ్లే మహిమాన్విత త్రోవ.

దేవ దేవుడే సూత్రధారియై, జీవుడే పాత్రధారుడై జగత్తనే రంగస్థలం మీద సమస్యలకు, సందేహాలకు సమాధానాలను తెలిపే దివ్య భవ్య మార్గనిర్దేశక గ్రంథం భగవద్గీత. 'అన్నీ నేనే, నువ్వు నిమిత్తమాత్రుడివి' అని పేర్కొంటూనే, అనాసక్తతను ప్రోత్సహించకుండా ప్రతిఫలం ఆశించకుండా పనిని మనం నిర్వహించి తీరాల్సిందేననే పరమ సత్యాన్ని నొక్కి చెప్పే విశ్లేషణాత్మక అభివ్యక్తీకరణ వ్యక్తిత్వ వికాస పరిపుష్టత అందించే అమృత ధార. హితాన్ని, పరహితాన్ని బోధించే మకరందపు ఊట. సమగ్ర సంపూర్ణ జీవన తత్వాన్ని, తాత్వికతను అందించే పరిపూర్ణ, ఆధ్యాత్మిక అనుభవ, ఆధునికతల కలబోత. అందుకే భగవద్గీత గీతామాతయింది. పూజనీయమయింది. గీతాపారాయణాన్ని ఒక యజ్ఞంగా నిర్వహిద్దాం. యజ్ఞ ప్రసాదాన్ని ఆరగిద్దాం, యజ్ఞఫలాన్ని అనుభవిద్దాం.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

నేనెవడను?

మనస్సు స్వరూపమేమి?

మనస్సు ఆత్మస్వరూపంలో ఉన్న ఒక అతిశయ శక్తి. దాని నుండియే అన్ని తలపులు తోచుచున్నవి. అన్ని తలపులను త్రోసివేసినపుడు మనస్సనేది వేఱుగా లేదు. కనుక తలపే మనస్సు స్వరూపము.

జగత్తనేది తలపులకన్న వేఱుగా లేదు. నిదురలో తలపులు లేవు. జగత్తు లేదు. జాగ్రత్తులోను, స్వప్నము లోను తలపులు కలవు; జగమును కలదు.

ప్రశ్నలు-సమాధానాలు


సాలెపురుగు తనలోంచే దారాలను బయటకు తీసి గూడు అల్లి మరల దానిని తన లోనికి తీసుకున్నట్లే మనస్సు తన లోంచి ప్రపంచాన్ని బయటకు నిర్మించి మరల తనలోనికి ఉపసంహరించుకుని మరుగు పరుస్తుంది.

మనస్సు ఆత్మ నుంచి బహిర్ముఖం అయినపుడు (బయటకు వెడలునపుడు) ప్రపంచం తోస్తుంది. ఆ కారణంగా జగత్తు కనపడినపుడు స్వరూపం తోచదు. స్వరూపం ప్రకాశించినపుడు (అనుభవమైనపుడు) ప్రపంచం తోచదు.

మనస్సు తనదైన స్వరూపాన్ని విచారిస్తూ (అన్వేషిస్తూ) పోయినచో 'తానే' మనస్సు అయి తీరుతుంది. 'తాను' అనగా ఆత్మ స్వరూపమే. మనస్సు ఎపుడూ ఒక స్థూల వస్తువును ఆశ్రయించే ఉంటుంది. అది ఒంటరిగా ఉండ లేదు. మనస్సే సూక్ష్మ శరీరమని. జీవుడని చెప్పబడుతుంది.

మనస్సు స్వరూపమును విమర్శించి తెలిసికొను మార్గమేమి?

ఈ శరీరంలో ''నేను'' అని తోచేదే మనస్సు. నేను అనే తలపు దేహంలో ఎక్కడ మున్ముందుగా స్ఫురిస్తుందని విచారిస్తే హృదయంలో అని తెలుస్తుంది. అదే మనస్సు పుట్టుచోటు. ''నేను నేను'' అంటూ స్మరణ చేసినా అక్కడికే చేర్చుతుంది. మనస్సుకు తోచే తలపులన్నింటిలో 'నేను' అనే తలపే మొదటిది. ఇది లేచిన తరువాతే ఇతరమైన తలపులు పుడుతుంటాయి. ఉత్తమ పురుష ''నేను'' తోచిన తరువాతే మధ్యమ, ప్రథమ పురుషలు ''నీవు'', ''వాడు'' మొదలైనవి తోస్తున్నాయి. ఉత్తమ పురుష లేకపోతే మధ్యమ, ప్రథమ పురుషలు ఉండవు.



మనస్సు ఎట్లు అణగును?

''నేనెవడను'' అనే విచారణ చేతనే మనస్సు అణగేది. నేనెవడననే తలపు ఇతర ఆలోచనలను అన్నింటిని నాశనం చేసి శవదహనంలో చితిని ముట్టించే కట్టెవలె తాను కూడా నశిస్తుంది. ఆ తర్వాత స్వరూప దర్శనమౌతుంది.

అనువాదం: ప్రణవానందులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



విశ్వామిత్ర ఆగమనం

బాలల శ్రీరామాయణం

అంతలోన హఠాత్తుగా
అయోధ్యలో ఒక రోజున
కొలువుదీర దశరథుడు
కోపిష్టిగా పేరువున్న
విశ్వామిత్రుడు వచ్చెను
వచ్చిన కార్యము చెప్పెను
తన యజ్ఞము కాపాడగ
తనయుడైన శ్రీరాముని
వెంట పంపుమని పలికెను
వెంటనె భూపతి వణికెను!
"ముక్కు పచ్చలార లేదు!
మునీశ్వరా! ఏ విధంగా
నా రాముని పంపగలను?
నాపై దయచూపు" మనెను!
దశరథుడెంతగ వేడిన
దయమాలిన ఆ తాపసి
కన్నులెఱ్ఱ జేసినాడు
కర్తవ్యం తెలిపినాడు!
అంతట బ్రహ్మర్షియైన
ఆచార్యుడు వశిష్ఠుడు
హితబోధన గావించగ
వెత అణగిన దశరథుడు
కడకు సమ్మతెరిగించెను
కౌశికునితో
పంపించెను!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్:9246541699





హంస నడక

1
పిల్లలూ! వయ్యారి హంస నడకదానా అనే పాట వినే ఉంటారు. నేను అచ్చు బాతు వలె ఉన్నప్పటికీ నన్ను అందరూ హంస అని పిలుస్తుంటారు. మా నడక చూసిన కవులు సినిమాల్లో పాటలు కట్టేస్తున్నారు. నేను అందంగా, వయ్యారంగా ఉంటాను మరి. మేం నడుస్తుంటే అందరూ గుడ్లప్పగిచ్చి చూడాల్సిందే. అన్ని పక్షులకు ఉన్న రెక్కల మాదిరిగా ఉండవు. చాలా బలమైన రెక్కలు ఉన్నాయి మరి.

2.
ఆస్ట్రేలియాలో మా జాతికి చెందిన హంసలు బాగానే ఉన్నాయి. అవి ఎక్కువగా నల్లగా ఉంటాయి. అక్కడ మావాళ్లంతా ఒకే కాలిద్వారా నీళ్లలో ఈదుతాయి. మరో కాలిని దిశలు మార్చుకోవడానికి ఉపయోగించుకుంటాయి. అంటే ఒక కాలు తెడ్డు మాదిరిగా పనిచేస్తుంది.

3.
బాతు మాత్రం శాఖాహారి, మాంసాహారి అయితే నేను మాత్రం పూర్తి శాఖాహారిని. నీళ్లలో ఉండే నాచు వంటి పదార్థాలను తింటూ గడిపేస్తాను. నీటి అంతర్భాగంలో కొన్ని రకాల మొక్కలు మొలకెత్తుతాయి. వాటిని తింటూ బొజ్జ నింపుకుంటాను.

4.
నేను మిగతా పక్షులతో పోలిస్తే కాస్త బొద్దుగా ఉంటాను. అందుకే నన్ను చూడగానే అందరికీ ముద్దొస్తుంది. ఒకసారి జతకట్టిన మగ లేదా ఆడ హంసతో మాత్రమే జీవితాంతం బంధాన్ని కొనసాగిస్తాము. చిన్నప్పుడే డిసైడ్ చేసుకుని ఆ విధంగా మేము ముందుకెళ్తాం. మేం నేల మీద ఆకులు అలముల మీద కూడా గూడు కట్టుకుంటాం. మూడు నుంచి తొమ్మిది గుడ్లు పెడతాం. ఒక్క నెలరోజుల లోపు మేం గుడ్లను పొదిగి పిల్లలను బయటికి తీస్తాం.

5.
పొడవైన మెడ మా అందాన్ని మరింత ఇనుమడింపజేస్తుంది. మేం ఎగరలేం కానీ గంతులు మాత్రం వేయగలం. మా శరీర బరువు ఎక్కువగా ఉండటం వల్ల మాకు రెక్కలు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది.

6
మేం మొత్తం ఏడు రకాలు. ప్రపంచవ్యాప్తంగా మా ఆనవాళ్లున్నాయి. రంగు, పరిమాణం వేర్వేరుగా ఉంటాయి. అది వేరే విషయమనుకోండి.

7
మేం అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరిపోయాం. ఈ వార్త వినేసరికి చాలా బాధపడ్డాం. అయినా ధైర్యం కోల్పోం. పర్యావరణ ప్రేమికులు మమ్మల్ని సంరక్షించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారన్న వార్త తెలుసుకుని తెగ సంబరపడిపోయాం.

నక్క తెలివి

ఒక అడవిలో ఒక సింహం వుండేది. అది ఎంతో కాలంగా జంతువులను వేటాడి తింటూ హాయిగా బ్రతకసాగింది. కానీ రోజులు గడిచే కొద్దీ సింహం ముసలిది అయిపోయింది. అది ఇంతకు మునుపులాగా జంతువులను వేటాడలేకపోయింది. మెల్లిగా అన్ని రోగాలూ చుట్టుముట్టాయి. దాంతో అది గుహలోనే కాలం గడపసాగింది. సింహం జబ్బు గురించి తెలిసిన జంతువులన్నీ ఒక్కోటి సింహాన్ని పరామర్శించడానికి దాని గుహకు వెళ్లేవి. వచ్చిన ప్రతి జంతువునూ వదలకుండా సింహం తింటూ వుండేది. ఇలా వుండగా ఒకసారి నక్క కూడా సింహాన్ని పరామర్శించాలని అనుకుంది. వెంటనే గుహలోకి వెళ్లకుండా అంతదూరాన నిలబడి గమనించసాగింది. ఆ రోజు సింహం చాలా ఆకలిగా వుంది. ఎందుకంటే ఆ రోజు ఒక్క జంతువు సింహాన్ని చూడటానికి రాలేదు. ఆకలితో అలానే కాళ్లు ఈడ్చుకుంటూ గుహ ద్వారం దగ్గర కొచ్చి కూలబడింది. అలా దిగాలుగా చూస్తున్న సింహానికి అల్లంత దూరాన వున్న నక్క కనిపించింది. నక్కను ఎలాగైనా తన గుహకు రప్పించాలనిఆప్యాయత ఒలకబోస్తూ .. నక్కా! ఏంటి అలా చూస్తున్నావు? అంత దూరాన నిలబడ్డావెందుకు? జంతువులన్నీ వచ్చి నన్ను పలకరించి వెళ్లాయి. రా! మనం పిచ్చాపాటి మాట్లాడుకుందాం అంది. నక్కకు ఎందుకో అనుమానం వచ్చింది. అక్కడ మట్టిలో పడ్డ జంతువుల అడుగుజాడలు గుహలోకి వెళ్లేవే వున్నాయి. కానీ గుహనుంచి బయటకు వచ్చినట్టు ఏ జంతువు అడుగు జాడలూ కూడా లేకపోవడం నక్క గమనించింది. అంటే తనను పరామర్శించడానికి వచ్చిన ప్రతి జంతువునూ సింహం తినేసింది. ఈ విషయాన్ని అర్థం చేసుకుంది నక్క. అయినా తెలివిగా తప్పుకోవాలని ఆలోచించిన నక్క సింహంతో ''మృగరాజా! నమస్కారం నీవు ఈ అడవికి మహారాజువు. మా కందరికీ ప్రభువువు. మన పెద్దలు చెప్పనే చెప్పారు కదా. ప్రభువును కానీ ముసలి వారిని కానీ చిన్నపిల్లలను కానీ చూడటానికి వెళ్లేటప్పుడు ఒట్టి చేతులతో వెళ్లకూడదని ఇది మరిచిన నేను పండ్లు ఫలాలు ఏమీ తేలేదు. అందుకే ఇంటికి వెళ్లి మంచి పండ్లు, తమకు ఇష్టమైన లేగదూడ మాంసం తీసుకుని త్వరగా వచ్చేస్తాను. నాకు అనుమతివ్వండి అని ఎంతో తీయగా పలికింది. నక్క మాటలు నమ్మిన సింహం సరే అలాగే కానీఅంది. త్వరగా రా! నీతో రాజ్యానికి సంబంధించిన చాలా విషయాలు మాట్లాడాలి. ఇక వెళ్లి రా అంది సింహం. సరేనని నక్క వడివడిగా నడక మొదలుపెట్టి కొంతదూరం వెళ్లాక పరుగులంకించుకుంది. ఇక సింహం గుహవైపు తిరిగి చూడకుండా అడవిలోకి పారిపోయింది. అంతేకాదు ఈ విషయాన్ని మిగతా జంతువులకి చెప్పింది. విన్న జంతువులన్నీ ఆ సింహాన్ని చంపెయ్యాలని అన్నాయి. కానీ ఆ పని మనం చేయనక్కరలేదు. మనం కొన్నాళ్లపాటు అటు వెళ్లకపోతే జబ్బు పడ్డ సింహం ఆ జబ్బుతోపాటు ఆకలి బాధతో అదే చస్తుందని నక్క చెప్పడంతో అన్నీ ఊపిరి పీల్చుకున్నాయి. కుతంత్రాలకు మారుపేరైన నక్కవంశంలోనే ఈ నక్క ఉత్తమ నక్క అని సంతోషించాయి మిక ఇటు సింహం పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారింది. నక్క చెప్పినట్టే జబ్బు తగ్గకపోగా ఆకలి బాధతో ప్రాణాలు వదిలేసింది.



- ఉలాపు

ఫ్లోటింగ్ ఫోర్క్స్

ఇక్కడ మీరు చూస్తున్న రెండు ఫోర్క్‌లు పంటిపుల్లల చివర్ల మీద బ్యాలెన్స్ చేసుకుంటున్నాయి. అదేంతో తెలుసుకుందామా!

కావాల్సిన పదార్థాలు
- రెండు ఫోర్క్‌లు
- రెండు పంటి పుల్లలు
- నీళ్లతో నిండి ఉన్న ఒక బాటిల్
- ఎరేసర్ (రబ్బరు ముక్క)

ఇలా చేయాలి

1. పంటిపుల్లను ఎరేసర్ మధ్య భాగంలో గుచ్చాలి. రబ్బరుముక్కను బాటిల్ మీద పెట్టాలి.
2. రెండు ఫోర్క్‌లను అంతర్గతంగా బిగుతుగా లాక్ చేయాలి. ఈ చిత్రంలో చూపించిన విధంగా లాక్ చేస్తే సరిపోతుంది.
3. రెండో పంటిపుల్లను కూడా రెండు ఫోర్క్‌ల మధ్య భాగంలో లాక్ చేయాలి.
4.ఎంతో సురక్షితంగా ఫోర్క్‌లను పైకి ఎత్తాలి.



పంటిపుల్లల సాయంతో ఎత్తాలి. అక్కడ ఎరేసర్‌ను కలపాలి.

చూడండి: ఎప్పుడైతే పంటిపుల్లలను ఫోర్క్ మధ్యభాగంలో అమర్చి పైకి ఎత్తినప్పటికీ క్రిందపడే అవకాశం లేకుండా పోయింది.

ఒకసారి ఆలోచించండి

ఫోర్క్ ఎందుకు పడిపోవడం లేదు?

ఏదేని వస్తువు బ్యాలెన్స్ చేసే సమయంలో బరువును రెండు వైపులా సమంగా పంచితే క్రిందపడిపోయే అవకాశంలేదు. వేలిచివర్లో స్కేల్‌ను పెట్టినప్పటికీ క్రిందకు పడిపోదు. ఈ విషయాన్ని మీరు గమనించే ఉంటారు. ఒక వైపు పొడవుగా ఉండి, మరో వైపు పొట్టిగా ఉంటే క్రిందపడిపోయే అవకాశం ఉంది. పొడవు ఎక్కువ ఉన్న భాగం క్రిందపడిపోతుంది. దీన్నే మధ్య భాగంలో గురుత్వాకర్షణ సిద్ధాంతం అని అంటారు.

ఈ ప్రయోగంలో మధ్య భాగంలో గురుత్వాకర్షణ ఉండటం వల్లే రెండు ఫోర్క్‌లు ఒక పాయింట్ మీద




కేంద్రీకృతమయ్యాయి. ఇక్కడ బ్యాలెన్స్ అంతా పంటిపుల్లల మీదే ఆధారపడి ఉంది.




పక పక

చనిపోయిన పక్షి

టీచర్: మీకు పక్షుల గూర్చి పూర్తిగా తెలుసు కదా?
విద్యార్థి: అవును
టీచర్: అయితే చెప్పు ఏ పక్షి ఎగరలేదు
విద్యార్థి: చనిపోయిన పక్షి



స్టార్స్ అయిపోయాయి



ఎల్‌కెజి స్టూడెంట్ పేపర్‌లో జీరో మార్కులొచ్చాయి
కోపంతో తండ్రి: ఇదేంటి?
కొడుకు: నాన్నా, టీచర్ వద్ద స్టార్స్ అయిపోయాయి కాబట్టి మూన్ ఇచ్చేశాడు.


తండ్రి: ఒక జమానాలో పదిరూపాయలు తీసుకుని బజారుకెళ్తే కిరాణా సరుకులు, కూరగాయలు, పాలు అన్నీ వచ్చేవి!
కొడుకు: నాన్నా! ఇప్పుడు జమానా మారిపోయింది. ఇవ్వాళ రేపు ప్రతీ దుకాణంలో సీసీటీవీ కెమెరా పెడుతున్నారు. దొంగతనం చేయడం కుదరదు మరి.



ఏం చేద్దామనుకుంటున్నారు?

న్యాయమూర్తి: ఇంట్లో యజమాని ఉన్నప్పుడు నువ్వు ఎలా దొంగతనం చేశావు?
దొంగ: సార్ మీ ఉద్యోగం బాగుంది. జీతం కూడా బాగానే ఉంటుంది. మరి మీరు ఇవన్నీ నేర్చుకుని ఏం చేద్దామనుకుంటున్నారు?





పదాల అల్లిక (పజిల్)

పిల్లలూ...ఈ రోజు మీకిస్తున్న మూడక్షరాల పదాల్లో రెండు మూడు అక్షరాలు 'క్ష', 'ణ'లు. మొదటి అక్షరాన్ని నింపి పదాలను తయారుచేయండి. ఆధారాల్లో ఇచ్చిన వివరాలను బట్టి పదాల అర్థాలను గ్రహించండి.

ఆధారాలు

1. వాడిగా సూటిగా చూడటాన్ని ఇలా అంటారు...ఎండ బాగా ఉన్నపుడు కూడా ఈ పదాన్ని వాడతారు.
2. ఇప్పుడే...అనాలంటే ఈ పదమే కరెక్టు. ఈ క్షణంలోనే ఈ పనిచేయి అని చెప్పడానికి ఈ పదాన్ని వాడతారు.
3. ట్రైనింగ్...అనే ఆంగ్లపదానికి తెలుగు అనువాదం ఇది. తర్ఫీదు అని కూడా అనవచ్చు.
4. తినడాన్ని ఇలా చెబుతారు. 'భరోసా'లో మీకు కావాల్సిన అక్షరం ఉంది.
5. ఏదైనా సరే భద్రంగా ఉండాలంటే ఇది కావాలి. పంటకయినా, దేశానికైనా, పిల్లలకైనా...ఇది చాలా అవసరం.
6. చూడటాన్ని ఇలా అంటారు...సినిమాకు ప్రేక్షకుల్లాగే...టీవీ చూసే వారి కోసం ఈ పదాన్ని వాడతారు.

1		క్ష	ణ
2		క్ష	ణ
3		క్ష	ణ
4		క్ష	ణ
5		క్ష	ణ
6		క్ష	ణ

జవాబులు: 1. తీక్షణ, 2. తక్షణ, 3. శిక్షణ, 4. భక్షణ, 5. రక్షణ, 6. వీక్షణ

-నిర్వహణ: వి.దుర్గాంబ

సింగిల్ విండో విధానం...
జిఎస్‌టి తగ్గింపు



చిత్రపరిశ్రమకు వరాలు

భారతీయ చిత్ర పరిశ్రమ చాలాకాలంగా కోరుతున్న సమస్యలకు పరిష్కారం లభించింది. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో చిత్రరంగానికి పలు వరాలు ప్రకటించారు. సినిమా పరిశ్రమ నుండి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ప్రధానంగా టికెట్ ధరపై తీవ్ర ప్రభావం చూపుతున్న జిఎస్‌టి తగ్గించాలనే డిమాండ్ కొంతకాలంగా పరిశ్రమ నుండి వస్తోంది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలుగు సినీరంగం పలుమార్లు విజ్ఞప్తులు చేసింది. ఈ విజ్ఞప్తి కేంద్ర ప్రభుత్వం దృష్టికి చేరింది. తాజా బడ్జెట్‌లో జిఎస్‌టి 12 శాతానికి తగ్గించారు. తొలుత 28 శాతం ఉన్న జిఎస్‌టి ఆ తర్వాత 18 శాతానికి, ఇప్పుడు 12 శాతానికి తగ్గింది. దీనివల్ల థియేటర్ టికెట్ ధరలు తగ్గే అవకాశం ఉంది. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇది అమలు అవుతుంది. సామాన్య ప్రేక్షకులకు థియేటర్ టికెట్ ధరలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో మధ్యంతర బడ్జెట్‌లో జిఎస్‌టి తగ్గించడం పట్ల సినీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. టికెట్ ధరలు తగ్గడం వల్ల థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం థియేటర్లలో అమ్మే తినుబండారాలను ఎమ్ఆర్‌పి ధరలకే విక్రయించాలని నిబంధన విధించింది. అలాగే థియేటర్లలో పార్కింగ్ రుసుము ఎత్తివేసింది. వీటికి అధనంగా టికెట్ ధరలు కూడా తగ్గితే నిర్మాతలకు మేలు చేకూరుతుందని భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరాల్లో సింగిల్ విండో విధానం ప్రధానమైనది. ఒక సినిమా షూటింగ్ చేయాలంటే రకరకాల అనుమతులు అవసరం. వీటి కోసం చిత్ర బృందం శ్రమపడాల్సి వస్తోంది. వివిధ డిపార్ట్‌మెంట్‌ల నుండి అనుమతులు తెచ్చుకోవాలి. ఇప్పుడు సింగిల్ విండో వల్ల ఈ శ్రమ తగ్గుతుంది. ఒకే చోట తీసుకునే అనుమతుల వల్ల ఎక్కడైనా షూటింగ్ చేసుకోవడం సులువు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు ఇప్పటి వరకు ప్రత్యేక అనుమతి కావాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బంది ఉండదని నిర్మాతలు అంటున్నారు.

పైరసీ భూతం సినీరంగాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. కొత్త సినిమా విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ ప్రత్యక్షం అవుతోంది. దీనివల్ల కోట్లాది రూపాయలతో సినిమాలు నిర్మించే నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. పైరసీ దార్లను అరికట్టేందుకు యాంటీ కామ్ కార్డింగ్ ప్రొవిజన్ యాక్ట్‌ను సినిమాటోగ్రఫి చట్టానికి అనుసంధానం చేయనునట్టు కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వంలోని సినిమాటోగ్రఫి మంత్రిత్వ శాఖ పరిధిలోకి కామ్ కార్డింగ్ ప్రొవిజన్ యాక్ట్ వస్తుంది కాబట్టి, దీనిని అరికట్టడం సులువు అవుతుందని సినివర్గాలు విశ్లేషిస్తున్నాయి.

స్వాగతిస్తున్నాం: సి. కల్యాణ్

ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు



కేంద్ర ప్రభుత్వం భారతీయ చిత్రపరిశ్రమకు ప్రకటించిన వరాల పట్ల ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు సి.కల్యాణ్ హర్షం వెలిబుచ్చారు. జిఎస్‌టి 12 శాతానికి తగ్గించడం వల్ల చాలా లాభం చేకూరుతుంది. జిఎస్‌టిపై కొంతకాలంగా గందరగోళం ఉండేది. ఇప్పుడు అది తీరింది. సింగిల్‌విండో అనుమతుల వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. ఎందుకంటే షూటింగ్‌ల కోసం అనుమతులు స్థానికంగా తీసుకోవాల్సి వస్తోంది. ఇక పైరసీ విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని చెప్పడం వల్ల సినీ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నట్టుగా సి.కల్యాణ్ పేర్కొన్నారు.



కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతరం బడ్జెట్ లో సినిమారంగంపై వరాలు కురిపించారు. సింగిల్ విండో పద్దతిన షూటింగ్‌లకు అనుమతి ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ విధానం విదేశీ చిత్రాలకు మాత్రమే అమల్లో ఉంది. ఇకపై స్వదేశీ చిత్రాల షూటింగ్‌లకు వర్తింపజేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. అలాగే సినిమా టికెట్ పై జీఎస్టీని కూడా 12 శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి రియూష్ గోయల్ ప్రకటించారు. శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఈ విషయాలను ఆయన వెల్లడించారు. సినిమా రంగాన్ని పీడిస్తున్న పైరసీని అరికట్టేందుకు యాంటీ కామ్ కార్డింగ్ ప్రొవిజన్ యాక్ట్‌ను సినిమాటోగ్రఫి చట్టానికి జత చేయనున్నట్టుగా ఆయన తెలిపారు.

జిఎస్‌టి తగ్గింపు మా ప్రపోజలే

-ముత్యాల రాందాసు (ప్రధాన కార్యదర్శి, తెలుగు ఫిల్మ్ ఛాంబర్)



సినిమా షూటింగ్‌లకు అనుమతుల విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. అందుకే సింగిల్ విండో అమలు చేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ చాలా కాలంగా కోరుతోందని ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి ముత్యాల రాందాసు తెలిపారు. జిఎస్‌టి తగ్గించాలని కూడా అడగడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ మాజీ ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ గారి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అందించాం. మా కృషి ఫలితంగానే మొత్తం భారతీయ చిత్రపరిశ్రమకు మేలు జరగడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. జిఎస్‌టి తగ్గించడం వల్ల సినిమా టికెట్ ధరలు తగ్గుతాయి. దాంతో సినిమా కలెక్షన్లు పెరిగి, సినిమాలకు మేలు చేకూరుతుంది అని ఆయన అన్నారు. సినీరంగానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీల నిర్ణయం వెనుకు తెలుగు సినిమా ఛాంబర్ కృషి ఉందని ఆయన పేర్కొన్నారు.



పాయల్‌రాజ్‌పుత్

ఇంజినీరింగ్ విద్యార్థులకు అంకితం

- 4 లెటర్స్ నిర్మాత ఉదయ్


ఉదయ్ కుమార్, ఆర్ రఘురాజ్

ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత ఉదయ్ కుమార్ నిర్మించిన చిత్రం 4 లెటర్స్. ఈశ్వర్, టువా చక్రవర్తి, అంకిత మహరాణా హీరో హీరోయిన్‌లుగా నటించారు. ఆర్ రఘురాజ్ దర్శకుడు. ఉదయ్ కుమార్‌తో పాటు దొమ్మరాజు హేమలత నిర్మాణ బాధ్యతలు వహించారు. త్వరలో 4 లెటర్స్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను దర్శకుడు ఆర్ రఘురాజ్‌తో కలిసి నిర్మాత ఉదయ్ కుమార్ వివరించారు.

దర్శకుడు ఆర్ రఘురాజ్ మాట్లాడుతూ...యువతకు నచ్చే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కించాం. లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అని చాలా సినిమాల్లో చూసుంటాం కానీ ఇందులో లవ్ ఎట్ సెవన్ లుక్ అని కొత్త కాన్సెప్ట్‌తో సినిమా చేశాం. చూడగానే పుట్టే ప్రేమలో పరిపక్వత ఉండదు. ఈ కథలోని జంటలో ఆ అనుభవం కనిపిస్తుంది. హీరో ఈశ్వర్ ఆకట్టుకునేలా నటించారు. ఈ కథకు కొత్త నాయికలు బాగుంటారని టువా చక్రవర్తి, అంకితను తీసుకున్నాం. అనుకున్న సమాయనికి సినిమాను పూర్తిచేశాం. కంటెంట్ బాగా వచ్చింది. రేపు థియేటర్‌లలో ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. అన్నారు. నిర్మాత ఉదయ్ కుమార్ మాట్లాడుతూ...మా అబ్బాయి ఈశ్వర్‌కు నటనలో ఉన్న ఆసక్తిని గమనించి సినిమా నిర్మించేందుకు ముందుకొచ్చాం. ఇంజినీరింగ్ విద్యార్థి కథతో తెరకెక్కించాం. నేనూ ఇంజినీర్‌నే. ఆ రంగంలో ఎలాంటి అనుభవాలు ఉంటాయో చూశాను. ఈ సినిమాను ఇంజినీరింగ్ విద్యార్థులకు అంకితమిస్తున్నాం. అనుకున్నది అనుకున్నట్లు సినిమా పూర్తి చేశాం. బ్యాంకాక్‌లో పాటల చిత్రీకరణ జరిపాం. భీమ్స్ అద్భుతమైన పాటలిచ్చారు. ప్రతి ఊరికి మా సినిమా పాటలు చేరిపోయాయి. నిర్మాణ వ్యయం కాస్త అటూ ఇటుగా అనుకున్నదానిలో జరిగింది. మా చిత్ర యూనిట్ అంతా తమ చిత్రంగా భావించి సినిమా చేశారు. మా అబ్బాయి ఈశ్వర్ నటన ఒక్కటే కాదు డ్రమ్స్, గిటార్, ఫ్లూట్ వాయించడంలో నైపుణ్యమున్న వాడు. వైజాగ్ సత్యానంద్ గారి దగ్గర శిక్షణ పొందాడు. ఆ సాధన సినిమాలో కనిపించింది. మా చిత్ర టీజర్‌ను పరిశ్రమలోని చాలా మంది పెద్దలకు చూపించాం. అందరూ బాగుందంటూ చెప్పారు. రేపు సినిమా కూడా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. అన్నారు.

తానే సర్వస్వం అనుకునే స్వయంవద



'స్వయంవద' సినిమా ఫస్ట్‌లుక్‌ను నిర్మాత లగడపాటి శ్రీధర్ ఆవిష్కరించారు. ఆదిత్య అల్లూరి, అనికారావు జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ వర్మ దర్శకత్వంలో రాజు దూర్వాసుల నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ ''స్వయంవద టైటిల్ ఆకట్టుకునే విధంగా ఉంది. సినిమా కూడా అదే విధంగా ఉంటుందని భావిస్తున్నాను. దర్శక, నిర్మాతలు కష్టపడి తీసిన ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

చిత్ర దర్శకుడు వివేక్ వర్మ మాట్లాడుతూ ''స్వయంవద అనేది సాంస్కృత పదం. దీనికి చాలా ప్రత్యేకత ఉంది. తన గురించి తానే సర్వస్వం అనే ఓ పాత గురించి సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో హీరోయిన్ ఆరు గెటప్స్‌లో కనిపిస్తుంది. అందరికీ నచ్చే విధంగా కామెడీ, సస్పెన్స్, థ్రిల్లర్‌గా రూపొందించాం'' అని చెప్పారు.

''పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరిదశలో ఉన్నాయని, టీజర్‌ను ఫిబ్రవరిలో, సినిమాను మార్చిలో విడుదల చేస్తామని'' నిర్మాత చెప్పారు.

ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్లతో పాటుగా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ చిత్రానికి సంగీతం: రమణ.జీవి., ఛాయాగ్రహణం: వేణు మురళీధర్.వి, కథ, మాటలు, కథనం, దర్శకత్వం: వివేక్ వర్మ.

ఇద్దరు పెద్ద హీరోల సరసన

ఎట్టకేలకు పాయల్ రాజ్‌పుట్ కెరీర్ మలుపు తిరిగింది. తొలుత పంజాబీ సినిమాలతో కెరీర్‌ను ఆరంభించిన ఈ హర్యానా భామ ఆర్.ఎక్స్.100 చిత్రంతో టాలీవుడ్‌లోకి ప్రవేశించింది. ఆర్.ఎక్స్.100 చిన్న చిత్రంగా రూపొంది...పెద్ద చిత్రం స్థాయిలో ఘన విజయం సాధించింది. అయితే ఆ చిత్రం తర్వాత పాయల్ కెరీర్ వెంటనే మలుపు తిరుగుతుందని చాలామంది అనుకున్నారు. కానీ టాలీవుడ్‌లో ఆమె అనుకున్నంతగా అప్పట్లో బిజీ కాలేకపోయింది. దాంతో తమిళ, పంజాబీ భాషలలో లభించిన రెండు, మూడు అవకాశాలను సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో ఉంది. ఈ మధ్యనే ఎన్టీఆర్ కథానాయకుడు చిత్రంలో జయసుధ పాత్రను పోషించిన ఆమె ఇప్పుడు రెండు పెద్ద చిత్రాలలో నటిస్తూ సందడి చేయబోతోంది. తాను ఏదైతే ఆశించానో అది ఇన్నాళ్లకు టాలీవుడ్‌లో సాకారం అవుతుండటం ఆమెకు ఎనలేని ఆనందాన్ని కలిగిస్తోందట. ప్రస్తుతం రవితేజ కథానాయకుడిగా రూపొందుతున్న డిస్కోరాజా చిత్రంలో నభానటేష్‌తో పాటు ఒక కథానాయికగా నటిస్తున్న ఆమెకు ఇప్పుడు నాగార్జున సరసన నటించే అవకాశం వచ్చిందని పరిశ్రమలో వినిపిస్తోంది. నాగార్జున తాజాగా రెండు చిత్రాలలో నటించాలని అనుకుంటున్నారు. వాటిలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో మన్మధుడు-2 చిత్రం ఒకటి. నాగార్జున తమ సొంత సంస్థ అన్నపూర్ణా బేనర్‌లో నిర్మించే ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉందని... పాయల్ రాజ్‌పుట్‌ను ఒక కథానాయికగా ఎంపిక చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఇలా ఇద్దరు పెద్ద హీరోల సరసన నటించే అవకాశం రావడంతో ఆమె కెరీర్ మలుపు తిరిగినట్లేనని అంటు న్నారు.

అందరికీ ఒకటే లైఫ్


సుమన్

జితన్ రమేష్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్ ' అనేది ఉప శీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకుంది. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చిత్ర దర్శకుడు మాట్లాడుతూ ''టెక్నాలజీ పేరుతో పరుగెడుతున్న నేటితరం... హ్యూమన్ రిలేషన్స్‌ను కోల్పోతోంది. దానికి ప్రాధాన్యత ఇవ్వాలనే అంశంతో వినోదాత్మక కథనంతో ఈ సినిమా తీశాం. సూపర్‌గుడ్ ఫిలింస్ ఆర్.బి.చౌదరి గారి అబ్బాయి జితన్ రమేష్ హీరోగా నటిస్తున్నాడు. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తున్నాం'' అని చెప్పారు.

నిర్మాత నారాయణ్ రామ్ మాట్లాడుతూ ''దర్శకుడు తెరకెక్కించిన విధానం బాగుంది. అందరికీ నచ్చే సినిమా అవుతుంది. ట్రైలర్‌లు, పాటలు బాగా వచ్చాయి. ఒకటే లైఫ్ మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం'' అని అన్నారు. ఈ చిత్రంలో సుమన్ మరో ముఖ్యపాత్రధారి.

ప్రేమలో 20 - 20


మోహిని

'లవ్ 20-20' పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. అరవింద్, మోహిని (మిస్ టీన్ కెనడా) హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై, మెక్విన్ గ్రూప్ యుఎస్ఏ సహకారంతో నిర్మాణమవుతున్న ఈ చిత్రం షూటింగ్ బెంగళూరు, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, కేరళ, హైదరాబాద్ ప్రాంతాల్లో జరుగుపుకుంది. తాజా షెడ్యూల్ ముంబైలో జరుపుతున్నారు. ఈ చిత్రం సెంథిల్ కుమార్ ఫోటోగ్రాఫీ దర్శకత్వంలో కొత్త కథాంశంతో తెరకెక్కుతోంది. యువ ప్రేక్షకులు ఆకట్టుకునే విధంగా లవ్ 20-20 అని టైటిల్ నిర్ణయించారు.

ఈ చిత్రానికి సంగీతం: సత్యన్, ఛాయాగ్రహణం; సెంథిల్ కుమార్, నిర్మాత :మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల, రచన, దర్శకత్వం: విఎస్.



నాకు తెలిసిన రాజకీయాలు సినిమానే

- మమ్ముట్టి

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి పాతికేళ్ల తర్వాత తెలుగు తెరపైకి వస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన యాత్ర సినిమా ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర నేపథ్యంతో రాజకీయ చిత్రంగా యాత్ర తెరకెక్కింది. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మమ్ముట్టి వైఎస్ పాత్రలో నటించిన తన అనుభవాలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ...సుదీర్ఘ విరామం తర్వాత తెలుగు సినిమాలో నటించాను. మలయాళంలో తీరిక లేకుండా చిత్రాలు చేస్తూ వచ్చాను. ఇక్కడ నటించే అవకాశాలు కొన్నిసార్లు వచ్చినా ఎందుకనో కుదరలేదు. కొన్నిసార్లు నాకు తగిన పాత్రలు దొరకలేదు. కొత్త దర్శకులతో పనిచేయడం నాకు కొత్తకాదు. ఇప్పటిదాకా నా నట ప్రయాణంలో మలయాళంలో 70 మంది కొత్త దర్శకులను పరిచయం చేశాను. వాళ్లలో చాలా మంది ఇప్పటికీ పరిశ్రమలో ఉన్నారు. తమిళంలో నేను పరిచయం చేసిన వాళ్లలో ఇద్దరు దర్శకులు అగ్ర దర్శకులుగా కొనసాగుతున్నారు. మహీ రాఘవ్ అప్పటికే రెండు చిత్రాలు చేశారు కాబట్టి అతన్ని నేను నమ్మడంలో తప్పులేదు. దర్శకుడు మహీ వి రాఘవ్ పూర్తి కథతో నా దగ్గరకు వచ్చారు. సినిమా పూర్తి చేయగల నిర్మాత ఉన్నారు. వాళ్లు నాపై చాలా నమ్మకం పెట్టుకున్నారు. సినిమాలో నేను చేయడానికి చాలా ఉంది. పైగా ఓ గొప్ప వ్యక్తి జీవిత కథ ఇది. అందుకే ఒప్పుకున్నాను. వైఎస్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను మాత్రమే యాత్ర కథకు ఉపయోగించాం. ఆయన పూర్తిస్థాయి జీవిత కథ కాదు. పాదయాత్రలో ప్రజలకు దగ్గరవడం, ఆ తర్వాత ముఖ్యమంత్రి అవడం లాంటి అంశాలుంటాయి. రెండు గంటలు నడిస్తే సినిమా ఎవరూ చూడరు. ఇది కేవలం యాత్ర కాదు ఆ యాత్రలో వివిధ రకాల కష్టాలున్న ప్రజలను కలవడం, వాళ్ల బాధలు తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపిస్తూ సాగుతుంది యాత్ర. ఆయన కలుసుకున్న ప్రజల్లో నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, నిరాశ్రయులు ఇలా చాలా మంది ఉన్నారు. ఈ చిత్రంలో నేను వైఎస్ ను అనుకరించేందుకు ఎక్కడా ప్రయత్నించలేదు. ఆయన వ్యక్తిత్వాన్ని మాత్రమే ప్రతిబింబించాను. వైఎస్ ఎలా నడుస్తారు, ఎలా మాట్లాడుతారు అనేది చేస్తే అది అనుకరణ అవుతుంది. ఆయన మనసులో ఉంటే ఎవరు చేయి ఊపినా అలాగే అనిపిస్తుంది.

ఏ ప్రాంతం వారైనా ప్రజలు ఒక్కటే. వాళ్ల ద్వారా విన్న కష్టాలు నన్ను చలించేలా చేశాయి. చాలా సార్లు చిత్రీకరణ సమయంలోనూ భావోద్వేగానికి గురయ్యాను. పాత్రను పోషించాలి కాబట్టి చేసుకుంటూ వెళ్లాం. ప్రజాస్వామ్యంలో ఉన్నాం కాబట్టి రాజకీయాల గురించి తెలుసుకోవడం ఇష్టమే. దశాబ్దాలుగా చిత్ర పరిశ్రమలో ఉన్నాను. నాకు తెలిసిన రాజకీయాలు సినిమానే. ఈ చిత్రానికి నా వరకు చేయాల్సిన ప్రయత్నమంతా చేశాను. సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నాను. నేను జీవితంలో ఏది ప్రణాళిక ప్రకారం జరగాలనుకోను. సినిమాలు కూడా అంతే. ఒక సినిమా చిత్రీకరణకు, బయటకు రావడానికి చాలా కారణాలు ఉంటాయి. నేను తెలుగువాడిని కాదు గానీ మనమంతా భారతీయులం. మన భాషలన్నీ సంస్కృతం నుంచి వచ్చినవే. మనం తినే ఆహారం, వేసుకునే దుస్తులు, మన భావోద్వేగాలన్నీ దాదాపు ఒకేలా ఉంటాయి. తెలుగు భాషలోని పదాలు సగానికి సగం మలయాళంలో దాదాపు ఒకేలా ఉంటాయి. తెలుగు సినిమాలు చూస్తుంటాను. రంగస్థలం, భరత్ అనే నేను చిత్రాలను ఇటీవల చూశాను. నా కెరీర్‌లో ఇప్పటిదాకా దాదాపు 380 చిత్రాలు చేసి ఉంటాను. ఈ చిత్రంలో నాతో పాటు సహ నటులు బాగా నటించారు. చిన్న పెద్ద అనే తేడా సినిమా ల్లో ఉండదు. ఏ సినిమాకైనా ప్రేక్షకుడు థియేటర్ లో ఒకే ధర చెల్లించి చూస్తాను. ప్రేక్షకుల నాణ్యమై న చిత్రాలు కోరుకుంటున్నా రు. సామాజిక మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి కాబట్టి వాళ్ల అభిప్రాయాలు చెబుతున్నారు. తెలుగు స్టార్స్‌లో చాలా మంది స్నేహితులే. నేను 80 దశకపు సభ్యుడిని కాదు 2018 కాలం వాడిని. అని అన్నారు.